

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శోభాయమానం

ఉగాది మన తొలిపండుగ. ఈసారి ఉగాదికి పేరు శోభకృత్. శోభ అంటే కాంతి. మన జీవితాలకు అవసరమైన... భాగ్యాల, సౌభాగ్యాల కాంతిని ఈ ఉగాది ఇస్తుందని ఆశిద్దాం. ఈసారి వసంత విషువత్ జరిగిన మరుసటి రోజున ఉగాది వచ్చింది. అంటే వసంత విషువత్ మొదలు అయిన మరుసటి రోజున చైత్రమాసం మొదలు అయింది. ఇది ఒక విశేషం. ఇలా జరగడం అరుదు. ఈ అరుదైన సంఘటన మనకు, దేశానికి, ప్రపంచానికి అత్యంత మేలు చెయ్యాలని అపేక్షిద్దాం.



ఉగాదితో చాంద్ర-సౌర (లూని సోలర్) సంవత్సరం మొదలు అవుతుంది. పౌర్ణమి చంద్రుడు చిత్త లేదా చిత్ర నక్షత్రంతో ఉండడం చైత్రమాసం. చైత్రమాసం తొలిరోజు అంటే చైత్రశుక్ల పాడ్యమి రోజు ఉగాది అవుతుంది. చంద్రుడు ఒక నక్షత్రంతో మొదలుపెట్టి, భూమి చుట్టూ తిరిగి మళ్లీ ఆ నక్షత్రం దగ్గరకు రావడానికి పట్టే కాలం నాక్షత్రమాసం అవుతుంది. సూర్యుడు భూమధ్యరేఖను ఉత్తరంవైపుగా దాటడం వసంత విషువత్ అవుతుంది. వసంత విషువత్ మార్చ్ 21న జరుగుతుంది. ఆ రోజు పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. సూర్య, చంద్ర గమనాలు ప్రాతిపదిక కాబట్టి చాంద్ర-సౌర సంవత్సరం అవుతుంది.

వ్యావహారిక శకానికి పూర్వం తొలిదశలో సప్త ఋషులు నాక్షత్ర సంవత్సరాన్ని, చాంద్ర-సౌర సంవత్సరాన్ని కలిపి పంచాంగాన్ని అమలులోకి తెచ్చారు. మూడు, ఐదు సంవత్సరాలలో వచ్చే అధికమాసాలను కలుపుకుని ఐదు సంవత్సరాలతో ఒక యుగం అని పంచాంగం పరంగా అమలు చేశారు. అప్పట్లో ఆ యుగం ఆరంభం శరత్ విషువత్, శరత్ ఋతువులో ఉండేది. ఈ ఐదు సంవత్సరాల యుగంలో మొదటి సంవత్సరంలో మొదటి రోజు యుగాది అని అయింది; అదే ఉగాది అయింది. ఈ యుగం జ్యోతిష శాస్త్రానికి అనుగుణ్యంగానూ రూపొందింది. 'జ్యోతి' అంటే నక్షత్రం అనీ 'షం' అంటే సంబంధించిన అనీ అర్థాలు. జ్యోతిషం అంటే నక్షత్రానికి సంబంధించినది అని అర్థం.

> మంచికి తొలి అడుగుగా, ఒక పండుగగా, తొలి పండుగగా ఉగాది మనకు అందివచ్చింది. ఇతర పండుగలా కాకుండా ఉగాది కాలానికి, ప్రకృతికి సంబంధించిన పండుగ. మనిషి కాలానికి, ప్రకృతికి అనుసంధానం అవ్వాలని తెలియజెప్పే ఒక విశిష్టమైన పండుగ ఉగాది.

నాక్షత్ర చాంద్ర- సౌర గమనాల ప్రాతిపదికన మన పంచాంగం నిర్మితమైంది. పంచాంగం ప్రకారం మనకు ఉగాది నిర్ణీతమైంది. సప్త ఋషుల తరువాత విశ్వామిత్ర మహర్షి పంచాంగంలోనూ, కాలగణనంలోనూ కొన్ని ప్రతిపాదనలను, మార్పులను తీసుకువచ్చాడు. ఆ తరువాత కాలక్రమంలో జరుగుతూ వచ్చిన ఖగోళమార్పులకు తగ్గట్టు గర్గ మహర్షి సంవత్సరాదిని వసంత విషువత్ కు మార్చాడు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు దాన్నే కొనసాగించారు. అదే ఇప్పటికీ వస్తోంది. వసంత విషువత్‌తో వసంతం మొదలు అవుతుంది; సాంప్రదాయిక సంవత్సరాన్ని లేదా ఆచార వ్యవహారాల కోసం సంవత్సరాన్ని చైత్రమాసంతో మొదలుపెట్టారు.

వసంతాన్ని కుసుమాకరం అనీ, కుసుమాగమం అనీ అంటారు. కుసుమానికి పుష్పం, పండు, ఫలం అని అర్థాలు ఉన్నాయి. ఈ మూడూ మనకు ఎంతో అవసరం అయినవి. తప్పకుండా మనం వీటిని పొందాలి. మన జీవితాలు కూడా నిండుగా పుష్పించాలి, పండాలి, ఫలవంతం అవ్వాలి. వసంతాన్ని ప్రకృతి ఇస్తున్న సందేశంగా మనం గ్రహించాలి. వసంతం ఒక సందేశం దాన్ని మనం అందుకోవాలి, అందుకుందాం.

> వసంత ఋతువు రావడాన్ని వసంతావతారం అని కూడా అంటారు. వసంతావతారం సంవత్సరానికి ఉన్న అవతారాలలో గొప్పది. ఆపై శోభాయామానమైంది. సంవత్సరానికి శోభ వసంతం. వసంతం మనకు వచ్చే ఋతువుల్లో ప్రధానమైంది లేదా కేంద్రభాగం. చెట్లకు కొత్త చివుళ్లు, కోయిలల గానాలు, పచ్చదనం, పువ్వుల కళకళలు. వీటిని వసంతం తెస్తుంది, ఇస్తుంది. వసంతంలో ఎక్కువ వేడి, చలి ఉండవు. వాతావరణం ఉల్లాసకరంగా ఉంటుంది. వసంతం శ్రేష్ఠమైంది కాబట్టే 'అహమృతూనాం కుసుమాకరః' అంటూ కృష్ణుడు భగవద్గీతలో తాను ఋతువుల్లో వసంతాన్ని అని చెప్పాడు.

> సంవత్సరంలో ఉండే మంచితనం వసంతం. వసంతం ప్రకృతి నుంచి మనకు అందివచ్చే మంచితనం. '... సంతో వసంతవల్లోకహితం చరంతః ...' అని వివేకచూడామణిలో ఆదిశంకరాచార్య అన్నారు. అంటే మంచివాళ్లు వసంతంలాగా లోకహితాన్ని ఆచరిస్తారు అని అర్థం. వసంతం వంటి హితం, హితం వంటి వసంతం మనకు, సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం.

ఆరు ఋతువులకు ఆదిగా వచ్చేది ఈ పండుగ. సంవత్సరంలోని ఆరు ఋతువులకు ప్రతీకలుగా తీపి, కారం, చేదు, వగరు, ఉప్పు, పులుపుల్ని తీసుకుని ఆ రుచుల కోసం వేపపువ్వు, బెల్లం, మిరియాలపొడి, చింతపండు, ఉప్పు, మామిడి ముక్కల్ని కలిపి ఉగాది పచ్చడిని మనం తీసుకుంటున్నాం. నింబకుసుమ భక్షణం అని పేరు. ఇది ఉగాది పండుగలో ముఖ్యాంశం. మరో ముఖ్యాంశం పంచాంగ శ్రవణం. ఆదిలోనే ఎవరి రాశి ప్రకారం వారికి సంవత్సరంలో జరగడానికి అవకాశం ఉన్న మేలు, కీడులను వ్యక్తులకు సూచనప్రాయంగా పంచాంగం చెబుతుంది. పంచాంగ శ్రవణానికి ముందుగా మనం అభ్యంగన స్నానం చేసి, మామిడి తోరణాలతో, పుష్పాలతో ఇళ్లను అలంకరించుకుని దైవపూజ చెయ్యాలి; చేద్దాం.

ప్రకృతి ఇచ్చిన సందేశాలుగా అందివచ్చిన ఉగాదిని, వసంతాన్ని ఆకళింపు చేసుకుని, ఆదర్శంగా తీసుకుని, మనం మనకు, ఇతరులకు ఈ ఏడాదిలోని అన్ని ఋతువుల్లోనూ హితకరం అవ్వాలి, అవుదాం.

- రోచిష్మాన్



పండగ ఇలా...


సూర్యోదయానికంటే ముందే నిద్రలేచి గుమ్మానికి మామిడాకుల తోరణాలు కట్టాలి. తలకు నువ్వుల నూనె పట్టించి నలుగు పెట్టుకుని స్నానం చేసి, కొత్త బట్టలు లేదా శుభ్రమైన ఉతికిన దుస్తులు ధరించాలి. తెలుపు రంగు లేదా ఈ సంవత్సరం ఉగాది బుధవారం వచ్చింది కాబట్టి వీలయితే బుధుడికి ఇష్టమైన ఆకుపచ్చ రంగు వస్త్రాలు ధరించడం మంచిది. పాలు పొంగించి, పిండి వంటలు సిద్ధం చేసి. ఇష్టదైవాన్ని పూజించాలి. తయారు చేసుకున్న వంటకాలను నైవేద్యంగా సమర్పించాలి. అల్పాహారం కంటే ముందుగా తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తినాలి. సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి ఇస్తుంది.



ఉగాది రోజున పంచాంగ శ్రవణం వింటే మంచిదని పెద్దలు చెబుతారు. ఆదాయ వ్యయాలు, రాజ పూజ్య అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు తెలియజెప్పే పంచాంగం వినటం ఆనవాయితీ. పల్లెల్లో రైతులు ఉగాది రోజున అక్కడి దేవాలయం వద్ద చేరి, పురోహితుడిని రప్పించి, తమ వ్యవసాయానికి ఏ కార్తెలో వర్షం పడుతుంది? గ్రహణాలు ఏమైనా ఉన్నాయా? ఏరువాక ఎప్పుడు సాగాలి? వంటివన్నీ అడిగి తెలుసుకుంటారు. ఉగాది రోజున కవి సమ్మేళనాలు జరగడం పరిపాటి.

ప్రాముఖ్యత

మత్స్యావతారం ధరించిన విష్ణువు సోమకుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణప్రతీతి. బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్ర మాస శుక్లపక్ష ప్రథమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు. అంటే కాలగణనాన్ని గ్రహ, నక్షత్ర, ఋతు, మాస, వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఈనాడు ప్రవర్తింపచేసాడన్నది పెద్దల భావన. అంతేకాదు, వసంత ఋతువు కూడా అప్పుడే మొదలవుతుంది. అందుకే కొత్త జీవితానికి గుర్తుగా ఉగాది పండుగను జరుపుకుంటారు.





ఇతర విశేషాలు

- ఈ రోజు కొత్తగా పనులు మొదలు పెట్టడం, కొత్తగా కార్యక్రమాలు ప్రారంభించడం మంచిది
- కృతయుగంలో కార్తీకశుద్ధ అష్టమి రోజున ఉగాది జరుపుకునేవారు.
- త్రేతా యుగంలో వైశాఖ శుద్ధ తదియ రోజున ఉగాది జరుపుకునేవారు.
- ద్వాపరయుగంలో మాఘ శుద్ధ అమావాస్య రోజున ఉగాది జరుపుకునేవారు.
- శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు పట్టాభిషిక్తులయినది చైత్ర శుద్ధ పాడ్యమి రోజుననే.
- వరాహమిహిరుడు పంచాంగాన్ని జాతికి అంకితం చేసింది చైత్ర శుద్ధ పాడ్యమి రోజుననే.



ఇంటికి ఉగాది కళ..



ఏడాది మొత్తం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని గుర్తు చేసే పండగ ఉగాది. కుటుంబసభ్యుల కలయికలో ఆనందం, షడ్రుచుల పచ్చడితో ఆరోగ్యం తెలియజేసే ఈ పండగ వసంతరుతువు ప్రారంభానికి సూచికగానూ జరుపుకుంటారు. శోభకృత్‌నామ సంవత్సరాన్ని శోభాయమానంగా అలంకరించడానికి..

● స్వాగతించే రంగోలి

అందమైన ముగ్గుల అలంకరణకు ఎంత శ్రద్ధ పెడతామో మనందరికీ తెలిసిందే. మరింత అందంగా తక్కువ సమయంలో అందరినీ ఆకట్టుకునే రంగోలిని తీర్చలేమనుకునేవారు రెడీమేడ్ డిజైనర్ రంగోలీలను కూడా ఎంపిక చేసుకోవచ్చు.



● డోర్ హ్యాంగింగ్స్

మెయిన్ డోర్ ఇంటికి శక్తిని, శుభాన్ని ఆహ్వానిస్తుంది. మనవైన హస్తకళలు లేదా ఛాయా చిత్రాలని ఉపయోగించవచ్చు. సంప్రదాయ వేడుక కాబట్టి ఇత్తడి డోర్‌బెల్స్‌ను అలంకరిస్తే ప్రత్యేక కళతో పాటు ఆ మువ్వల సవ్వడి ఆనందాన్ని ఇస్తుంది.

● మామిడి, వేప

శుభసూచికగా గుమ్మానికి మామిడి, వేప ఆకులతో తోరణం కడతారు. అలాగే, గుమ్మానికి ఒక వైపు చిన్న అరటి చెట్టును జోడించడం ఈ రోజును మరింత శుభ ప్రదంగా మార్చేస్తుంది. లేదంటే ఆర్టిఫిషియల్ అరటి చెట్టును కూడా వాడచ్చు.

● లైటింగ్

పండగ అలంకరణలో ప్రత్యేక స్థానాలు వంటగది, పూజ గది. ఈ రెండు ప్లేసుల్లో లైటింగ్ డల్‌గా ఉండే అవకాశాలు ఉంటాయి. అందుకని, ఈ ప్రత్యేకమైన రోజున లైటింగ్ విషయంలో శ్రద్ధ తీసుకుంటే కాంతిమంతంగా ఉంటాయి.

● హ్యాంగింగ్స్

వాల్ పేపర్లు, సంప్రదాయ వాల్ హ్యాంగింగ్స్, పూల దండలను వేలాడదీయడం వంటి మరిన్ని అందుబాటులో ఉండే అలంకరణ వస్తువులను ఎంచుకోవచ్చు. సువాసన గల ఇండోర్ ప్లాంట్ డెకొరేషన్ కూడా పండగ కళను పెంచుతుంది.

కొంచెం తీపి... కొంచెం చేదు



పచ్చి మామిడికాయ – ఒకటి (మీడియం సైజు); **వేప పువ్వు** – టేబుల్ స్పూన్ (తొడిమలు ఒలిచినది); **కొత్త చింతపండు** – నిమ్మకాయంత (రసం చిక్కగా తీసుకోవాలి); **బెల్లం తురుము** – 2 టేబుల్ స్పూన్‌లు; **ఉప్పు** – పావు టీ స్పూన్; **మిరియాలు లేదా మిరియాల పొడి** – అర టీ స్పూన్.

తయారీ: పచ్చి మామిడి కాయను శుభ్రంగా కడిగి చెక్కు తీయకుండా సన్నగా ముక్కలు తరగాలి. ఇందులో వేప పువ్వు, చింతపండు రసం, బెల్లం తురుము, ఉప్పు, పచ్చిమిర్చి వేసి కలపాలి. షడ్రుచుల ఉగాది పచ్చడి రెడీ. రుచి కోసం టేబుల్ స్పూన్ కొబ్బరి కోరు, ఒక అరటి పండు గుజ్జు కూడా కలుపుకోవచ్చు. ఇది ఆంధ్రప్రదేశ్ ఉగాది పచ్చడి. స్పూన్‌తో అరచేతిలో వేసుకుని తినేటట్లు చిక్కగా ఉంటుంది. తెలంగాణలో ఇదే మోతాదులో తీసుకున్న దినుసులను ఒక పెద్ద పాత్రలో వేసి ముప్పావు వంతు నీటిని పోసి కలపాలి. గ్లాసులో పోసి తాగేటట్లు జారుడుగా ఉంటుంది.

నేడు వరల్డ్ వాటర్ డే

నీటి పాఠాలు

గాలి తర్వాత ప్రాణాధారం నీటిచుక్క. గొంతెండిపోతే నోట్లకట్టలు దాహం తీర్చవు. నీటి చుక్క కోసం... అర్రులు చాచాల్సి వస్తుంది. ధారపోయడానికి చేతిలో డబ్బున్నా సరే... నేలతల్లి కడుపులో చుక్క మంచి నీరుండదు. జాగ్రత్త పడదాం... భవిష్యత్తును కాపాడుకుందామని... దేశాన్ని చైతన్యవంతం చేస్తున్నారు వసంతలక్ష్మి.

"2040 నాటికి నీటి కష్టాలు ఎలా ఉంటాయో తెలుసా? భావి తరాల కోసం ఆస్తులు కూడబెడుతున్నాం, బాగా చదివి పెద్ద ఉద్యోగం చేసి బాగా డబ్బు సంపాదించాలని వాళ్లకు నేర్పిస్తున్నాం. చేతి నిండా డబ్బు ఉండి గొంతు తడుపుకోవడానికి నీటి చుక్క లేని జీవితాలను పిల్లలకు అందిస్తున్నాం. ఇప్పుడు కూడా మేల్కొనకపోతే రాబోయే తరాలు కాదు కదా, మనతరమే నీటి ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. డబ్బు సంపాదనను వ్యసనంలాగ పిల్లల బుర్రల్లోకి ఎక్కించేస్తున్నాం, నీటి వృథాను అరికడదామని మాట మాత్రంగానైనా చెప్తున్నామా?'' ఇలా సాగుతుంది వసంతలక్ష్మి ప్రసంగం. నీటి సంరక్షణ గురించి పాఠం చెప్తోందామె. నేడు వరల్డ్ వాటర్ డే సందర్భంగా తన నీటి ఉద్యమం వివరాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

జలమే ధనం

''వర్షాలొస్తే రోడ్లు జలమయం, ఎండకాలం మొదలయ్యే నెల నుంచే రోడ్ల మీద నీటి ట్యాంకుల స్వైరవిహారం. ఆ ట్యాంకర్లను చూస్తే డేంజర్ బెల్స్ మోగించుకుంటూ వెళ్తున్నట్లే అనిపించేది. మనిషి భవిష్యత్తు ఎంతటి ప్రమాదంలో పడుతుందోననే దిశలో నా ఆలోచన సాగడంతో అధ్యయనం మొదలుపెట్టాను. గణాంకాలు భయపెట్టాయి. ఇదే ధోరణిలో నీటిని వృథా చేస్తుంటే మన తరమే నీటికోసం అల్లాడే రోజు వస్తుంది. అందుకే జలాన్ని మించిన ధనం మరొకటి లేదని చైతన్యవంతం చేసే పనిలో ఉన్నాను. కశ్మీర్‌లో మొదలు పెట్టిన 'జల్ ధన్ యాత్ర' ఉత్తరాఖండ్, హరియాణా మీదుగా ఢిల్లీకి చేరింది. వరల్డ్ వాటర్ డే (మార్చి 22) పురస్కరించుకుని గుర్‌గావ్‌లో 20వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించాం.


ఉత్తరాఖండ్‌లో నీటి సంరక్షణ పాఠాలు చెప్తున్న వసంతలక్ష్మి

జలగండం!

నీటి గురించిన వివరాల్లోకి వెళ్లేకొద్దీ వెన్నులో నుంచి వణుకు పుడుతుంది. మనదేశంలో మనిషి సగటున ఒక రోజుకి వృథా చేసే నీరు పదకొండు గ్యాలన్‌లుగా ఉంటోంది. జలపారల్ని చీల్చుకుని మరీ తోడేస్తున్నాం. మహారాష్ట్రలో భూగర్భజలాలు మైనస్‌లోకి వెళ్లిపోయాయి. మూడు వందల అడుగుల వరకు నీటి చుక్క ఆనవాలుకు కూడా అందడం లేదు. తమిళనాడులో ఒకప్పుడు 57 జీవనదులు ప్రవహించేవి. మనిషి భూమి ఆక్రమణ ఆకలికి నదులు కూడా బలయిపోయాయి. ఇప్పుడు ఐదారుకి మించి జీవనదుల్లేవక్కడ. మనకు నీటిని పొదుపు చేయడం, వృథాను అరికట్టడంలో విచక్షణ లేదు. అలాగే పరిశ్రమల వ్యర్థాల కారణంగా నీటి వనరులు కలుషితం కావడం గురించి ఏ మాత్రం ముందుచూపు లేదు. ప్రజల్లో చైతన్యం ఉంటే పరిశ్రమలు నిర్లక్ష్యంగా వ్యవహరించడానికి వెనుకాడతామయనేది నా అభిప్రాయం. పరిశ్రమల నిర్వాహకులు తాము వాడిన నీటిని శుద్ధి చేసి భూమిలోకి వదలాల్సి ఉండగా, ఆ నియమాలేవీ పాటించకుండా నేలకు రంధ్రాలు చేసి వదిలేస్తున్నారు. దాంతో భూగర్భజలాలు కలుషితమైపోతున్నాయి. పంజాబ్‌లో ఒక రైలును స్థానికులు క్యాన్సర్ రైలని పిలుస్తారు. ఆ రైలులో ప్రయాణించే వాళ్లలో... కలుషిత నీటిని తాగడం వల్ల క్యాన్సర్ బారిన పడిన వాళ్లు ఢిల్లీకి వైద్యానికి వెళ్లే వాళ్లే ఎక్కువని చెబుతారు. మనదేశంలో నీటి కాలుష్యానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి. 'ఉదాసీనంగా ఉంటే రాబోయే తరాలు మనల్ని క్షమించవు. మేల్కొండి' అని ఎలుగెత్తి చెబుతున్నాను'' అని చెప్పారు సామాజిక కార్యకర్త చీరాల వసంతలక్ష్మి. వాటర్ షెడ్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వసంతలక్ష్మి గత ఏడాది 'వాటర్ వారియర్' పురస్కారాన్ని అందుకున్నారు. ఇప్పుడు 'జల్ ధన్ యాత్ర' ద్వారా దేశవ్యాప్తంగా పర్యటించి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో విద్యార్థులు, మహిళలు, రైతులకు గణాంకాలతో సహా నీటి గురించి వివరిస్తున్నారు.

– వాకా మంజులారెడ్డి

సామాజిక 'స్నేహిత'

చీరాల వసంతలక్ష్మి పుట్టింది ఆంధ్రప్రదేశ్, నెల్లూరు నగరంలో. 'అమ్మతనానికి అవమానం జరగకూడదు. బిడ్డలందరూ సమానంగా పుడతారు. ఏ బిడ్డా అన్‌వాంటెడ్ కాదు... కాకూడదు. ఆడపిల్లను వద్దంటే నాకివ్వండి...బతికిస్తాను'... ఈ 'అమ్మ ఒడి'లో ప్రేమ ఉంది. 'ఇదిగో ఊయల'... అని పాతికేళ్ల కిందట నగరంలో 27 ఊయలలు పెట్టారు. 87 మంది పిల్లలకు అమ్మ అయ్యారామె. ఆ ఊయలను ప్రభుత్వం చేపట్టింది. తమిళనాడులో జయలలిత ప్రభుత్వమూ అందుకుంది.

- సమాజంలో తల్లులందరూ తమ పిల్లలను అనారోగ్యాల నుంచి సంరక్షించుకోగలిగిన అవగాహన కలిగి ఉండాలనే ఆశయంతో మొదలైన నా సేవలో ఏదీ ముందస్తు ప్రణాళిక ప్రకారం జరగలేదు. ఒక్కొక్కటిగా వచ్చి చేరుతూ నా బాధ్యతలను పెంచుతూ వచ్చాయి. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వచ్చినప్పుడు పిల్లలకు వ్యాక్సిన్ ఇప్పించాలంటే రిజిస్టర్ అయిన సంస్థ ఉండాలన్నారు. అలా నా సేవ 1998లో వ్యవస్థీకృతమైంది.
- స్పెషల్ కిడ్స్ 150 మందిని దత్తత తీసుకున్నాను. వాళ్లతో డీల్ చేయడం కోసం నేను స్పెషల్ బీఈడీ చేసి వాళ్లకు ఎడ్యుకేటర్‌గా మారాను. అలాగే మహిళల సమస్యల గురించి పోరాడే క్రమంలో చట్టాలు తెలుసుకోవడానికి బీఎల్ చదివి... సేవలను ఎనిమిది రాష్ట్రాలకు విస్తరించాను.
- కరాటేలో బ్లాక్‌బెల్ట్, రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడలిస్ట్‌ని కావడంతో బాలికలు, మహిళల మీద జరుగుతున్న అత్యాచారాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి కాలేజ్ విద్యార్థినులు, స్వయం సహాయక బృందాల మహిళలు మొత్తం పదిహేను వేల మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రమాదాల బారిన పడకుండా కొన్ని మెళకువలు నేర్పించాను. అలాగే చనిపోవాలనుకున్న వాళ్లకు 'స్నేహిత'నయ్యాను. సర్వీస్ అనే ఉద్దేశంతో మొదలు పెట్టలేదు. కానీ ఎక్కడ అవసరం ఉందనిపిస్తే అక్కడ వాలిపోతూ నా ప్రయాణం నీటి సంరక్షణ దిశగా సాగుతోంది.

– సీహెచ్. వసంతలక్ష్మి, అడ్వొకేట్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్


స్పెషల్ కిడ్‌కి మాటలు నేర్పిస్తూ...

బుధవారం 22-3-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ఎంబాపె సారథ్యంలో బరిలోకి ఫ్రాన్స్...

ఫ్రాన్స్ ఫుట్‌బాల్ జట్టు కొత్త కెప్టెన్‌గా స్టార్ ఫార్వర్డ్ కిలియాన్ ఎంబాపె నియమితుడయ్యాడు. 24 ఏళ్ల ఎంబాపె 2018 ప్రపంచకప్‌లో ఫ్రాన్స్‌కు టైటిల్ దక్కడంలో... 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలువడంలో కీలకపాత్ర పోషించాడు. పదేళ్లకంటే ఎక్కువ కాలం నుంచి ఫ్రాన్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్న గోల్‌కీపర్ హ్యూగో లోరిస్ ప్రపంచకప్ ముగిశాక సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగాడు. 2024 యూరో క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా శుక్రవారం నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఎంబాపె కెప్టెన్‌గా బరిలోకి దిగుతాడు.

క్లాసెన్ మెరుపు శతకం



వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో దక్షిణాఫ్రికా నాలుగు వికెట్లతో గెలిచి సిరీస్‌ను 1-1తో ముగించింది. హెన్రిక్ క్లాసెన్ (61 బంతుల్లో 119 నాటౌట్; 15 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు శతకంతో దక్షిణాఫ్రికాను గెలిపించాడు. విండీస్ 48.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా 29.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి గెలిచింది. తొలి వన్డే రద్దు కాగా... రెండో వన్డేలో విండీస్ నెగ్గింది.

ఫైనల్లో ఢిల్లీ

ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్


అలైస్ క్యాప్సీ

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారంతో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో ఢిల్లీ క్యాపిటల్స్ ఐదు వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను ఓడించగా... ముంబై ఇండియన్స్ నాలుగు వికెట్లతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుపై గెలిచింది. ఢిల్లీ, ముంబై 12 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ ఆధారంగా ఢిల్లీ (1.856) 'టాపర్'గా నిలిచి ఫైనల్ చేరింది. మరో ఫైనల్ బెర్త్ కోసం శుక్రవారం జరిగే ఏకైక ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో ముంబై తలపడుతుంది.

ఢిల్లీతో మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. తాలియా (58 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేసింది. ఢిల్లీ బౌలర్లలో అలైస్ క్యాప్సీ (3/26) ఆకట్టుకుంది. ఢిల్లీ 17.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. క్యాప్సీ (34; 4 ఫోర్లు, 1 సిక్స్), మరిజాన్ కాప్ (34 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), లానింగ్ (23 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిలకడగా ఆడి ఢిల్లీ విజయంలో కీలకపాత్ర పోషించారు. ముంబై తో మ్యాచ్‌లో తొలుత బెంగళూరు 9 వికెట్లకు 125 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమెలియా కెర్ (3/22) రాణించింది. ముంబై 16.3 ఓవర్లలో 6 వికెట్లకు 129 పరుగులు చేసి గెలిచింది. అమెలియా కెర్ (31 నాటౌట్; 4 ఫోర్లు), యస్తిక (30; 6 ఫోర్లు) దూకుడుగా ఆడారు.

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
ఢిల్లీ	8	6	2	12	1.856
ముంబై	8	6	2	12	1.711
యూపీ	8	4	4	8	-0.200
బెంగళూరు	8	2	6	4	-1.137
గుజరాత్	8	2	6	4	-2.220

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

'వన్డే' విజేత ఎవరో?


ప్రాక్టీస్ సెషన్‌లో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

- నేడు భారత్, ఆస్ట్రేలియా చివరి మ్యాచ్
- గెలిచిన జట్టు ఖాతాలో సిరీస్
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అంతర్జాతీయ క్రికెట్‌లో రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య సమరం చివరి ఘట్టానికి చేరింది. టెస్టు సిరీస్‌ను గెలుచుకొని భారత్ ఆధిక్యం ప్రదర్శించగా, ఒక విజయంతో ఆసీస్ కూడా సంతృప్తిగా ముగించింది. ఇప్పుడు వన్డేల్లో ఇరు జట్లు సమంగా నిలిచిన స్థితిలో సిరీస్ విజేతను తేల్చే ఆఖరి సమరానికి సమయం ఆసన్నమైంది. విశాఖలో ఎదురైన ఘోర పరాజయానికి బదులు తీర్చుకుంటూ ఘనంగా ముగించాలని టీమిండియా భావిస్తుండగా... భారత్‌లో సిరీస్ సాధించే అరుదైన అవకాశాన్ని వదులుకోరాదని కంగారూలు పట్టుదలగా ఉన్నారు. ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న నేపథ్యంలో ఆసక్తికర పోరుకు చెన్నై వేదిక కానుంది.

చెన్నై: ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో ఎంతో శ్రమించి నెగ్గిన భారత రెండో వన్డేలో పూర్తిగా చేతులెత్తేసింది. టెస్టు సిరీస్ ఫలితం ఎలా ఉన్నా మన వన్డే టీమ్ బలహీనతలను గత మ్యాచ్ చూపించింది. వరల్డ్ కప్ ఏడాదిలో ఆస్ట్రేలియాలాంటి పటిష్టమైన జట్టు ఎదురైతే పరిస్థితి ఎలా ఉంటుందనేది మనకు తాజా ఫలితం చూపించింది. ఈ నేపథ్యంలో ఆసీస్‌ను ఓడించి సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవడం భారత జట్టు తక్షణ లక్ష్యం. అయితే గత మ్యాచ్ ఇచ్చిన ఉత్సాహంతో స్మిత్ సేన కూడా సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది. ఇలాంటి స్థితిలో భారత్, ఆసీస్ నేడు జరిగే చివరి వన్డేలో తలపడబోతున్నాయి.

సుందర్‌కు చాన్స్!

'సూర్యకుమార్‌కు మేం కనీసం 7-10 వన్డేల్లో అవకాశం కల్పిస్తాం' వరుసగా రెండు మ్యాచ్‌లలో తొలి బంతికే అవుటైన తర్వాత కూడా కెప్టెన్ రోహిత్ చేసిన వ్యాఖ్య ఇది. దీనిని బట్టి చూస్తే భారత బ్యాటింగ్‌కు సంబంధించి టీమ్‌లో మార్పులు ఉండకపోవచ్చు. ఈ బ్యాటింగ్ బలగంతోనే విజయాన్ని అందుకోవాలని రోహిత్ పట్టుదలగా ఉన్నాడు. అయితే వైజాగ్‌లో స్టార్క్ బౌలింగ్‌ను చూస్తే టాప్-5 బ్యాటర్లు చాలా జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. స్వయంగా రోహిత్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉండగా, గిల్ నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. కోహ్లి కూడా సత్తా చాటితేనే భారత్ విజయంపై ఆశలు పెంచుకోవచ్చు. బౌలింగ్ విషయంలో భారత్ ముందు ఇతర ప్రత్యామ్నాయాలేవీ లేవు కాబట్టి పేసర్లుగా షమీ, సిరాజ్ ఖాయం. పాండ్యా ఆల్‌రౌండర్‌గా తన పాత్ర నెరవేర్చగలడు. అక్షర్, జడేజాలాంటి స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లకు తోడుగా మరో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు ఈ మ్యాచ్‌లో చోటు దక్కవచ్చు. పెద్దగా ఆకట్టుకోని కుల్దీప్ యాదవ్ స్థానంలో సుందర్ తన సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడే అవకాశాలున్నాయి.

వార్నర్ సిద్ధం...

మరోవైపు సిరీస్ గెలిచే అవకాశాన్ని కోల్పోరాదని భావిస్తున్న ఆస్ట్రేలియా దానికి తగిన వ్యూహరచన చేస్తోంది. స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఒక పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అబాట్‌ను తప్పించి అతని స్థానంలో మ్యాక్స్‌వెల్‌ను ఆడించనుంది. దూకుడైన బ్యాటర్ వార్నర్ గాయం నుంచి కోలుకోవడం జట్టు బలం పెంచింది. టెస్టుల్లో వార్నర్ విఫలమైనా... పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతను ఇప్పటికీ స్టార్ బ్యాటరే. మార్ష్, హెడ్ విజయవంతమైన ఓపెనింగ్ జోడీనే అయినా వార్నర్ ఆడితే మార్ష్ మిడిలార్డర్‌కు మారతాడు. స్టొయినిస్, గ్రీన్‌లాంటి ఆల్‌రౌండర్లతో ఆసీస్ పటిష్టంగా ఉంది. అన్నింటికి మించి స్టార్క్ సూపర్ ఫామ్ జట్టును ముందంజలో నిలుపుతోంది. రెండు మ్యాచ్‌ల లోనూ అతను భారత బ్యాటర్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. ఇదే ఒత్తిడిని స్టార్క్ కొనసాగించాలని ఆసీస్ కోరుకుంటోంది.

పిచ్, వాతావరణం

చాలా కాలంగా చెపాక్ మైదానం స్పిన్‌కు అనుకూలం. భారీ స్కోర్లు ఎక్కువగా నమోదు కాలేదు. ఈసారీ అలాగే కనిపిస్తోంది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, సూర్యకుమార్, రాహుల్, పాండ్యా, జడేజా, అక్షర్, సుందర్, షమీ, సిరాజ్.
ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), వార్నర్, హెడ్, మార్ష్, క్యారీ, గ్రీన్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, అగర్, స్టార్క్, జంపా.

అక్టోబర్ 5 నుంచి వన్డే వరల్డ్‌కప్!

నవంబర్ 19న అహ్మదాబాద్‌లో ఫైనల్

న్యూఢిల్లీ: పుష్కర కాలం తర్వాత భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి సంబంధించి తేదీలు దాదాపుగా ఖరారయ్యాయి. బీసీసీఐ దీనిపై అధికారిక ప్రకటన చేయకపోయినా, గత వారం దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సమావేశంలో ఈ వివరాలు అందించినట్లు సమాచారం. దీని ప్రకారం అక్టోబర్ 5న ప్రపంచ కప్ ప్రారంభమవుతుంది. నవంబర్ 19న అహ్మదాబాద్‌లో ఫైనల్ నిర్వహిస్తారు. 10 జట్లు టోర్నీలో పాల్గొంటుండగా, 46 రోజుల పాటు మొత్తం 48 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. వేదికల విషయంలో అహ్మదాబాద్ కాకుండా మరో 11 నగరాలను బీసీసీఐ ప్రాథమికంగా 'షార్ట్ లిస్ట్' చేసింది. ముంబై, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ధర్మశాల, గువాహటి, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ఇండోర్, రాజ్‌కోట్ ఈ జాబితాలో ఉన్నాయి. అక్టోబర్-నవంబర్ నెలలో భారత్‌లో ఉండే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్‌లు, వాటి వేదికల వివరాలకు సంబంధించి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా ఖరారు చేయలేదు. అయితే త్వరలోనే దీనిని వెల్లడిస్తామని ఐసీసీకి బోర్డు సమాచారమిచ్చింది. పాకిస్తాన్ జట్టుకు వీసా మంజూరు, భారత ప్రభుత్వం నుంచి పన్ను రాయితీ అందించడం వంటి అంశాలపై కూడా బీసీసీఐ మరింత స్పష్టతనివ్వాల్సి ఉంది. 2011లో చివరిసారిగా భారత్‌లో వన్డే వరల్డ్ కప్ జరగ్గా... ఫైనల్లో శ్రీలంకను ఓడించి మన జట్టే విజేతగా నిలిచింది.

పతకానికి విజయం దూరంలో...

క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్, నీతూ, మనీషా, జాస్మిన్


నిఖత్

న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న డిఫెండింగ్ చాంపియన్, తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (50 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), నీతూ (48 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో గెలిచి సెమీఫైనల్ చేరితే ఈ నలుగురికీ కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. మరోవైపు శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయా రు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో నిఖత్ 5-0తో పాట్రిసియా అల్వారెజ్ (మెక్సికో)పై, సుమయా కొసిమోవా (తజికిస్తాన్)పై నీతూ, నూర్ ఎలిఫ్ తుర్హాన్ (తుర్కియే)పై మనీషా, సమదోవా (తజికిస్తాన్)పై జాస్మిన్ గెలుపొందారు. శశి చోప్రా 0-4తో మాయ్ కిటో (జపాన్) చేతిలో, నవ్‌బఖోర్ ఖమిదోవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో మంజు ఓడిపోయారు.

సెంచరీతో నెదర్లాండ్స్‌ను గెలిపించిన తేజ



హరారే: జింబాబ్వేతో మంగళవారం జరిగిన తొలి వన్డేలో నెదర్లాండ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 47.3 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. మదాండే (74; 6 ఫోర్లు) టాప్ స్కోరర్. నెదర్లాండ్స్ బౌలర్ ఫ్రెడ్ క్లాసెన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం నెదర్లాండ్స్ 49.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసి విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జన్మించి నెదర్లాండ్స్ జట్టుకు ఆడుతున్న అనిల్ తేజ నిడమనూరు కెరీర్‌లో తొలి శతకం సాధించడం విశేషం. తేజ 96 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 64 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన నెదర్లాండ్స్‌ను తేజ ఆదుకున్నాడు. తేజ ఆరో వికెట్‌కు అకెర్‌మన్ (50; 4 ఫోర్లు)తో కలిసి 46 పరుగులు... షారిజ్ అహ్మద్ (30; 2 ఫోర్లు)తో కలిసి ఏడో వికెట్‌కు 110 పరుగులు జోడించాడు. 1994 ఆగస్టు 22న విజయవాడలో జన్మించిన తేజ ఆ తర్వాత న్యూజిలాండ్‌కు వెళ్లి అక్కడ విద్యాభ్యాసం చేసి స్థానిక ఆక్లాండ్ జట్టుకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. అనంతరం 2019లో నెదర్లాండ్స్‌కు వెళ్లి ఉద్యోగం చేస్తూనే క్రికెటర్‌గా కొనసాగుతున్నాడు. గత ఏడాది అంతర్జాతీయ వన్డే, టి20 క్రికెట్‌లో నెదర్లాండ్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు తేజ 9 వన్డేల్లో, 6 టి20ల్లో నెదర్లాండ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

సినిమా

• ఉగాది స్పెషల్

పచ్చడి తింటాం.. చేయడం రాదు

- శివాని, శివాత్మిక





హైదరాబాద్‌లో ఉంటే అమ్మ, నాన్న, మేమిద్దరం కలిసి పండగ జరుపుకుంటాం. అమ్మ ఉగాది పచ్చడి, గారెలు, పులిహోర, పాయసం .. ఇలా అన్నీ చేస్తుంది. ఒకవేళ మేం చెన్నైలో ఉంటే... అక్కడి మా బంధువులతో పండగ జరుపుకుంటాం. మా ఇద్దరికీ పచ్చడి తినడం తప్ప చేయడం రాదు. మా చిన్నప్పుడు ఇద్దరం ముగ్గులు వేసేవాళ్లం. పండగ అంటే మాకు ముగ్గులే ఎగ్జయిటింగ్. ఇక పండగ రోజున కొత్త బట్టలంటే అది ఆ రోజు మూడ్‌ని బట్టి ఉంటుంది. ఒక్కోసారి ఫుల్ ట్రెడిషనల్‌గా డ్రెస్ చేసుకుంటాం.. చక్కగా నగలు పెట్టుకుని గుడికి వెళతాం. చీర, లంగా, ఓణీ, చుడీదార్.. ఇలా ఏదో ఒకటి ప్రిఫర్ చేస్తాం. ఇప్పుడు చెన్నైలో ఉన్నాం. ఈసారి ఫుల్ ట్రెడిషనల్‌గా రెడీ అవుతాం. ఈ ఉగాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని కోరుకుంటూ.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.

ఇంకా మంచి ఆర్టిస్ట్‌గా గుర్తింపు సంపాదించుకోవాలనుకుంటున్నాను. ఇంకా మంచి నటిగా ఎదగాలని ఉంది. అలాగే మంచి డాక్టర్ అవ్వాలన్నది లక్ష్యం. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ మెడిసిన్ చేస్తున్నాను. ఏం చేసినా నిబద్ధతతో చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. వర్కవుట్, మాటింగ్, చదువు, హార్స్ రైడింగ్.. ఏదైనా మరింత క్రమశిక్షణగా చేయాలనుకుంటున్నాను.
- శివాని

ఈ సంవత్సరం చేతినిండా పని ఉండాలని కోరుకుంటున్నాను. తెలుగు, తమిళంలో సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాగే ఇతర భాషల్లోనూ అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను. కెరీర్‌పరంగా ఎదగాలన్నదే ప్రస్తుత లక్ష్యం. వీలైతే ఏదైనా స్పోర్ట్ నేర్చుకోవాలని ఉంది. ఏడాది మొత్తం చాలా ప్రశాంతంగా గడిచిపోవాలని ఉంది. ఆరోగ్యం బాగుండాలి.
- శివాత్మిక

ఇది స్టన్నింగ్ షో - రాజమౌళి

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్). ఈ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దీంతో 'నాటు నాటు' పాపులారిటీ మరింత పెరిగిపోయింది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నార్త్ అమెరికన్ సీమాంధ్ర అసోసియేషన్ సభ్యులు వంశీ కొప్పు రావూరి, ఉజ్వల్ కుమార్ కస్తల న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో గల పాపియోనా పార్క్‌లో 'నాటు నాటు' పాటకు 150 టెస్లా కార్లతో లైట్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిసన్ నగర మేయర్ సామ్ జోషి, ఆయన బృందం సహకరించారు. ''నాటు నాటు' లైట్ షో సంతోషానిచ్చింది. ఈ షోకు అసోసియేట్ అయిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది స్టన్నింగ్ షో'' అని రాజమౌళి ట్వీట్ చేశారు.


• 'నాటు నాటు' లైట్ షో


• చిరంజీవి, కీర్తీ సురేష్, తమన్నా

భోళా శంకర్ రాక అప్పుడే...

ఉగాదికి ఫ్యాన్స్‌లో పండగ జోష్ నింపారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. హీరో సుశాంత్ ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. కాగా 'భోళా శంకర్' సినిమాను ఆగస్టు 11న రిలీజ్ చేయనున్నట్లు ఉగాది సందర్భంగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు

- కోట శ్రీనివాసరావు



''జీవితంలో డబ్బు సంపాదించటానికి చండాలపు పనులు బోలెడున్నాయి.. తప్పుడు వార్తలు రాయక్కర్లేదు. మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు. నేను క్షేమంగానే ఉన్నాను'' అని సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. ''అందరికీ ఉగాది శుభాకాంక్షలు. కోట శ్రీనివాసరావు దుర్మరణం అని సోషల్ మీడియాలో వార్త వేశారట. అలాంటి వార్తల గురించి నాకు తెలియదు. ఉగాది పండగ ఎలా చేయాలి? ఏంటి అనుకుంటుంటే ఉదయం 7:30 గంటల నుంచి ఒక్కటే ఫోన్లు. స్వయంగా యాభై కాల్స్ మాట్లాడాను. బందోబస్తు కోసమని ఓ పదిమంది పోలీసులు నా ఇంటివద్దకు రావడం ఆశ్చర్యంగా అనిపించింది. 'మీరు పెద్దాయన, అందరికీ తెలిసినవారు కదా.. పెద్ద పెద్దవాళ్లు మిమ్మల్ని చూసేందుకు వస్తారని బందోబస్తు కోసం వచ్చాం' అన్నారు. 'ఇలాంటి తప్పుడు వార్తలు రాకుండా దయచేసి మీరే చర్యలు తీసుకోండి, అరికట్టండి.. ఎందుకంటే ఎవరైనా పెద్దవాళ్లు ఉంటే గుండె ఆగి చస్తారు' అని వాళ్లకు చెప్పి పంపించాను. ఇలాంటి తప్పుడు వార్తలు మీరు (ప్రజలు) నమ్మవద్దని మనవి చేస్తున్నాను. అలాగే తప్పుడు వార్తలు రాసే వారిపై ప్రజలు కూడా తిరగబడితే వారికి బుద్ధి వస్తుంది'' అన్నారు కోట శ్రీనివాసరావు.

ఆయన నటనలోని మ్యాజిక్‌ని చూశా!

- ప్రకాశ్‌రాజ్


• కృష్ణవంశీ, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వంలో కాలిపు మధు, ఎస్. వెంకట్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ– ''మరాఠీ 'నటసామ్రాట్' సినిమా చూశాక ఒక కళాకారుడి జీవితంలో ఉన్న బరువు నాకు అర్థం అయింది. ఇలాంటి కథను నేను చూపించాలని అనుకున్నాను. 'నటసామ్రాట్' గురించి కృష్ణవంశీకి చెప్పగానే బాగుందన్నాడు. ఎమోషన్స్ చక్కగా ప్రెజెంట్ చేయగలడని తనని ఈ సినిమా రీమేక్ 'రంగ మార్తాండ'కు దర్శకత్వం వహించమని కోరాను. బ్రహ్మానందంగారితో కలిసి వర్క్ చేయడం వల్ల ఆయన నటనలోని మ్యాజిక్‌ను చూసే అవకాశం దొరికింది'' అన్నారు. ''ప్రకాశ్‌రాజ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. ఎన్నో సినిమాల్లో నటించిన అనుభవం ఉన్న అద్భుత నటులు బ్రహ్మానందం ఈ సినిమా కోసం కొత్త ఆర్టిస్టులా నటించారు'' అన్నారు కృష్ణవంశీ. 'ఈ చిత్రం క్లయిమాక్స్‌లో ప్రకాశ్‌రాజ్ నట విశ్వరూపం చూస్తారు. ప్రతి సీన్‌ని కృష్ణవంశీ చక్కగా తెరకెక్కించారు'' అన్నారు బ్రహ్మానందం.

ఓ బేబీ జారిపోమాకే...


• కిరణ్, అతుల్య

'హే అందమెట్టి కొట్టావే.. అందనంటూ పోతావే.. గుండెలోన నీ బొమ్మే పెట్టా చూడవే' అంటూ ప్రేయసి కోసం కిరణ్ అబ్బవరం పాట పాడారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమాలోని 'ఓ బేబీ జారిపోమాకే..' అంటూ సాగే లిరికల్ వీడియోను దర్శకుడు అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. సాయి కార్తీక్ స్వరపరచిన ఈ పాటకు బాలాజీ సాహిత్యం అందించగా ధనుంజయ్ పాడారు.

కథ వెనుక కథేంటి?


• సునీల్, విశ్వంత్, అలీ

విశ్వంత్ దుద్దుంపూడి హీరోగా, శ్రీజిత గోష్, శుభశ్రీ హీరోయిన్లుగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'కథ వెనుక కథ'. సునీల్, అలీ కీలక పాత్రలు చేశారు. అవనీంద్ర కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ''నా కెరీర్‌లో ఇదొక ప్రయోగాత్మక చిత్రం'' అన్నారు విశ్వంత్. ''భవిష్యత్తులోనూ మా బ్యానర్‌లో కొత్తవారిని ప్రోత్సహిస్తూ సినిమాలు చేస్తాం'' అన్నారు అవనీంద్ర కుమార్. ''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు కృష్ణ చైతన్య. ''నిర్మాతలు బావుంటే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి'' అన్నారు అలీ. ''అవనీంద్రలాంటి నిర్మాత దొరకటం కృష్ణ చైతన్య అదృష్టం'' అన్నారు సునీల్.

ఆ భయం లేదు!


• ఫరియా

''నటిగా నా జర్నీపై నాకో స్పష్టత ఉంది. అందుకే సినిమాల ఎంపిక విషయంలో నాకు తొందరపాటు లేదు. చాన్స్‌లు వస్తాయా? రావా అనే భయం కూడా లేదు'' అన్నారు ఫరియా అబ్దుల్లా. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. రవితేజ, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో లాయర్ కనకమహాలక్ష్మి పాత్ర చేశాను. అయితే 'జాతి రత్నాలు'లో చేసిన కామెడీ లాయర్‌లాంటి పాత్ర కాదు. కనకమహాలక్ష్మి సీరియస్‌గా ఉంటుంది. రవితేజగారు నాకు సీనియర్ లాయర్. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నాను'' అన్నారు.

ఆ నమ్మకంతో రిస్క్ చేశాను - విశ్వక్ సేన్



• 'కరాటే' రాజు, నివేద, విశ్వక్ సేన్

''నేను సినిమాలు చేస్తున్నది డబ్బులు సంపాదించుకోవడానికి కాదు.. సినిమాలు తీయడానికే. 'ధమ్కీ' సినిమాకు చాలా ఖర్చు పెట్టాను. నటనతో పాటు నిర్మాణం, దర్శకత్వం అంశాల్లోనూ చాలా నిజాయితీగా పని చేశాను. ప్రేక్షకులపై నమ్మకంతో చాలా రిస్క్‌లు తీసుకుని నేను చేసిన ఈ సినిమా నా జీవితాన్ని మార్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాలోని సెకండాఫ్‌ను విశ్వక్ మాత్రమే తీయగలడు అనేలా ఉంటుంది. మా నాన్న నన్నెంతో భరించారు. ఆయనకు ఈ సినిమా డబ్బులు తీసుకుని రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు నటుడు, దర్శక-నిర్మాత విశ్వక్ సేన్. ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. కరాటే రాజు (విశ్వక్‌సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో 'కరాటే' రాజు మాట్లాడుతూ– ''బడ్జెట్ మూడింతలు పెరిగినా క్వాలిటీ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.

పబ్లిసిటీ ఇన్‌చార్జ్ ప్రమోద్ కుమార్ ఇక లేరు



తెలుగు పరిశ్రమలో ఎన్నో చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా చేసిన వీరమాచనేని ప్రమోద్ కుమార్ (87) మంగళవారం విజయవాడలో కన్నుమూశారు. సినీ ఇండస్ట్రీలో 38 ఏళ్ల ప్రయాణంలో 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు ప్రమోద్ కుమార్. వాటిల్లో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. అదే విధంగా కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రలు చేశారు. మోహన్‌బాబు హీరోగా 'దొంగ పోలీస్', 'గరం మసాలా' సినిమాలు నిర్మించారు ప్రమోద్ కుమార్. అలాగే 'సుబ్బయ్యగారి మేడ' పేరుతో ఓ చారిత్రక నవల రచించారు. తన సినీ అనుభవాలతో 'తెర వెనుక తెలుగు సినిమా' పేరుతో రాసిన పుస్తకం నంది పురస్కారానికి ఎంపికైంది. ప్రమోద్ కుమార్‌కి కొడుకు వి. శ్రీనివాస్ రాయ్, కుమార్తెలు వై. తులసి రాణి, జి. సరోజ ఉన్నారు. 'ఓ వ్యక్తిగా, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఆయన (ప్రమోద్) తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు' అన్నారు వి. శ్రీనివాస్ రాయ్.


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 360

బుధవారం 22-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అమృత్ పరారీ నిఘా వైఫల్యమే

అమృత్‌పాల్ సింగ్ తప్పించుకోవడం నిఘా వైఫల్యమే అంటూ పంజాబ్ హరియాణా హైకోర్టు పోలీసు శాఖకు మొట్టికాయలు వేసింది.

- వివరాలు 6లో

ప్రపంచంలోనే బీజేపీ కీలక పార్టీ

బీజేపీ ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన రాజకీయ పార్టీ అని అమెరికన్ మ్యాగజైన్ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో వ్యాసం ప్రచురితమైంది

- వివరాలు 6లో



కోర్టుకు వస్తే చంపేస్తారేమో

కోర్టుకు వస్తే తనను చంపేసే ప్రమాదం ఉన్నందున, వర్చువల్‌గానే కేసులు విచారించాలని ఇమ్రాన్‌ఖాన్ సుప్రీంకోర్టును కోరారు.

- వివరాలు 6లో



ట్రంప్ అరెస్టయితే వాట్ నెక్ట్స్?


అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్ట్ అయితే అధ్యక్ష ఎన్నికల్లో తిరిగి పోటీ చేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

- వివరాలు 6లో

కొలువుల కలవరం!

టీఎస్‌పీఎస్సీ పరీక్షల రద్దుతో ఉద్యోగార్థుల్లో నిరాశా నిస్పృహలు

- గ్రూప్–1 కోసం ఉద్యోగాలు వదిలిపెట్టిన కొందరు..
- అప్పులు చేసి కోచింగ్ కేంద్రాల్లో చేరిన మరికొందరు..
- పడిన కష్టం, వ్యయ ప్రయాసలు తలుచుకుని కుమిలిపోతున్న యువత
- మళ్లీ సన్నద్ధమవడమెలా అన్న సందిగ్ధత
- పిల్లల కోసం పుస్తెలు తాకట్టు పెట్టిన తల్లిదండ్రులు
- కన్నబిడ్డల బాధ చూడలేక తల్లడిల్లిపోతున్న వైనం



'అమ్మా.. నాకు నౌకరొస్తుంది. మన కష్టాలు తొలగిపోతాయమ్మా'.... భువనగిరికి చెందిన శ్రీశైలం కొద్దికాలం క్రితం తన తల్లికి చెప్పిన మాటలివి. శ్రీశైలం ఎల్‌ఎల్‌బీ చదివాడు. టెట్ అర్హతా పొందాడు. అతని తండ్రి సన్నకారు రైతు.



అయినా కొడుకు గ్రూప్–1 కోచింగ్ కోసం అప్పు చేసి మరీ డబ్బులు పంపాడు. తమ కష్టానికి తగిన ఫలితం లభిస్తుందనే నమ్మకం వారిలో ఉండేది. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన శ్రీశైలం లోనూ ఆ ధైర్యం నెలకొంది. కానీ ఇప్పుడు అతనిలో భయం, ఆందోళన కన్పిస్తున్నాయి. 'పర్లేదులేయ్యా.. ఇంకేదైనా ఉద్యోగం చూసుకోవచ్చు..' అని తండ్రి బుజ్జగిస్తుంటే తట్టుకోలేకపోతున్నానంటూ బావురుమన్నాడు.

వరంగల్ జిల్లాలో మారుమూల ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్‌ది దయనీయ స్థితి. తండ్రి కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. తల్లి కూలీ పని చేస్తోంది. ఆమె కూడా దీర్ఘకాల వ్యాధికి గురైంది. ఆ విషయాన్ని కొడుకు దగ్గర దాచి పెట్టింది. పీజీ చేసిన కొడుకుకు మంచి ఉద్యోగం వస్తుందనేది ఆమె ఆశ. మందులకు వాడాల్సిన సొమ్మును కొడుకు కోచింగ్ కోసం పంపేది. సంజయ్ కూడా పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ మరీ గ్రూప్–1కు ప్రిపేర్ అయ్యాడు. మెయిన్స్ దాకా వచ్చాడు. ప్రిలిమ్స్ పరీక్ష రద్దవ్వడంతో దిగాలుపడ్డాడు. 'నాకు ఉద్యోగం కాదు.. అమ్మ కష్టం గుర్తుకొస్తోంది' అంటూ గుండె పగిలేలా ఏడ్చాడు.

2లో

స్టేటస్ రిపోర్టు ఇవ్వండి



- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో హైకోర్టు ఆదేశం
- ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టీకరణ
- తదుపరి విచారణ 11కు వాయిదా

- వివరాలు 2లో

స్నేహితుడికీ షేర్ చేశాడు!

- లీకేజ్ కేసులో టీఎస్‌పీఎస్సీ మాజీ ఉద్యోగి పేరు
- అతనికి వాట్సాప్ ద్వారా గ్రూప్–1 పేపర్ పంపిన ప్రవీణ్‌కుమార్
- ప్రిలిమ్స్‌లో అతడు క్వాలిఫై అయినట్లు గుర్తింపు... అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సిట్
- బండి సంజయ్‌కీ నోటీసులు..

2లో

ప్రగతిభవన్‌లో పేపర్ లీకేజీ మూలాలు

'నిరుద్యోగుల గోస' సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, కోదండరాం ఆరోపణ

3లో

ఫోన్లు ధ్వంసం చేశానని ఎలా ఆరోపిస్తారు?

అందుకే గతంలో వాడిన ఫోన్లన్నీ స్వాధీనం చేస్తున్నా..

ఇది నా గోప్యతకు భంగం కాదా!

ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ



ఈడీ విచారణకు హాజరయ్యేముందు తన పాత ఫోన్లను మీడియాకు చూపిస్తున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ స్వాధీనం చేసుకోవడం, అదీ ఒక మహిళ దగ్గర నుంచి తీసుకోవడం గోప్యతకు భంగం కలిగించినట్లు కాదా అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తనని ప్రశ్నించకుండా ఇతరుల స్టేట్‌మెంట్లను బట్టి ఫోన్లు ధ్వంసం చేశానని ఎలా ఆరోపిస్తారని తప్పుబట్టారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అసిస్టెంట్ డైరెక్టర్ జోగేందర్‌కు మంగళవారం కవిత లేఖ రాశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటులో పది ఫోన్లు ధ్వంసం

మిగతా 3వ పేజీలో ▶

ఫోన్ల వాడకంపైనే ప్రశ్నలు!

- వరుసగా రెండోరోజూ కవితను విచారించిన ఈడీ
- తక్కువ కాలంలో ఎక్కువ ఫోన్లు ఎందుకు వినియోగించారు?
- ఏ ఫోను ఎప్పుడు వినియోగించారు? అంటూ..ప్రశ్నలు
- ఉదయం 11.30కు వెళ్లి రాత్రి 9.40 వరకు అక్కడే..
- తాజాగా 10 ఫోన్లు ఈడీకి అందజేసిన ఎమ్మెల్సీ
- క్లోనింగ్ కోసం పంపిన అధికారులు

3లో

కిషన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

- వివరాలు 3లో

న్యూస్‌రీల్

లీకేజీ నిర్వాకాన్ని జనంలోకి తీసుకెళ్దాం: బీజేపీ



పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. పరీక్షలు రాసిన అభ్యర్థుల వద్దకెళ్లడం, లీకేజీ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ దిశగా ప్రణాళికలను రూపొందిస్తోంది.

- వివరాలు 2లో

పేపర్ లీకేజీలు సర్వ సాధారణం: ఇంద్రకరణ్‌రెడ్డి



పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా జరుగుతుంటాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో తన మాటలు వక్రీకరించారని ఆరోపించారు.

- వివరాలు 2లో

మరో 'మహా'సభపై బీఆర్‌ఎస్ ఫోకస్



ఈ నెల 26న కాందార్ లోహాలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. అధినేత కేసీఆర్ ఈ సభకు అధ్యక్షత వహించనుండటంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది.

- వివరాలు 3లో

ఉత్తరాదిన భూకంపం



దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ భూప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.6గా రికార్డయ్యింది.

- వివరాలు 6లో

ఇదండీ జాతర్



...అలాగే ఉగాది పచ్చడి కూడా తినిపించండి సార్! పులుపు, చేదు, తీపి, వగరు రుచులతో ఎంజాయ్ చేస్తారు!

• పంటలకు రుణ పరిమితి...

వరి, పత్తికి ఎకరాకు రూ.45 వేలు

ఆయిల్ పామ్‌కు రూ.42 వేలు ఖరారు



- మిర్చికి ఎకరానికి రూ.80 వేలు
- 2023–24 వ్యవసాయ సీజన్‌కు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు
- గత సీజన్ కంటే అదనంగా రూ.5–6 వేలు పెరుగుదల
- తెలంగాణ సహకార అపెక్స్ బ్యాంక్ వెల్లడి
- ఈ ప్రకారం రైతులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు సూచన

సాక్షి, హైదరాబాద్: వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మిర్చి తదితర పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి) పెరిగింది. కొన్ని కొత్త రకాల పంటలకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేశారు. రానున్న వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన రుణ పరిమితిని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఖరారు చేసింది. రాష్ట్రంలో పండించే దాదాపు 123 రకాల పంటలకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎంతెంత రుణాలు ఇవ్వాలన్న దానిపై టెస్కాబ్ భారీ కసరత్తు చేసింది. సాగు ఖర్చు, ఉత్పాదకత, నీటి వసతి ఆధారంగా రుణ నిర్ధారణ చేసింది. సంబంధిత రుణ పరిమితి నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ)కి పంపించింది. తాము ఖరారు చేసినట్లుగా రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సూచించింది. రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే పత్తి, వరి పంటలకు ఎకరానికి రూ.45 వేలు ఖరారు చేసింది. సాగునీటి ప్రాజెక్టులు ఉన్నచోట వరికి 2022–23లో

మిగతా 11వ పేజీలో ▶

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సుల పరీక్ష

- మేలో నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం
- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో వైద్యాధికారుల టెన్షన్
- పకడ్బందీగా జరిగేలా భారీ కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- 5,204 స్టాఫ్ నర్స్ పోస్టులకు 40 వేల దరఖాస్తులు

- వివరాలు 14లో





టెక్నాలజీనే నమ్ముకుంటే ప్రమాదమే..

కేవలం సాంకేతికతతో ప్రశ్నపత్రాల భద్రత సందేహమే

- నిర్వహణ సంస్థ విశ్వసనీయతే పరీక్షలకు ఆయువుపట్టు
- టీఎస్‌పీఎస్సీ దీన్ని కాపాడుకోవాల్సిందే.. గత విధానాలు ఓసారి పరిశీలించాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ డాక్టర్ వెంకటరామిరెడ్డి

- వివరాలు 5లో

క్లుప్తంగా...

బీఆర్‌ఎస్ కాదు.. కేఆర్‌ఎస్

కవిత రక్షణ సమితి అంటూ మధుయాష్కీ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: అదానీ కుంభకోణం నుంచి దేశ, తెలంగాణ ప్రజల దృష్టిని మరల్చేందుకే ఢిల్లీ లిక్కర్ స్కాంను తెరపైకి తెచ్చారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒకటేనని, అందుకే ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారణ పేరుతో పిలిపిస్తున్నారే తప్ప లిక్కర్‌స్కాం మాస్టర్‌మైండ్ అయిన ఆమెను అరెస్టు చేయడం లేదని వ్యాఖ్యానించారు. మంగళవారం గాంధీభవన్‌లో మధుయాష్కీ విలేకరులతో మాట్లాడారు. '60 ఏళ్ల తెలంగాణ ప్రజల పోరాటాలను గుర్తించి రాజకీయంగా నష్టపోతున్నామని తెలిసినా.. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. కానీ తెలంగాణలో బతుకమ్మ పేరుతో బతకనేర్చిన కల్వకుంట్ల కుటుంబం మాత్రం దోపిడీకి పాల్పడుతోంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలు గడించింది'అని ఆరోపించారు. ఫ్లైట్ టికెట్ కొనలేని స్థితి నుంచి ప్రత్యేక విమానంలో చక్కర్లు కొడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసి కవిత రక్షణ సమితి (కేఆర్‌ఎస్)గా మారిందని, ఢిల్లీ విచారణకు వెళ్లిన కవిత చుట్టూ మంత్రులు వలయంగా మారి ఆమెను రక్షించే పనిలో పడ్డారని ఎద్దేవాచేశారు..

పీఠం కదులుతున్నందుకే కేసీఆర్ లేఖ: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: మద్యం కుంభకోణం కేసులో కుమార్తె ఇరుక్కుపోవడం, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్ అగమ్యగోచరం కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలోనే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు లేఖ రాశారని టీ.పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ పీఠం కదులుతున్నందునే ఆత్మీయ సందేశం పేరుతో పార్టీ కార్యకర్తలకు లేఖ రాశారని మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. తెలంగాణను కోటి కాంతులు విరజిమ్మేలా తీర్చిదిద్దుకున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

పీఠం కదులుతుందనే కేసీఆర్ మొసలికన్నీరు

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'బిడ్డ జైలుకెళ్లే సమయం వచ్చే సరికి కార్యకర్తలు గుర్తుకొచ్చారు. కార్యకర్తల బలం, తెలంగాణ ఉద్యమం గుర్తుకొచ్చాయి..'అంటూ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఎద్దేవాచేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు కేసీఆర్ లేఖరాయడంపై మంగళవారం షర్మిల ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. లిక్కర్ మరకలు, పేపర్ లీకేజీ వ్యవహారాలతో అధికార పీఠం కదులుతుండటంతోనే ఈ లేఖలు రాస్తున్నారని, ఎన్ని ఎత్తులేసినా రానున్న ఎన్నికల్లో కేసీఆర్ తన పాపానికి పరిహారం చెల్లించుకోవాల్సిందేనన్నారు. రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, ఉద్యమకారులకు అన్యాయం జరిగినపుడు, బీఆర్‌ఎస్ పార్టీ సర్పంచులు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకొంటున్నప్పుడు ఒక్కరోజైనా ఆత్మహత్యలు చేసుకోకండి అని ఒక్కరికైనా లెటర్ రాశావా? అని ఆమె ప్రశ్నించారు. సకల జనులను మోసం చేసి.. ఇప్పుడు ఎంత మొసలికన్నీరు కార్చినా నువ్వు, నీ కుటుంబం జైలుకు వెళ్లక తప్పదని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కొలువుల కలవరం

ఉద్యోగార్థుల్లో నిరాశా నిస్పృహలు



సాక్షి, హైదరాబాద్: ఎన్నాళ్లగానో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు..షడ్రుచుల ఉగాది ఒట్టి చేదునే పంచుతోంది. వేలాది మంది తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రద్దు కావడం, వాయిదా పడటం వారు జీర్ణించుకోలేక పోతున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ల లీక్‌తో తమ ఏళ్ల తరబడి కష్టం వృథా అయిందంటూ కుమిలిపోతున్నారు. ముఖ్యంగా గ్రూప్‌–1 కోచింగ్ కోసం చేసిన అప్పులు, కుదవబెట్టిన ఆస్తులు గుర్తుకొచ్చి తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అమ్మానాన్నల కలలు చెదిరిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయంటూ తల్లడిల్లిపోతున్నారు. చిన్నా చితక ఉద్యోగాలొదిలిపెట్టి, ఉన్న ఉపాధిని కోల్పోయి.. సర్కారీ కొలువే లక్ష్యంగా కఠోర దీక్ష బూనిన నిరుపేద నిరుద్యోగుల బరువెక్కిన గుండెల్లోంచి ఆవేదన ఉప్పొంగుతోంది. దిగాలు పడ్డ పిల్లలను ఓదార్చేందుకు తమ వద్ద మాటల్లేవంటున్న తల్లిదండ్రుల వ్యథ వర్ణనాతీతంగా ఉంది.

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లతో లక్షలాది మంది నిరుద్యోగులు, వారి తల్లిదండ్రుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఇళ్ళను వదిలేసి, వ్యక్తిగత బాధలన్నీ పక్కన బెట్టి కొలువు కొట్టే లక్ష్యంతో లక్షల మంది కోచింగ్ కేంద్రాల బాట పట్టారు. ఇంకొందరు ఇళ్లల్లోనే ఉండి చదువుతూ బయటి ప్రపంచాన్ని మరిచిపోయారు. నిద్రాహారాలు మానుకుని పరీక్షల కోసం సన్నద్ధమయ్యారు. ఈ దశలో బాంబులా పేలింది..రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. అదే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్. తీగలాగితే డొంక కదిలినట్టు ఒక పరీక్షతో ఆగిపోలేదు. గ్రూప్‌–1 ప్రిలిమ్స్ సహా ఏకంగా నాలుగు

ఎవరిని కదిపినా..ఉప్పొంగే ఆవేదనే

పరీక్షలు రద్దు అయ్యాయి. మరో రెండు పరీక్షలు వాయిదా పడ్డాయి. నిరుద్యోగ యువతలో అయోమయాన్ని నింపాయి. మెడలోని పుస్తెనో, ఇంట్లోని గొర్రెనో.. బర్రెనో.. ఉన్న కుంట భూమినో.. తాతల నుంచి వచ్చిన ఇంటినో అమ్మేసి కన్న బిడ్డల్ని ఉన్నత స్థితిలో చూడాలనుకున్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరై పోయాయి. మళ్లీ గ్రూప్‌–1కు సన్నద్ధమవడమనే ఊహే వారిని తీవ్రంగా బాధిస్తోంది. ఊహించని ఈ పరిణామంపై 'సాక్షి' వారి ప్రతిస్పందన కోరినప్పుడు.. ఎంతో ఆందోళన..ఆవేదన, మరెంతో నిరాశా నిస్పృహలు వారిలో స్పష్టంగా కన్పించాయి.

అమ్మ పుస్తెను అమ్మేసి ఇస్తున్నా..

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నీలేశ్ మాటలు గుండెను పిండేసేలా ఉన్నాయి. '30 ఏళ్ల క్రితం మీ అమ్మకు కట్టిన పుస్తె కొడుకా.. అమ్మేసి ఇస్తున్నా. ఉద్యోగం తెచ్చుకో బిడ్డా..' అంటూ కోచింగ్‌కు డబ్బులిచ్చేప్పుడు తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ గుక్క తిప్పుకోకుండా ఏడ్చాడు. ఇప్పుడేం చేయాలి? అంటూ నిస్సహాయంగా ప్రశ్నించాడు.

ఉపాధి పోయే.. భరోసా కరువాయే

ఎమ్మెస్సీ చేసిన ప్రశాంతి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కాలేజీలో మేథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ నెలకు రూ. 50 వేలకు పైనే సంపాదించేది. ప్రభుత్వ నోటిఫికేషన్ల తర్వాత ఉన్న ఉద్యోగం వదిలేసింది. ఏడాదిగా గ్రూప్స్ పైనే దృష్టి పెట్టింది. మెయిన్స్‌కు అర్హత సాధించింది. పరీక్ష రద్దవ్వడంతో ఏమీ పాలుపోని స్థితిలో ఉంది. ఇప్పుడామె గర్భిణి కూడా. 'పుట్టబోయే బిడ్డ కోసం దుఃఖాన్ని దిగమింగుతున్నా. మళ్లీ సన్నద్ధమవ్వడం కష్టమే..' అంటూ కన్నీటి పర్యంతమైంది.

చెల్లి పెళ్లి కోసం దాచిన డబ్బులు..

పీజీ తర్వాత భద్రాచలానికి దగ్గర్లోని ఓ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం తెచ్చుకున్నాడు వీరబోయిన నరేంద్ర. తండ్రి చనిపోవడంతో ఇంటికి పెద్ద దిక్కయ్యాడు. కానీ గ్రూప్స్ కోసం ఉద్యోగం మానేసి హైదరాబాద్‌లో కోచింగ్ కోసం వచ్చాడు. చెల్లి పెళ్లి కోసం దాచిన డబ్బు ఖర్చు చేశాడు. 'ఇప్పుడు ప్రభుత్వ కొలువు ఎండమావిగా మారింది. ఉన్న ఇంటిని అమ్మేయడమే దిక్కు' అంటూ వాపోయాడు.

ఎంఏ చేసినా అమ్మకు భారంగానే..



నాన్న చనిపోతే అమ్మే కూలి పని చేసి పెంచింది. ఎంఏ చేసినా ఇంకా అమ్మకు భారంగానే ఉన్నా. టీఎస్‌పీఎస్సీ పరీక్షల ద్వారా ఉద్యోగం వస్తుందని, అమ్మ కళ్ళల్లో ఆనందం చూస్తాననే నమ్మకం తగ్గిపోతోంది. పరీక్షల పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమా?

– కాదిరాబంద్ పాండు (ఆందోల్, సంగారెడ్డి జిల్లా)

మళ్లీ సన్నద్ధమవ్వడం ఎలా?



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా కష్టపడి బీఎస్సీ, బీఈడీ చేశా. గ్రూప్స్ కోసం మూడేళ్లు కష్టపడ్డా. నేను, నా స్నేహితు లు నిద్రహారాలు మానేసి చదివాం. పరీక్ష రద్దు మనసు కకావికలం అయిపోయింది. మళ్లీ ఎలా సన్నద్ధమవ్వాలో అర్థం కావడం లేదు.

– దుర్గం శ్రావణి, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

లీక్ బాధ్యులను కఠినంగా శిక్షించాలి..



కొంతకాలంగా ఇంటివద్ద పిల్లల్ని సైతం వదిలేసి.. ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ పరీక్షకు సిద్ధమవుతున్నా. ఈ సమయంలో పరీక్ష రద్దు చేయడం బాధించింది. లీక్ బాధ్యులను కఠినంగా శిక్షించాలి. మాలాంటి వారిని ఆదుకోవాలి. ఈసారైనా పకడ్బందీగా ప్రక్రియను పూర్తి చేయాలి.

– సంధ్య (గ్రూప్‌–1 అభ్యర్థి, మహబూబ్‌నగర్)

నష్టపోయిన వారికి చేయూతనివ్వాలి



కోచింగ్ కోసం ఉన్నవన్నీ అమ్ముకుని వచ్చిన వాళ్ళున్నారు. తప్పు ప్రభుత్వానిదైతే శిక్ష పరీక్ష రాసిన వాళ్లెందుకు అనుభవించాలి? దరఖాస్తు చేసిన వారికి ప్రభుత్వం ఆర్థిక పరమైన చేయూతనివ్వాలి.

– చెన్నగాని దయాకర్ గౌడ్ (పీహెచ్‌డీ విద్యార్థి, నకిరేకల్, నల్లగొండ జిల్లా)

'సిట్' అంటేనే.. సిట్, స్టాండ్ మాత్రమే

లీకేజీ వ్యవహారంపై రేవంత్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో పూర్తిగా బయట పడదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సిట్ అంటే.. సిట్, స్టాండ్ మాత్రమేనని, గతంలో సిట్ విచారించిన కేసులు ఎటు పోయాయని ప్రశ్నించారు. పేపర్ల లీకేజీ వ్యవహారంపై హైకోర్టులో దాఖలు చేసిన కేసు విచారణకు వెళ్లిన అనంతరం సీఎల్పీ కార్యాలయంలో రేవంత్ మీడియాతో మాట్లాడారు. డ్రగ్స్, నయీం భూముల కేసులు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కేసు, హౌసింగ్‌బోర్డు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసులను విచారించేందుకు ఏర్పాటు చేసిన సిట్ విచారణ ఎటు పోయిందని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ వ్యవహారంలో సిట్ తాళాలు కూడా ఆంధ్ర ప్రాంతానికి చెందిన అధికారి చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ఈ కేసులో కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో వాదనలు వినిపించిందని, టీఎస్‌పీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తాము కోర్టును కోరామని చెప్పారు. పేపర్ లీకేజీ అంశంలో ప్రవీణ్, రాజశేఖర్‌లతో పరిమితం కాకుండా టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీ, కస్టోడియన్ శంకరలక్ష్మిని కూడా బాధ్యులుగా చేర్చాలని కోరారు. ఈ విషయాన్ని సమగ్రంగా దర్యాప్తు జరపాలని అడిగితే తనకు సిట్ నోటీసులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న కాంగ్రెస్ నేతలు

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 10 మందితో కూడిన కాంగ్రెస్ ప్రతినిధుల బృందం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలవనుంది. గవర్నర్ అపాయింట్‌మెంట్ మేరకు బుధవారం మధ్యాహ్నం 12:30 గంటలకు రాజ్‌భవన్‌లో ఆమెను కలిసి టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ ఘటనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు కోరనున్నట్లు గాంధీభవన్ వర్గాలు మంగళవారం వెల్లడించాయి.

ఓయూలోకి రాకుండా రేవంత్‌ను అడ్డుకుంటాం

బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నేతల హెచ్చరిక



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మంత్రి కె.తారకరామారావుపై విమర్శలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీలోకి రాకుండా అడ్డుకుంటామని బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం నేతలు హెచ్చరించారు. నాడు తెలంగాణ ఉద్యమ ద్రోహిగా ప్రవర్తించి నేడు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ రేవంత్‌రెడ్డి బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలసి సీనియర్ నేత విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు తుంగబాలు, బండారు వీరబాబు విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ – పరీక్షల రద్దుపై రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు రేవంత్, బండి సంజయ్ కుమ్మక్కై రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ పాలనను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!


ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న: సాక్షి ప్రారంభ సంచికలో ప్రత్యేక సంపాదకీయం రాసినవారు?
ఎ) పీవీ నరసింహారావు బి) సీతారామ్ ఏచూరి
సి) మన్మోహన్ సింగ్ డి) వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

స్టేటస్ రిపోర్టు ఇవ్వండి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో హైకోర్టు ఆదేశం

- ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టీకరణ
- తదుపరి విచారణ 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు దర్యాప్తుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టు (స్థాయి నివేదిక)ను సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు 3 వారాల సమయం ఇస్తున్నట్లు తెలిపింది. కౌంటర్ అఫిడవిట్ దాఖలుకు కూడా ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 11కు వాయిదా వేసింది. పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయడం లేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో పాటు మరో ఇద్దరు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వివేక్ థన్కా వాదనలు వినిపించారు.

ఇద్దరే ఉన్నారని మంత్రి ఎలా చెబుతారు..

'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. దర్యాప్తు ప్రారంభం దశలోనే ఈ కేసులో ఇద్దరే నిందితులు అని మంత్రి కేటీఆర్ ప్రెస్‌మీట్‌లో చెప్పారు. ప్రభుత్వ అత్యున్నత పదవిలో ఉన్న మంత్రి వ్యాఖ్యలు దర్యాప్తును ప్రభావితం చేస్తాయనడంలో సందేహం లేదు. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఆ వ్యాఖ్యలు చేశారు. ఇద్దరే ఉన్నారని ఆయనకు ఎలా తెలుసు? ఆయన నియోజకవర్గంలో 20 మందికి అత్యధిక మార్కులు వచ్చాయి. ఇది కూడా అనుమానాలకు తావిస్తోంది. మంత్రి వ్యాఖ్యలు, లీకేజీలో ఆయన పీఏ పాత్ర ఉన్నట్లుగా ఆరోపణల నేపథ్యంలో సిట్ స్వేచ్ఛగా దర్యాప్తు చేయలేదు. సీబీఐకి లేదా స్వతంత్ర దర్యాప్తు బృందానికి కేసును బదిలీ చేయాలి. పారదర్శక, నిష్పక్షపాత దర్యాప్తు జరగాలన్నదే మా విజ్ఞప్తి..'అని థన్కా తెలిపారు.

సిట్ 9 మందిని అరెస్టు చేసింది..

'కేసు ప్రారంభ దశలోనే వెంకట్, ఓయూ విద్యార్థులు కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్ వేసే అర్హత (లోకస్ స్టాండీ) వారికి లేదు. దర్యాప్తు అడ్డుకోవాలన్న ఉద్దేశంతోనే వారు పిటిషన్ వేశారు. ఇద్దరే ఉన్నారని మంత్రి చెప్పారని, అది సిట్ దర్యాప్తుపై ప్రభావం చూపుతుందని వారు చెబుతున్నారు. కానీ సిట్ ఇప్పటి వరకు 9 మందిని అరెస్టు చేసింది. ఈ పిటిషన్ కేవలం రాజకీయ దురుద్దేశంతోనే వేశారు. ఈ కేసును సిట్ సమగ్రంగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విషయంలో ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉంది. లీకేజీ గురించి తెలియగానే టీఎస్‌పీఎస్సీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం కూడా కేసును సిట్‌కు అప్పగించింది. కాబట్టి ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరం లేదు. సీబీఐ విచారణ అవసరం లేదు. పిటిషన్‌ను కొట్టివేయాలి..'అని ఏజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదించారు. కాగా పిటిషనర్లలో ఇద్దరు టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు హాజరైన అభ్యర్థులేనని థన్కా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

లీకేజీ నిర్వాకాన్ని జనంలోకి తీసుకెళ్దాం

- పరీక్షల నిర్వహణలో బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోనే ఎండగట్టాలని రాష్ట్ర బీజేపీ యోచన!
- విద్యార్థులు, యువత, తల్లిదండ్రుల దృష్టిని ఆకర్షించేలా ప్రచార కార్యక్రమాలకు సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీజేపీ నిర్ణయించింది. పరీక్షలు రాసిన అభ్యర్థుల వద్దకెళ్లడం, యూనివర్సిటీల సందర్శన, లీకేజీ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ వంటివి చేపట్టే దిశగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తోంది. వివిధ రూపాల్లో ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా లీకేజీ వ్యవహారంపై ప్రజా స్పందనను తెలుసుకునే యత్నం చేయనుంది. ఇందులో భాగంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతను, వారి తల్లితండ్రుల దృష్టిని ఆకర్షించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోంది. ఇప్పటికే లీకేజీ పరిణామాలపై రాష్ట్ర పార్టీ, బీజేవైఎం, ఇతర విభాగాలు చేపట్టిన కార్యక్రమాలతో వివిధ వర్గాల ప్రజల్లో మంచి మైలేజీ వచ్చిందనే అంచనాల్లో పార్టీ నాయకత్వముంది. పేపర్ లీకేజీ వ్యవహారంతో పాటు ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత విచారణ, తదితర పరిణామాలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, మంత్రులు, అధికారపార్టీ నేతల వ్యవహారశైలిని ఎండగట్టేలా నిరసన, ఆందోళన కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని భావిస్తోంది.

ఆ విషయంలో మనమే ముందున్నాం

పేపర్ లీకేజీ అంశంపై టీఎస్‌పీఎస్‌సీ పర్యవేక్షణ, నిర్వహణా వైఫల్యాలు, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టడంలో తాము ముందున్నామనే అభిప్రాయంతో బీజేపీ ముఖ్యనాయకులున్నారు. కాంగ్రెస్‌తో సహా ఇతర రాజకీయ పార్టీల కంటే ముందుగా ఈ అంశాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లి చర్చనీయాంశం చేయడంలో సక్సెస్ అయ్యామని బీజేపీ ముఖ్యనేత వ్యాఖ్యానించారు. టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల నిర్వహణ తీరు, లోటుపాట్లను ఎత్తిచూపి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి బీజేపీకి అనుకూలంగా ప్రజా మద్దతును కూడగట్టగలిగామనే ధీమాను వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ముందువరసలో నిలవగలిగామని ఆ నేత అభిప్రాయపడ్డారు. ఇదే ఊపుతో పేపర్ లీకేజీతో పాటు ఢిల్లీ లిక్కర్‌స్కాంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నేతల వైఫల్యాలను ఎండగట్టేలా కార్యాచరణను సిద్ధం చేయనున్నట్టు వెల్లడించారు.

స్నేహితుడికీ షేర్ చేశాడు!

లీకేజ్ కేసులో టీఎస్‌పీఎస్సీ మాజీ ఉద్యోగి పేరు

- అతనికి వాట్సాప్ ద్వారా గ్రూప్‌–1 పేపర్ పంపిన ప్రవీణ్‌కుమార్
- ప్రిలిమ్స్‌లో అతడు క్వాలిఫై అయినట్లు గుర్తింపు
- అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు



బండి సంజయ్ ఇంటి వద్ద నోటీసులు అంటిస్తున్న సిట్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజ్ వ్యవహారంలో మరో పేరు వెలుగులోకి వచ్చింది. కమిషన్ మాజీ ఉద్యోగి, తన స్నేహితుడైన సురేశ్‌కూ ప్రవీణ్‌కుమార్ గ్రూప్‌–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం పంపినట్లు తేలింది. దీంతో మంగళవారం సురేశ్‌ను అదుపులోకి తీసుకున్న సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. తమ అదుపులో ఉన్న తొమ్మిది మంది నిందితులను కూడా వరసగా నాలుగో రోజూ ప్రశ్నించారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేశారు.

10 మంది కమిషన్ ఉద్యోగులు క్వాలిఫై..

గ్రూప్‌–1 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ప్రవీణ్‌కుమార్ గతేడాది జూన్ నుంచి ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాల కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. కమిషన్‌లోనే నెట్‌వర్క్ అడ్మిన్‌గా పని చేస్తున్న రాజశేఖర్ సాయంతో కస్టోడియన్ కంప్యూటర్‌లో ఉన్న ఈ ప్రశ్నపత్రాన్ని గతేడాది అక్టోబర్ తొలి వారంలో చేజిక్కించుకున్నాడు. దీన్ని వినియోగించి తాను పరీక్షకు సిద్ధం కావడంతో పాటు తన స్నేహితుడైన సురేశ్‌కు వాట్సాప్ ద్వారా పంపాడు. అతడు కూడా మంచి మార్కులతో ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాడు. దీంతో సురేశ్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌లో కమిషన్‌లో పని చేస్తున్న 10 మంది ఉద్యోగులు క్వాలిఫై అయినట్లు సిట్ గుర్తించింది. ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది.

గ్రూప్‌–1 అనుభవంతో మిగతా పేపర్ల కోసం..

గ్రూప్‌–1 పరీక్ష పేపర్లు చేజిక్కించుకున్న అనుభవంతో ప్రవీణ్, రాజశేఖర్‌లు మిగిలిన పరీక్షల సమయంలోనూ తమ ప్రయత్నాలు కొనసాగించారు. గత నెల ఆఖరి వారంలో మరో నాలుగు పరీక్షలకు సంబంధించిన పది క్వశ్చన్ పేపర్లు వీరికి చిక్కాయి. అయితే వాటిని ఎలా విక్రయించాలో అర్థం కాని ప్రవీణ్ తనతో సన్నిహితంగా ఉండే రేణుకను సంప్రదించాడు. తన సమీప బంధువైన కానిస్టేబుల్ శ్రీనివాస్ ద్వారా ఏఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న నీలేశ్‌నాయక్, గోపాల్ నాయక్‌లను రేణుక సంప్రదించింది. ప్రవీణ్ నుంచి పేపర్ అందగానే భర్త డాక్యాతో కలిసి స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం పగిడ్యాల్ తండాకు వెళ్లి, రెండురోజుల పాటు తన ఇంట్లోనే నీలేశ్ గోపాల్‌తో చదివించింది. ఈ నేపథ్యంలోనే సిట్ అధికారులు మంగళవారం రేణుక, డాక్యా నాయక్, నీలేశ్, గోపాల్‌లను ఆ తండాకు తీసుకువెళ్లి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు.

రాజశేఖర్ కాంటాక్టుల పైనా ఆరా..

లీకైన ప్రశ్నపత్రాలను ప్రవీణ్‌తో పాటు రాజశేఖర్ సైతం తన పెన్‌డ్రైవ్‌లోని కాపీ చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతను ఎవరికైనా అమ్మడం, షేర్ చేయడం జరిగిందా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. రాజశేఖర్ ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్స్, వాట్సాప్ గ్రూప్స్‌లో ఉన్న వారితో జరిగిన సంప్రదింపుల వివరాలు ఆరా తీస్తున్నారు. వీరిలో ఎవరైనా గ్రూప్‌–1 సహా ఇతర పరీక్షలు రాశారా? ఉత్తీర్ణులయ్యారా? తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఏఈ ప్రశ్నపత్రాలు ఇచ్చిన రేణుకకు నీలేష్, గోపాల్ రూ.14 లక్షల వరకు చెల్లించారు. ఇందులో రూ.లక్ష వీరికి కానిస్టేబుల్ శ్రీనివాస్ సర్దుబాటు చేసినట్లు సిట్ గుర్తించింది. నగదు ఇచ్చినందుకు అతడు సైతం ప్రశ్నపత్రాన్ని వీరి నుంచి పొందాడా? ఎవరికైనా పంపాడా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తోంది.

ప్రవీణ్ ఇంట్లో సోదాలు

ప్రవీణ్‌కుమార్ నివాసం ఉంటున్న రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని మల్లికార్జుననగర్ కాలనీలో మంగళవారం సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. పేపర్ లీక్‌కు సంబంధించిన ఆధారాల కోసం క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు, కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని విశ్వసనీయ సమాచారం. కాగా కొన్ని వస్తువులను కూడా సిట్ బృందం తమ వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది.

సంజయ్‌కు సిట్ నోటీసులు

ఈ వ్యవహారంలో అనేక ఆరోపణలు చేసిన టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డికి సోమవారం నోటీసులు ఇచ్చిన సిట్.. మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు కూడా జారీ చేసింది. ఒకే గ్రామం నుంచి వందల మంది కమిషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారంటూ ఆయన చేసిన ఆరోపణలపై ఈ నోటీసులు ఇచ్చింది. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు అందించాలని, ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు సిట్ కార్యాలయంలో హాజరు కావాలని స్పష్టం చేసింది. నోటీసులు ఇచ్చేందుకు బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంటికి వచ్చిన అధికారులు..ఆయన అందుబాటులో లేకపోవడంతో గుమ్మం వద్ద నోటీసులు అంటించి వెళ్లారు.

శంకరలక్ష్మి వాంగ్మూలం నమోదు

టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కస్టోడియన్ శంకరలక్ష్మి మంగళవారం సిట్ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈమె కంప్యూటర్ నుంచే క్వశ్చన్ పేపర్లు ప్రవీణ్, రాజశేఖర్ చేతికి చిక్కడంతో.. వివిధ కోణాల్లో శంకరలక్ష్మిని ప్రశ్నించిన అధికారులు ఆమె వాంగ్మూలం నమోదు చేశారు.

పేపర్ లీకేజీలు సర్వసాధారణం!

- అప్పుడప్పుడూ టెన్త్, ఇంటర్‌లో జరుగుతాయి
- దీనికే మంత్రి కేటీఆర్ దోషా? సీఎంకు నోటీసులివ్వాలంటారా?
- మీడియా సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/నిర్మల్ టౌన్: 'పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా జరుగుతుంటాయ్.. అప్పుడప్పుడూ ఇంటర్, టెన్త్‌లో ఎన్నో రకాలుగా జరుగుతాయి. దీనికే మంత్రి కేటీఆర్‌ను దోషి అంటున్నారు. సీఎంకే నోటీసులు ఇవ్వాలంటున్నారు. కేటీఆర్ పీఏ తిరుపతికి చెందిన గ్రామంలోనే 100 మందికిపైగా నూరు మార్కులపైనే వచ్చాయని రేవంత్‌రెడ్డి అంటే 'సిట్'ఆయనకు నోటీసులిచ్చింది. ఆధారాలుంటే చూపెట్టాలి. నిజంగా ఉంటే తప్పు జరిగిందని ఒప్పుకోవచ్చు. ఆధారాలు చూపెట్టమనడంలో తప్పేంలేదు' అని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆయన మాటలు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపాయి. ఎమ్మెల్సీ కవిత విచారణ, పేపర్ లీకేజీ, పార్టీ ఆత్మీయ సమ్మేళనాలపై నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇందులో పేపర్ లీకేజీ అంశంపై మాట్లాడే సందర్భంలో సర్వసాధారణంగా క్వశ్చన్ పేపర్ల లీకేజీలు జరుగుతుంటాయని ఆయన అనడం చర్చనీయాంశమైంది.

కవితను కేంద్రం వేధిస్తోంది..

తెలంగాణ కోసం ఉద్యమించిన కల్వకుంట్ల కవితను ఓ మహిళ అని కూడా చూడకుండా ఈడీ ద్వారా కేంద్రం వేధిస్తోందని ఇంద్రకరణ్ ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు దొరకకపోవడంతో విచారణ పేరుతో మళ్లీమళ్లీ పిలుస్తోందని విమర్శించారు. దేశంలోకెల్లా ప్రధాని మోదీపై ఎదురుదాడి చేసే ఏకైక వ్యక్తి సీఎం కేసీఆరేనని చెప్పారు. కేంద్రానికి దమ్ముంటే సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోవాలని, ఇలా మహిళలను అడ్డుపెట్టుకొని ఆటలడటం సరికాదని సూచించారు.

బీజేపీ వాళ్లంతా సత్యపూసలా?

బీజేపీలో ఎవరూ కూడా తప్పు చేయడం లేదా? వాళ్లంతా సత్యపూసలు, వేరే పార్టీల వాళ్లే దోషులా? అని ఇంద్రకరణ్ ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు ప్రజల కోసం చేసిన బిల్లులను నామినేటెడ్‌గా వచ్చిన గవర్నర్ అట్టిపెట్టుకుంటే బీజేపీ నేతలు ఉత్సవాలు చేసుకుంటున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో బీజేపీ పాత్ర ఉందా అని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని రాజీనామా చేయమంటే పారిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వాళ్లకు చెప్పుకోవడం రాదు కానీ.. స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ 12 ఏళ్లు జైలుకు వెళ్లారని గుర్తుచేశారు.

నా మాటలను వక్రీకరించారు..

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై తన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నాలుక కరుచుకున్నారు. తన మాటలను వక్రీకరించారని ఆరోపించారు. 'బీజేపీ, కాంగ్రెస్ హయాంలో పేపర్ లీకేజీలు సర్వసాధారణమయ్యాయనే సందర్భంలోనే నేను మాట్లాడాను'అని వివరణ ఇచ్చారు. పేపర్ లీకేజీ దురదృష్టకరమని, దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు.

ప్రగతిభవన్‌లో పేపర్ లీకేజీ మూలాలు

- 'నిరుద్యోగుల గోస'సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కోదండరాం ఆరోపణ
- నీళ్లు, నియామకాలు, నిధులు(ట్రిపుల్ ఎన్) కాస్తా లీకులు, లిక్కర్, లిఫ్ట్(ట్రిపుల్ ఎల్) మారిందని వ్యాఖ్య
- గెలుపు కేసీఆర్ పైసదో, మా పోరాట పటిమదో చూద్దామని సవాల్.. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఆకునూరి మురళి, హరగోపాల్, విశ్వేశ్వరరావు, కోదండరాం తదితరులు

లక్డీకాపూల్(హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసు మూలాలు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ వద్ద ఉన్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ కుటుంబసభ్యుల కనుసన్నల్లోనే ఈ లీకేజీ జరిగిందన్నారు. 'టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ– ప్రభుత్వ వైఫల్యం–నిరుద్యోగుల గోస'అనే అంశంపై మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యువ జన సమితి, విద్యార్థి జన సమితి అధ్యక్షులు సలీం పాషా, సర్దార్ వినోద్ కుమార్ అధ్యక్షతన అఖిలపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశంజరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నీళ్లు, నియామకాలు, నిధులు(ట్రిపుల్ ఎన్) కాస్తా లీకులు, లిక్కర్, లిఫ్ట్(ట్రిపుల్ ఎల్)గా మారిందని అన్నారు. పేపర్ లీకేజీ నిందితులందరికీ యావజ్జీవ కారాగార శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి నిరుద్యోగ అభ్యర్థులకు 50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆవేశపూరితంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు.

కేసీఆర్ కాస్కో: కోదండరాం

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ ఈ లీకేజీ వ్యవహారం ఇద్దరు వ్యక్తుల సమస్య కాదని, పాలకులతో దీనికి సంబంధం ఉందని అన్నారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లీకేజీ ఘటనకు సీఎం కేసీఆర్‌దే నైతిక బాధ్యత అని అన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ అరాచకాలపై ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. గెలుపు కేసీఆర్ పైసాదో, మా పోరాటపటిమదో చూద్దామని సవాల్ విసిరారు. 'ఇక ఐక్యంగా ఉద్యమిస్తాం, కేసీఆర్ కాస్కో'అని హెచ్చరించారు. త్వరలో అన్ని పార్టీలతో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తామని కోదండరాం తెలిపారు. విశ్రాంతి ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ రిక్రూట్మెంట్ తీరు ఇలా ఉంటే, మిగతా శాఖల్లో నియామకాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో అన్నిరకాల పరీక్షలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రమేయంలేని వారిని టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా, సభ్యులుగా నియమించాలన్నారు. సమావేశంలో ప్రొ.హరగోపాల్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి, తెలంగాణ విద్యావంతుల వేదిక కన్వీనర్ అంబటి నాగన్న, టీజేఎస్ ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శులు ధర్మార్జున్, బైరి రమేశ్, కాంగ్రెస్ నేతలు కిరణ్‌రెడ్డి, భూపతిరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గోవర్ధన్, ఝాన్సీ, ప్రవీణ్, విద్యార్థి సంఘాల నేతలు మహేశ్,, నాగేశ్వర్‌రావు, పుట్ట లక్ష్మణ్, ఓయూ జేఏసీ నేతలు శ్రీహరి, దయాకర్, నిరుద్యోగుల సంఘం నేత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ల వాడకంపైనే ప్రశ్నలు!

- వరసగా రెండోరోజూ కవితను విచారించిన ఈడీ
- తక్కువ కాలంలో ఎక్కువ ఫోన్లు ఎందుకు వినియోగించారు?
- ఏ ఫోను ఎప్పుడు వినియోగించారు? అంటూ..ప్రశ్నలు
- ఉదయం 11.30కు వెళ్లి రాత్రి 9.40 వరకు అక్కడే..
- తాజాగా 10 ఫోన్లు ఈడీకి అందజేసిన ఎమ్మెల్సీ
- క్లోనింగ్ కోసం పంపిన అధికారులు


విచారణ అనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న కవిత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వరసగా రెండోరోజు మంగళవారం కూడా ఈడీ విచారణకు హాజరయ్యారు. పలు అంశాలపై సుమారు పది గంటల పాటు అధికారులు ఆమెను ప్రశ్నించారు. ప్రధానంగా పది ఫోన్లు వినియోగించారన్న ఆరోపణలపై కవితను ప్రశ్నించినట్లు సమాచారం. మంగళవారం ఉదయం 11.30 గంటలకు తుగ్లక్ రోడ్‌లోని నివాసం నుంచి భర్త అనిల్ వెంట రాగా బయటకు వచ్చిన కవిత.. మీడియాకు విజయ సంకేతం చూపుతూ ఈడీ కార్యాలయానికి బయలుదేరారు. ఈడీ తన చార్జిషీటులో కవిత 6209999999 నంబరును ఆరు వేర్వేరు ఐఎంఈఐ నంబర్లున్న ఆరు ఫోన్లలో, 8985699999 నంబరును నాలుగు వేర్వేరు ఐఎంఈఐ నంబర్లున్న నాలుగు ఫోన్లలో వినియోగించారని ఆరోపించింది. దీంతో ఆ పది ఫోన్లను కవిత మంగళవారం ఈడీకి అందజేశారు. మనీలాండరింగ్ కేసులో ఆప్ అగ్రశ్రేణి నేతలతో కవిత సంభాషించారని, పాలసీ విధానం ముందుగానే వాట్సాప్‌లో లీకయిందన్న ఆరోపణల నేపథ్యంలో కవిత ఫోన్లు పరిశీలించే నిమిత్తం వాటిని తీసుకురావాలని కోరినట్లు తెలిసింది. కాగా కవిత నుంచి తీసుకున్న ఫోన్లను క్లోనింగ్ నిమిత్తం పంపినట్లు సమాచారం.

మూడు వాంగ్మూలాలపై సంతకాలు

దర్యాప్తు అధికారి జోగిందర్, ఓ మహిళా అధికారి సహా మరో ముగ్గురు అధికారులు కవితను ప్రశ్నించినట్లు తెలిసింది. ఏ ఫోనును ఎప్పుడు వినియోగించారు? ఏ రోజు నుంచి ఏ రోజు వరకు వినియోగించారు? తక్కువ కాలంలో ఎక్కువ ఫోన్లు వినియోగించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అనే కోణంలో ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. మొత్తం మూడుసార్లు విచారణ సందర్భంగా మూడు వాంగ్మూలాలు నమోదు చేసిన ఈడీ అధికారులు వాటిపై కవితతో పాటు ఆమె న్యాయవాది సంతకాలు కూడా తీసుకున్నట్టు సమాచారం. ఇలావుండగా ఇంతకుముందే ఒక ఫోన్‌ను ఈడీకి ఇచ్చిన కవిత.. ఈరోజు 10 ఫోన్లు ఇవ్వడంతో మొత్తం 11 ఫోన్లు ఇచ్చినట్టయ్యింది.

నేడు విచారణ లేనట్టేనా?

విచారణ అనంతరం రాత్రి 9.40 గంటలకు ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన కవిత.. పిడికిలి ఎత్తి, విజయ సంకేతం చూపుతూ, చిరునవ్వుతో శ్రేణులకు అభివాదం చేస్తూ నివాసానికి చేరుకున్నారు. తదుపరి విచారణ తేదీని ఈడీ ఇంకా ప్రకటించలేదు. అయితే బుధవారం విచారణకు రమ్మనలేదని బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి.

ఈడీ కార్యాలయానికి భరత్

కవితను విచారిస్తున్న సమయంలోనే బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. కవిత విజ్ఞప్తి మేరకే ఈడీ అధికారులు భరత్‌ను పిలిచినట్లు తెలిసింది. అయితే కవిత తరఫున తదుపరి విచారణలో పాల్గొనడానికి సంబంధించిన ప్రక్రియ నిమిత్తం పిలిచారా? లేక కవిత న్యాయవాది సమక్షంలో సమాధానాలు చెబుతానంటే పిలిచారా? అనేది తెలియలేదు.

ఫోన్లు ధ్వంసం చేశానని ఎలా ఆరోపిస్తారు?

▶ మొదటి పేజీ తరువాయి

చేశారన్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం విచారణకు ఆయా ఫోన్లతో ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు.

లేఖలోని సారాంశం...: ''దర్యాప్తు సంస్థ చర్యలు దుర్వినియోగంగా ఉన్నప్పటికీ తదుపరి విచారణల్లో సహకరించడానికి మీరు కోరిన విధంగా గతంలో వినియోగించిన ఫోన్లన్నీ అందిస్తున్నాను. నా హక్కులకు భంగం కలిగిస్తున్నా ఎలాంటి పక్షపాతం లేకుండా అందజేస్తున్నా. అయితే మహిళకు సంబంధించిన ఫోన్ స్వాధీనం చేసుకోవడమంటే గోప్యత హక్కుకు భంగం కలిగించినట్లు కాదా, నవంబర్ 2022లో పలువురు నిందితుల విచారణలో ఫోన్లు ధ్వంసమయ్యాయని స్టేట్‌మెంట్ ఇస్తే, దీన్ని నాకు కూడా ఆపాదిస్తూ చేసిన అసంబద్ధ ఆరోపణలను ప్రశ్నలించాలనుకుంటున్నా. నాకు సమన్లు జారీ చేయకుండా, నన్ను ప్రశ్నించకుండా దర్యాప్తు సంస్థ ఈ విధమైన ఆరోపణలు ఎలా చేస్తుంది? తొలిసారిగా మార్చి 2023లో విచారణ నిమిత్తం నాకు సమన్లు జారీ చేశారు. గతేడాది నవంబర్‌లోనే ఫోన్లు ధ్వంసం చేశానని ఆరోపించడం దురుద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేయడం కాదా? వాస్తవాలకు విరుద్ధంగా లీకులు ఇవ్వడం వల్ల రాజకీయ ప్రత్యర్థులు నన్ను ప్రజల్లో నిందిస్తున్నారు. తద్వారా నా ప్రతిష్టకు తీవ్ర భంగం కలగడంతో పాటు నా పరువు, పార్టీ ప్రతిష్టను ప్రజల్లో తగ్గించే ప్రయత్నం జరిగింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్న విధిని తొక్కిపెట్టి ఈడీ వంటి ఉన్నతమైన దర్యాప్తు సంస్థ స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడం దురదృష్టకరం. దీంతో నాపై వ్యతిరేక అభిప్రాయాలు సృష్టించడానికి దర్యాప్తు సంస్థ చేస్తున్న యత్నాలను తిప్పికొట్టడానికి నా ఫోన్లన్నీ స్వాధీనం చేస్తున్నా''అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖలో పేర్కొన్నారు. నివాసం నుంచి ఈడీ కార్యాలయానికి వెళ్లే సమయంలో ఐఎంఈఐ నంబర్లు అతికించిన ఫోన్లు మీడియా ముందు ప్రదర్శించారు.

పరీక్షల రద్దు మా విజయం: ప్రవీణ్‌కుమార్

తాడూరు: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని పాపగల్, సిర్సవాడ, బలాన్‌పల్లి గ్రామాల్లో పర్యటించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రం లీక్ కారణంగా రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. తన ఆమరణ దీక్ష కారణంగానే పరీక్షలను రద్దు చేశారని, ఇది బీఎస్పీ నైతిక విజయం అని చెప్పారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులపై పాలకులకు ఎలాంటి బాధ్యత లేకుండాపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తనను తానే కాపాడుకునే అవస్థలో పడిందన్నారు. ఏ లక్ష్యంతో తెలంగాణను సాధించుకున్నామో.. దాన్ని మరిచి నమ్మిన తెలంగాణ ప్రజలను ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆరోపించారు. స్వరాష్ట్రంలో అర్హులందరికీ ఉద్యోగాలు దక్కుతాయనే నమ్మకంతోనే ఎంతో మంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసి అమరులయ్యారని ప్రవీణ్ ఆవేదన వ్యక్తంచేశారు. అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు.

కిషన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్
- కేసీఆర్‌ను ఎదుర్కోలేకే.. ఈ కక్ష సాధింపు
- కొందరు ఇష్టమొచ్చినట్లు మాట్లాడి పైశాచికానందం పొందుతున్నారు.. ఆధారాలు సృష్టించి అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం జరుగుతోందని ధ్వజం


మీడియా సమావేశంలో వీడియో క్లిప్పింగును చూపిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారని గతంలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈడీ విచారణలో భాగంగా తాను గతంలో ఉపయోగించిన 10 సెల్‌ఫోన్లను మంగళవారం కవిత అధికారులకు సమర్పించినందున... కిషన్‌రెడ్డి కవితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత తన ఫోన్లను ధ్వంసం చేశారని కిషన్‌రెడ్డి ఎలాంటి ఆధారాలతో ఆరోపణలు చేశారని ఆయన ప్రశ్నించారు. శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కిషన్‌రెడ్డి ఏ ఆధారాలు లేకుండా ఊహించుకొని అబద్ధాలతో ఒక మహిళ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తెలంగాణ ప్రజలు సహించరన్న విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

తెలంగాణ ఆడబిడ్డపై కక్ష సాధింపు: సీఎం కేసీఆర్‌ను, దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక తెలంగాణ ఆడబిడ్డ కవితపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. దేశంలో లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోచుకొని విదేశాలకు పారిపోయిన అవినీతిపరులను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టుకోవట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక లక్షల కోట్లు కొల్లగొట్టిన వారిని వదిలిపెట్టి ఉల్లిగడ్డపై పొట్టు లాంటి రూ.100 కోట్ల స్కామ్ అనే పేరుతో లేని అధారాలను సృష్టించి కవితను వేధిస్తూ అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారం వచ్చినప్పటి నుంచి కొందరు అనవసర వ్యాఖ్యలు చేస్తూ పైశాచికానందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటలపాటు విచారణ చేస్తూ సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని కేంద్రంలోని బీజేపీ గుర్తుంచుకోవాలని, ప్రశ్నించే గొంతులను అణిచివేస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. మాటిమాటికి సౌత్‌గ్రూప్ అనే పేరుతో దక్షిణ భారతదేశాన్ని, తెలంగాణ మహిళలను కేంద్ర ప్రభుత్వం బద్నాం చేసే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. నిష్పక్షపాతంగా పనిచేసే దర్యాప్తు సంస్థలను, అధికారులను తమకు అనుకూలంగా పనిచేయాలని చెప్పడం దేశానికే అరిష్టమన్నారు.

మరో 'మహా'సభపై బీఆర్ఎస్ ఫోకస్

- 26న నాందేడ్ సమీపంలోని కాందార్ లోహాలో కేసీఆర్ అధ్యక్షతన సభ
- ఇప్పటికే డిజిటల్ ప్రచార రథాలతో తెలంగాణ పథకాలపై ప్రచారం
- సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ నేపథ్యంలో చేరికలపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలో కార్యకలాపాల విస్తరణపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) దృష్టిపెట్టింది. ఫిబ్రవరి 5న నాందెడ్‌లో జరిగిన తొలి సభ సక్సెస్ అయిన నేపథ్యంలో ఈ నెల 26న నాందేడ్‌కు 35 కి.మీ. దూరంలోని కాందార్ లోహాలో సైతం భారీ బహిరంగ నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఈ సభకు అధ్యక్షత వహించనుండటంతో జన సమీకరణను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. లక్షకు మందికిపైగా ప్రజలను ఈ సభకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ సభ ద్వారా లాతూర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ ప్రభావం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సభ ఏర్పాట్ల బాధ్యతను తెలంగాణ పీయూసీ చైర్మన్, ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హిమాన్షు తివారీ, పార్టీ మహారాష్ట్ర శాఖ కిసాన్‌సెల్ అధ్యక్షుడు మాణిక్ కదం పర్యవేక్షిస్తున్నారు.

తెలంగాణ మోడల్‌కు ప్రాధాన్యత...

కాందార్ లోహ బహిరంగ సభకు జన సమీకరణ కోసం కసరత్తు చేస్తున్న బీఆర్ఎస్ మహారాష్ట్ర గ్రామాల్లో తెలంగాణ మోడల్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి తదితర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను ప్రచారం చేసేందుకు 20 ప్రచార రథాలు, 16 డిజిటల్ స్క్రీన్ ప్రచార వాహనాలను ఉపయోగిస్తోంది. 16 తాలూకాల పరిధిలోని 1,600 గ్రామాల్లో తెలంగాణ మోడల్‌ను విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈ ప్రచార రథాలను ఉపయోగిస్తోంది. ఓవైపు తెలంగాణ మోడల్‌కు విస్తృత ప్రచారం కల్పించడంతోపాటు కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ వైఫల్యాలను వీడియోలు, ఇతర ప్రచార సామగ్రి రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రణాళికను అమలు చేస్తోంది. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని ఇప్పటికే బీఆర్ఎస్ ప్రకటించిన నేపథ్యంలో ఈ సభా వేదిక ద్వారా ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో చేరికల కోసం కసరత్తు జరుగుతోంది. సభలో వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు బీఆర్ఎస్‌లో చేరతారని చెబుతున్నా క్షేత్రస్థాయి కేడర్‌ను చేర్చుకొనేందుకే పార్టీ ప్రాధాన్యమిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే నాటికి నాందెడ్, ఔరంగాబాద్, బీడ్, ఉస్మానాబాద్, షోలాపూర్ తదితర ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది.

కర్ణాటక ఎన్నికలపై నజర్...

త్వరలో జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీపై ఎలాంటి కదలికలు లేకున్నా అక్కడి రాజకీయ పరిస్థితులపై బీఆర్ఎస్ అధ్యయనం చేస్తోంది. కర్ణాటక రాజకీయాలపై సర్వే సంస్థల ద్వారా ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు తెప్పించుకుంటున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కర్ణాటక రాజకీయాల పరిశీలనకు త్వరలో సీఎం కేసీఆర్ ఒక బృందాన్ని నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ముందు కేంద్రంపై గళమెత్తండి..

గవర్నర్ తమిళిసైకి మంత్రి సత్యవతి రాథోడ్ లేఖ

సాక్షి, హైదరాబాద్/హన్మకొండ అర్బన్: తెలంగాణ యువత ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాలపై వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై గళమెత్తాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసైని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ఈ మేరకు గవర్నర్‌కు రాసిన లేఖను ఆమె మంగళవారం హనుమకొండలో మీడియాకు విడుదల చేశారు. తెలంగాణ యువతపై ప్రేమ ఉంటే తొక్కిపెట్టిన కొలువుల బిల్లులపై వెంటనే సంతకం పెట్టాలని కోరారు. యువత ఎదుర్కొంటున్న సవాళ్లకు కేంద్ర ప్రభుత్వం, హైదరాబాద్‌లోని రాజ్‌భవనే కారణమనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ ఉగాది పండగ సందర్భంగా యువత ఎదుర్కొంటున్న చేదును దాటి తీపి రోజులు వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై స్పందించాలని సత్యవతి కోరారు.



మనసు పవిత్రంగా ఉన్నప్పుడు, సంతోషం అనేది ఎన్నటికీ విడువని నీడలాగా వెంట వస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, మార్చి, 22

భౌగోళిక రాజకీయ బంధం

పర్యటన పట్టుమని రెండే రోజులు. అలాగని తేలిగ్గా తీసుకుంటే పొరపాటే. మార్చి 20, 21ల్లో జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిదా జరిపిన భారత పర్యటన గురించి ప్రత్యేకించి చెప్పుకొనేది అందుకే. ఇండియా జీ20కీ, జపాన్ జీ7 దేశాల కూటమికీ సారథ్యం వహిస్తున్న వేళ ఇరు దేశాల నేతలూ సమావేశం కావడం కచ్చితంగా విశేషమే. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను తీవ్రంగా తప్పుబడుతున్న జీ7 అజెండా జపాన్‌ది కాగా, అదే ఉక్రెయిన్ అంశం కారణంగా జీ20లో ఏకాభిప్రాయం రాక ఇబ్బంది పడుతున్న పరిస్థితి భారత్‌ది. ఈ పరిస్థితుల్లో ఇరు దేశాధినేతల సమావేశం, స్నేహపూర్వక సంభాషణలు – పానీపూరీ చిరుతిళ్ళతో ఛాయాచిత్రాలు, భారత్‌లో లక్షల కోట్లలో పెట్టుబడులు పెడతామని కిషిదా ప్రకటన, చైనా కట్టడికి 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో – పసిఫిక్' అవసరం అంటూ కొత్త పల్లవిని ఎత్తుకోవడం – ఇలా 27 గంటల సుడిగాలి పర్యటనలో గుర్తుండే ఘటనలు అనేకం. సరిగ్గా చైనా అధ్యక్షుడు రష్యాలో పర్యటిస్తున్న వేళ జపాన్ ప్రధాని భారత్‌కు రావడం ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచంలో మారుతున్న భౌగోళిక రాజకీయాలకు మచ్చుతునక.

పదిహేనేళ్ళ క్రితం 2008లో అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే భారత్‌లోనే తన సిద్ధాంతమైన పసిఫిక్, హిందూ మహాసముద్రాల సంగమాన్ని వ్యూహాత్మక దర్శనం చేశారు. ఇప్పుడు కిషిదా 'క్వాడ్' కూటమిలో ఇతర భాగస్వామ్య దేశాలైన ఆస్ట్రేలియా, అమెరికాల్లో కాక భారత్‌లో 'స్వేచ్ఛా వాణిజ్యంతో కూడిన ఓపెన్ ఇండో–పసిఫిక్' అంటూ సైద్ధాంతిక ప్రకటన చేయడం విశేషం. భారత, జపాన్ ప్రధానుల ద్వైపాక్షిక సమావేశాలు 2006 నుంచి జరుగుతూనే ఉన్నాయి. ప్రోటోకాల్ ప్రకారం ఈసారి మోదీ జపాన్‌కు వెళ్ళాలి. అయితే, కిషిదా తానే హడావిడిగా భారత్‌కు రావడానికి కారణం ఉంది. మార్చి మొదట్లో భారత్‌లో జీ20 విదేశాంగ మంత్రుల సమావేశానికి జపాన్ విదేశాంగ మంత్రి హాజరు కాలేదు. ప్రతినిధిని పంపారు. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, రష్యా, బ్రిటన్ తదితర దేశాల విదేశాంగ మంత్రులు పాల్గొన్న అరుదైన కలయికకు హాజరవడం ఎంత ముఖ్యమో ఒకప్పటి విదేశాంగ మంత్రి కిషిదాకు తెలుసు. భౌగోళిక – రాజకీయ పటంలో తన స్థానాన్నీ, ప్రాధాన్యాన్నీ పెంచుకోవాలనుకొంటున్న తమ దేశం పక్షాన ఆయన తక్కున తప్పు దిద్దుకొన్నారు.

నిజానికి, భారత – జపాన్‌లు ఏడు దశాబ్దాల సుదీర్ఘ స్నేహాన్ని గడచిన 2022లోనే ఘనంగా జరుపుకొన్నాయి. ఒకప్పుడు మామూలు ప్రపంచ భాగస్వామ్యంగా మొదలై నేడు వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యంగా అది పెంపొందింది. అయితే, ఇప్పటికీ ఆర్థిక భాగస్వామ్యంలో, జనం మధ్య సంబంధాల్లో అంతరాలున్నాయి. వాటి భర్తీకి కిషిదా తాజా పర్యటన దోహదకారి. అలాగే, ఈ పర్యటనను కేవలం దౌత్య తప్పిదాన్ని సరిదిద్దే యత్నంగానే చూడనక్కర లేదు. జీ20లో అన్ని దేశాలూ కలసి చేయాల్సిన ప్రకటనకు చిక్కులు విడిపోలేదు గనక ప్రస్తుత జీ20, జీ7 సారథులిద్దరూ వివరంగా మాట్లాడుకొనడానికి ఇది సదవకాశమైంది. హిరోషిమాలో జరిగే జీ7 సదస్సులో పరిశీలకుడిగా పాల్గొనాలంటూ కిషిదా ఆహ్వానం, మోదీ అంగీకారం చెప్పుకోదగ్గవే. అయిదేళ్ళలో తమ సంస్థలు భారత్‌లో 5 లక్షల కోట్ల యెన్లు (4200 కోట్ల డాలర్లు) పెట్టుబడి పెడతాయని గత మార్చిలో మాటిచ్చిన జపాన్ నెమ్మదిగా అయినా ఆ దిశగా అడుగులు వేస్తోంది.

కిషిదా వెల్లడించిన భౌగోళిక రాజకీయాల్లో, వ్యూహాల్లో కీలకమైన 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో – పసిఫిక్' ప్రతిపాదన భారత్‌కూ లాభదాయకమే. ఇండో– పసిఫిక్‌లో చైనాకు ముకుతాడు వేయడానికి పొరుగు దేశంతో కలసి నడవచ్చు. కాకపోతే ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా – తన గడ్డపై అమెరికన్ సైనిక స్థావరాలను కొనసాగనిస్తూ, పాశ్చాత్య ప్రపంచంతో సైద్ధాంతిక స్నేహాన్ని కొనసాగిస్తున్న జపాన్ రక్షణ సామగ్రి, సాంకేతిక పరిజ్ఞాన సహకారంపై ఆరు విడతల చర్చల అనంతరం కూడా భారత్‌తో సంయుక్త భాగస్వామ్యానికి అడుగేయలేదు. రక్షణ ఉత్పత్తుల తయారీలో 'సహ–ఆవిష్కరణ, సహ–రూపకల్పన, సహ–సృష్టి' అవసరమంటూ తాజా పర్యటనలో కిషిదాకు మోదీ చెప్పాల్సి వచ్చింది. మూడో దేశంతో కలసి రక్షణ విన్యాసాలు అనేకం చేస్తున్నప్పటికీ, రక్షణ రంగంలో భారత్, జపాన్‌లు చేతులు కలపనిదే సంపూర్ణ 'ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో–పసిఫిక్' సాధ్యం కాదని కిషిదాకూ తెలుసు. అలాగే, భారీ భారత విపణిలో భాగస్వామ్యానికి ఆసక్తిగా ఉన్నప్పటికీ, భారత్‌లో వస్తూత్పత్తి రంగంలో పెట్టుబడులకు జపాన్‌లో తటపటాయింపు పోవాల్సి ఉంది. ఉక్రెయిన్ యుద్ధం అంశంలో భేదాభిప్రాయాలను పక్కన పెట్టాల్సి ఉంది.

మొత్తానికి ఉమ్మడి బెడదైన చైనా వల్ల భారత్, జపాన్‌లు మరింత సన్నిహితం కావచ్చు. నిరుడు 3 సార్లు, ఈ ఏడాది ఇకపై మరో 3 సార్లు ఇరువురు ప్రధానులూ కలవనుండడంతో ఇండో– పసిఫిక్ భౌగోళిక రాజకీయాల్లో మరిన్ని అడుగులు ముందుకు పడవచ్చు. భారత్‌కు కూడా రానున్న నెలలు కీలకం. భారత ప్రధాని మేలో జీ7 సదస్సులో, ఆ తర్వాత ఆస్ట్రేలియాలో 'క్వాడ్' సమావేశంలో పాల్గొంటారు. అటుపైన అమెరికాను సందర్శించనున్నారు. రాగల కొద్ది నెలల్లోనే ఎస్‌సీఓ, జీ20 సదస్సుల నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్‌లకు రెండు సార్లు ఆతిథ్యమిచ్చే అవకాశం భారత్‌కు రానుంది. వీటన్నిటి నేపథ్యంలో కిషిదా పర్యటన రానున్న సినిమాకు ముందస్తు ట్రైలర్. ప్రపంచం మారుతున్న వేళ మన భౌగోళిక రాజకీయ స్థానాన్ని పునర్నిర్వచించుకోవడానికి ఇది మంచి తరుణం కావచ్చు. విశ్వవేదిక సిద్ధమైంది. మరి, మనమూ సంసిద్ధమేనా?

ఇది డిజిటల్ చెల్లింపుల విప్లవం

డిజిటల్ చెల్లింపుల ఆవిష్కరణ భారత ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పును తీసుకొచ్చింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీలన్నింటినీ పరివర్తన చెందించిన గొప్ప విప్లవ ఆవిష్కరణే ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ. దేశీయంగా మొదలైన ఈ సరికొత్త సాంకేతిక వ్యవస్థ కోట్లాదిమందిని సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ చట్రం నుంచి బయటకు లాగడమే కాదు... దేశీయ వాణిజ్యాన్ని పునర్నిర్మించింది. మన ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఇది ఒక గేమ్ ఛేంజర్‌లా పనిచేసింది. ప్రజా జీవితంలో, బ్యాంకింగ్ రంగంలో, నగదు లావాదేవీల్లో సరికొత్త మార్పును తీసుకొచ్చిన భారతీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది.


ఆధునిక ఆర్థిక వ్యవస్థకు భారతదేశం అందించిన అధునాతన సాంకేతిక విప్లవం– డిజిటల్ పేమెంట్ సిస్టమ్. భారత్ రూపొందించిన దేశీయ తక్షణ చెల్లింపుల వ్యవస్థ వాణిజ్య కార్యకలాపాలను పునర్నిర్మించడమే కాదు, కోట్లాదిమంది ప్రజలను సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడేసింది. కేంద్ర ప్రభుత్వం దృఢమైన ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో దీన్ని రూపొందించింది. ఇది రోజువారీ జీవితాన్ని సౌకర్యవంతం చేసింది. రుణాలు, పొదుపులు వంటి బ్యాంకింగ్ సేవలను మరింతగా విస్తరింపజేసింది. కోట్లాది మంది భారతీయులకు ప్రభుత్వ కార్యక్రమాలను మరింతగా అందుబాటులోకి తీసుకొచ్చింది. పన్నుల సేకరణను కూడా సులభతరం చేసింది.

ప్రధాని నరేంద్రమోదీ జీ20 ఆర్థిక మంత్రులతో ముచ్చటిస్తూ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పాలనను మౌలికంగానే మార్చివేసిందని చెప్పారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అతి తక్కువ ఖర్చుతో ఏర్పర్చిన సాంకేతిక ఆవిష్కరణగా చూడవచ్చు. దీంతో మునుపెన్నడూ కనీవినీ ఎరగని స్థాయిలో అభివృద్ధి చెందిన దేశాలను సైతం ఎలా ప్రభావితం చేయవచ్చో భారత్ నిరూపించింది. భౌతిక మౌలిక వసతుల వ్యవస్థ వెనుకంజ వేస్తున్న పరిస్థితుల్లో కూడా ఇది ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుంది. ప్రపంచంలోకెల్లా నిరుపేద దేశాలను కూడా పైకి లేపేటటువంటి ఆలోచనల ఇంక్యుబేటర్‌గా భారత్ ఎగుమతి చేయాలనుకుంటున్న పబ్లిక్–ప్రైవేట్ మోడల్ ఇది.

భారత్ ప్రారంభించిన ఈ గొప్ప ఆవిష్కరణ కేంద్ర భాగంలో 'జేఏఎమ్' త్రయం ఉన్నాయి. అవి: జన్ ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్. ఈ మూడు మూలస్తంభాలూ భారత ఆర్థిక పర్యావరణ వ్యవస్థను సమూలంగా విప్లవీకరించాయి. మొదటి స్తంభమైన ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన ప్రతి వయోజన భారతీయుడికి ఒక బ్యాంక్ ఖాతాను గ్యారంటీగా అందించే ఆర్థిక కార్యక్రమం. 2022 నాటికి, ఈ పథకం కింద 46.25 కోట్ల బ్యాంక్ ఖాతాలను తెరిచారు. వీటిలో 56 శాతం మహిళల ఖాతాలు కాగా, 67 శాతం ఖాతాలు గ్రామీణ, అర్ధ పట్టణ ప్రాంతాల్లో తెరిచారు. ఈ ఖాతాల్లో రూ. 1,73,954 కోట్లు జమ అయ్యాయి.

ఇక రెండో మూలస్తంభం: ఆధార్ పరివర్తిత ఐడెంటిటీ సేవలు. ఆధార్ ఐడీని రెండు అంశాల ప్రామాణీకరణ లేదా బయోమెట్రిక్ ద్వారా ఉపయోగించవచ్చు. ఆధార్ ప్రామాణీకరణ బ్యాంకులు, టెల్కో వంటి సంస్థలకు మూలాధారంగా మారింది. ఈరోజు దేశంలోని 99 శాతం వయోజనులు బయోమెట్రిక్ గుర్తింపు నంబర్‌ను కలిగి ఉన్నారు. ఇంతవరకు 1.3 బిలియన్ ఐడీలు జారీ అయ్యాయి. ఈ ఐడీలు బ్యాంక్ ఖాతాల రూపకల్పనను సరళతరం చేసి సత్వర చెల్లింపుల వ్యవస్థకు పునాదిగా మారాయి.

ఇక మూడో మూలస్తంభం: మొబైల్. ఇది భారతీయ టెలికామ్ రంగంలో కీలకమైన డిజిటల్ ఆవిష్కరణ. 2016లో రిలయెన్స్ జియో టెలికామ్ రంగంలోకి దూసుకొచ్చిన తర్వాత డేటా ఖర్చు 95 శాతం వరకు పడిపోయింది. ప్రతి భారతీయుడికి ఇంటర్నెట్‌ను అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెచ్చింది. ఈ–కామర్స్, ఫుడ్ డెలివరీ, ఓటీటీ కంటెంట్ వంటి సమాంతర వ్యవస్థలకు జీవం పోసింది. ఇంకా ముఖ్యమైనది ఏమిటంటే, అత్యంత మారుమూల ప్రాంతాల్లోని చిట్ట చివరి వ్యక్తికి కూడా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.



ఇంటర్నెట్ అందుబాటు, స్మార్ట్ ఫోన్ల వ్యాప్తిని టెలిఫోన్ కంపెనీలు వేగవంతం చేయడం; ఆధార్ ప్రామాణీకృత జన్ ధన్ ద్వారా భారతీయ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థ సమూల మార్పునకు గురైంది. ఈ సమూల మార్పు బ్యాంక్ ఖాతాకు నగదు రహిత చెల్లింపులను అనుసంధానించే 'ఏకీకృత చెల్లింపుల మధ్యవర్తి' (యూపీఐ) భావనకు దారితీసింది. యూపీఐ ఒక ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) వ్యవస్థ. ఇది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) నేతృత్వంలో పనిచేసే వేదిక. ఈ వేదిక వందలాది బ్యాంకులు, డజన్లకొద్దీ మొబైల్ పేమెంట్ యాప్స్ నుంచి సేవలను అందిస్తుంది. దీనికి ఎలాంటి ట్రాన్సాక్షన్ ఫీజులు ఉండవు. ఫిన్‌టెక్, బ్యాంకులు, టెల్కోలు ఈ వేదికను స్వీకరించాయి. పైగా 'మర్చంట్ పాయింట్ ఆఫ్ సేల్స్' (పీఓఎస్) వద్ద క్యూఆర్ కోడ్ ప్లేస్‌మెంట్ల వల్ల యుపీఐ భావన మరింత పురోగమించింది.

ఎన్పీసీఐ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ అస్బె ప్రకారం – ఈ యేడాది జనవరిలో రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన 800 కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరిగాయి. ఈరోజు అన్ని రకాల చెల్లింపుల్లో 40 శాతం డిజిటల్‌గా జరుగుతున్నాయి. గత సంవత్సరం భారత్‌లో జరిగిన తక్షణ డిజిటల్ లావాదేవీల విలువ అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల మొత్తం డిజిటల్ లావాదేవీల కంటే ఎక్కువని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ జనవరిలో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలిపారు.

దేశంలోని 30 కోట్లమంది వ్యక్తులు, 5 కోట్లమంది వర్తకులు యూపీఐని ఉపయోగిస్తున్నారని దిలీప్ అస్బె తెలిపారు. అత్యంత చిన్న లావాదేవీలను కూడా డిజిటల్ చెల్లింపుల ద్వారా చేస్తున్నారు. 10 రూపాయల విలువ చేసే కప్పు పాలు లేదా రూ.200 విలువ చేసే సంచీడు తాజా కూరగాయలు వంటి లావాదేవీలు కూడా డిజిటల్ ద్వారానే జరుగుతున్నాయి. సుదీర్ఘకాలంగా నగదు చెల్లింపులు సాగుతున్న ఆర్థికవ్యవస్థలో ఇది గణనీయమైన మార్పు. నల్లధనం నిర్మూలనకు తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ మహమ్మారి కాలంలో సామాజిక దూరం పాటించడం వంటివి కూడా డిజిటల్ పేమెంట్ వ్యవస్థను మరింతగా ముందుకు నెట్టాయి.

భారత ప్రభుత్వం గోప్యత, సృజనాత్మక ఆవిష్కరణ మధ్య సరైన సమతూకాన్ని తీసుకొచ్చిందని జీ20 షేర్పా అమితాబ్ కాంత్ వ్యాఖ్యానించారు. డిజిటల్ చెల్లింపులను ఇంకా అమలు పర్చని రంగాల్లో కూడా, ఉదాహరణకు కేరళలోని మత్స్య పరిశ్రమలో ఐడెంటిటీ సంఖ్య, బ్యాంక్ ఖాతాలు, మొబైల్ ఫోన్ యాప్‌ల వంటి డిజిటల్ ప్రాథమిక పునాదులు సేవల సులభ పంపిణీకి వీలు కల్పిస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ విజయం డిజిటల్ పేమెంట్ మౌలిక వసతుల దృఢత్వంపై మాత్రమే ఆధారపడలేదు... అది నగదు నుంచి డిజిటల్‌కు మారడానికి ప్రజల్లో తెచ్చిన ప్రవర్తనాపరమైన ప్రోత్సాహంపై కూడా ఆధారపడి ఉంది.

టీ స్టాల్స్ వంటి వాటి వద్ద అమర్చిన పేమెంట్ యాప్స్ ద్వారా అందించిన చిన్న వాయిస్ బాక్సుల వంటి ఆసక్తికరమైన ఆవిష్కరణల్లో కూడా వీటి విజయం దాగి ఉంది. వీటి ద్వారా ప్రతి చిన్న లావాదేవీ తర్వాత అమ్మకందారులు ఫోన్ మెసేజ్‌లు తనిఖీ చేస్తూ బిజీగా ఉంటున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రతి పేమెంట్‌తో తక్షణం అందుకునే డబ్బు ఎంతో సిరి వంటి వాయిస్ ప్రకటిస్తుంది. నగదు లావాదేవీలను దీర్ఘకాలంగా ఉపయోగిస్తున్న వర్తకులలో ఏర్పడే అవిశ్వాసాన్ని తొలగించడంలో ఇది సాయపడుతుంది.

'కౌంటర్‌పాయింట్' ప్రకారం, భారత్‌లో 120 డాలర్ల సబ్ ఫోన్లకు మార్కెట్ వాటా రెండేళ్లకు ముందు 41 శాతం ఉండగా, 2022లో అది 26 శాతం పడిపోయింది. ఇదే కాలానికి 30 వేల రూపాయల (360 డాలర్లు) పైబడిన ధర కలిగిన ప్రీమియం ఫోన్ల వాటా రెట్టింపై 11 శాతానికి చేరుకుంది. ఫోన్లకోసం రుణాలు వంటి ఫైనాన్స్ ప్రాడక్ట్ ఆవిష్కరణలు ప్రీమియం ఫోన్లను చిన్న చిన్న పట్టణాలలోని సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఆధార్ ప్రామాణికత, మొబైల్ ఇంటర్నెట్ ఉపయోగంపై ఆధారపడిన సమీకృత ఆర్థిక వ్యవస్థ కారణంగా ఇది సాధ్యమైంది.

ఇవన్నీ దేశంలో వ్యాపారాన్ని, ఆంట్రప్రెన్యూర్‌షిప్‌ని, వినియోగ నమూనాలను విప్లవీకరించి భారతీయ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను గేమ్ ఛేంజర్‌గా చేయడమే కాకుండా, ప్రపంచానికే స్ఫూర్తిగా నిలిపాయి.

– టీఎస్/'పీఐబీ' రీసెర్చ్ వింగ్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పెద్ద సమస్య



కోవిడ్ ఎంఆర్ఎన్ఏ టీకాలు సురక్షితమైనవి, ప్రభావవంతమైనవి అని చెబుతున్న అబద్ధాలన్నీ చూస్తుంటే– 'మానవ హనన ఆయుధాలు', 'వాటర్ గేట్' లాంటివి కూడా పిల్లలాటల్లా కనబడుతున్నాయి. మనం నిజంగా, నిజంగా ఒక భయానకమైన అంశంతో వ్యవహరిస్తున్నాం.

– అసీమ్ మల్హోత్రా, కార్డియాలజిస్ట్

మనమంతా ఒక్కటే!



భారతీయులకు సంబంధించి కొన్ని విషయాల్లో మరో మాటకు తావు లేదు. సరిహద్దు సమగ్రత, సార్వభౌమత్వం అలాంటివే. ఈ అంశం వచ్చినప్పుడు ఆ రాష్ట్రానికి(పంజాబ్) ప్రతీ ఒక్కరూ మద్దతిస్తారు.

– కుశల్ మెహరా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఉస్తాద్‌కు వందనం



భారతరత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌ను ఆయన జయంతి (మార్చ్ 21) నాడు స్మరించుకుంటున్నాను. 'సుర్'(స్వరం) ఒక్కటే అయినట్టుగా, దేవుడు కూడా ఒక్కరేనని ఉస్తాద్ అనేవారు. మొహర్రం నాడు విషాదాంత రాగాలను చెమర్చిన కళ్లతో ఆలపించేవారు; హోలీ రోజున 'కాఫి' రాగంతో హుషారెక్కించేవారు.

– దయానంద్ కాంబ్లే, మహారాష్ట్ర ఉన్నతాధికారి

మరింత శ్రమ



మార్చ్ 21ని సింగిల్ పేరెంట్స్ డేగా జరుపుతున్నారు. ఎంపిక వల్ల కావొచ్చు, పరిస్థితుల వల్ల కావొచ్చు... సింగిల్ పేరెంట్స్ తమ పిల్లల్ని పెంచడానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ డబుల్ డ్యూటీ చేస్తున్నారు. వాళ్లకు హేట్సాఫ్!

– సుజాతా పరాశర్, 'గోయింగ్ సోలో' రచయిత్రి

గొప్ప గౌరవం



ఈ యేటి సంగీత కళానిధి పురస్కారానికి 'మ్యూజిక్ అకాడెమీ' నన్ను ఎంపిక చేయడం నాకు గౌరవాన్నీ, పులకరింతనూ కలిగిస్తోంది.

– బాంబే జయశ్రీ, గాయని

ఇన్‌బాక్స్

నీటిని వృథా చేయకండి!

భూమిపై మానవ మనుగడకు అవసరమైన ప్రధాన అవసరాలలో నీరు ఒకటి. నీటి వనరు లేకుండా, ఏ ప్రాణికీ మనుగడే ఉండదు. కొందరు నీరు లేక అల్లాడి పోతుంటే.. కొందరు మాత్రం నీటిని చాలా వృథా చేస్తున్నారు. పచ్చని చెట్లతో, పారే నదులతో, అందమైన పక్షులు, అలరించే జంతువులతో, ఎన్నో జీవుల్ని కలిగి ఉన్న గ్రహం భూమి. ఈ జీవుల మనుగడకు కావలసింది నీరు. అటువంటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతను గూర్చి ప్రజలకు అవగాహన కల్పించటానికి 1993లో ఐక్యరాజ్య సమితి మార్చి 22ను 'ప్రపంచ జల దినోత్సవం'గా ప్రకటించింది. భూమి ఏర్పడినపుడు ఎంతయితే నీరు ఉందో ఇప్పుడు కూడా అంతే నీరు ఉంది. కానీ ప్రపంచ జనాభా నిత్యం పెరుగుతూనే ఉంది. అందువల్ల కోట్లాదిమంది నీటి కోసం కటకటలాడుతున్నారు.

భూమి మీద ఉన్న నీటిలో 97 శాతం ఉప్పు నీరు. కేవలం 3 శాతం మాత్రమే మంచి నీరు ఉంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది. ప్రపంచంలో భారీ యుద్ధాల వల్ల చనిపోయిన వారి కన్నా కలుషిత నీరు తాగడం వల్ల మరణించిన వారి సంఖ్య ఎక్కువ. సంవత్సరానికి నలభై లక్షల మంది కలుషిత నీరు తాగడం ద్వారా మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

పాఠశాల స్థాయి నుండే నీటి పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి. నీటి ప్రాముఖ్యతను, పొదుపును గూర్చి సెమినార్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. నీటిని నిల్వచేసే పద్ధతులు, జలకాలుష్య కారణాల వల్ల కలిగే నష్టాలను గూర్చి వివరించినపుడే భవిష్యత్తులో భావిపౌరులు నీటి వనరులు మరింత కలుషితం కాకుండా కాపాడు కోగలుగుతారు.

– సుధాకర్. ఎ. వి.,
ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రంగారెడ్డి జిల్లా
(నేడు అంతర్జాతీయ జల దినోత్సవం)

ప్రకృతి, నమ్మకాల కలబోత

సందర్భం



నందిరాజు రాధాకృష్ణ

రుతువులు మారుతుంటాయి. వాటితోపాటే అవి మనకు పంచిచ్చే అనుభూతులూ మారుతుంటాయి. అందుకే ప్రకృతి ఎప్పుడూ నిత్య నూతనంగా ఉంటుంది. శిశిరంలో మోడైపోయిన చెట్లన్నీ వసంతంలో చిగుళ్లు తొడిగి కొత్త సింగారాలు ఒలికిస్తూ ఉంటాయి. వసంత రుతువు తానే అన్నాడు శ్రీకృష్ణుడు. సంవత్సర ఆరంభానికి దీన్నే కాలమానంగా తీసుకుని తొలి రుతువుగా చెబుతారు. అలాంటి వసంతంలో వచ్చే తొలి మాసం చైత్రం. తిథుల్లో తొలి గౌరవం పాడ్యమిది. బ్రహ్మ సృష్టి ఆరంభించినది ఈ చైత్ర శుద్ధ పాడ్యమినాడే అంటోంది బ్రహ్మ పురాణం. అదే యుగాది.

తెలుగు సంవత్సరాలు మొత్తం అరవై. ప్రభవ నామ సంవత్సరం మొదటిది. క్షయ నామ సంవత్సరం చివరిది. ఈ రోజు మనం శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నాము. ఈ మొత్తం 60 సంవత్సరాలలో మనిషి తన జీవితకాలం మొత్తం మీద రెండు కన్నా ఎక్కువ సార్లు ఒకే సంవత్సరాన్ని చూడలేడు. అందుకే తను జన్మించిన సంవత్సరం మళ్లీ చూసిన నాడు... అంటే తన అరవయ్యో ఏట (60 పుట్టినరోజు) తనకి అంత ఆయుష్షు ఇచ్చినందుకు గాను 'షష్టిపూర్తి మహోత్సవం' జరుపుకొంటాడు.

సోమకుడనే రాక్షసుడు వేదాలను దొంగిలించినప్పుడు శ్రీ మహావిష్ణువు మత్స్యావతారం ఎత్తి సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మకి అప్పగిస్తాడు. బ్రహ్మ అప్పుడు సృష్టి, స్థితి, లయ అనే మూడు పనులలో మొదటిదైన సృష్టి కార్యాన్ని ఇదేరోజు... అంటే చైత్ర శుద్ధ పాడ్యమి నాడు మొదలుపెట్టాడని పురాణాలు చెబుతున్నాయి. యుగానికి ఆది అంటే యుగానికి మొదటి రోజు కాబట్టి అది 'యుగాది'గా మనం జరుపుకొంటున్నాము. వ్యవహారంలో ఉగాది అంటున్నాం. ఉగాది రోజు ఇష్ట దైవాలను పూజించి పెద్దలకు, పిన్నలకు కొత్త బట్టలు ఇవ్వడం ఆనవాయితీ. అలాగే ఉగాది పండుగ రోజు మాత్రమే చేసుకునే ఉగాది పచ్చడి వెనుక కూడా ఎంతో అర్థం ఉంది. జీవితంలో ఎదురయ్యే సుఖ దుఃఖాలు, ఆశ్చర్యానందాలకు ప్రతిరూపంగా ఆరు రుచుల సమ్మేళనంతో చేసే ఈ పచ్చడిని ఈ రోజు ప్రతి ఒక్కరూ తప్పకుండా సేవించాలి.

ఈ పచ్చడిలో ఉండే ఒక్కొక్క పదార్థం మన జీవితంలోని ఒక్కొక భావానికీ, అనుభవానికీ ప్రతీక. బెల్లం (తీపి) ఆనందానికి సంకేతం. ఉప్పు జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం. వేప పువ్వు (చేదు) బాధకలిగించే అనుభవాలకూ, చింతపండు (పులుపు) నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులకూ; పచ్చి మామిడి ముక్కలు– పులుపు – కొత్త సవాళ్లకూ; మిరపపొడి (కారం) సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకూ సంకేతాలు.



శాస్త్రీయ కోణంలో చూస్తే... ప్రకృతి అప్పుడే చలి కాలం నుండి ఎండాకాలం లోకి మారుతుంది కాబట్టి వాతావరణం మార్పులకు కఫ దోషాలు ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా ఈ పచ్చడి ఎంతో ఉపయోగపడుతుంది. ఉగాది రోజు నుంచి శ్రీ రామ నవమిరోజు వరకు ఈ పచ్చడి తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని పెద్దలు చెబుతున్నారు.

మనకు మొత్తం 15 తిథులు, 7 వారాలు, 27 నక్షత్రాలు, 27 కరణములు, 11 యోగములు ఉన్నాయి. ప్రతి మనిషి జన్మ నక్షత్రాన్ని బట్టి అతనికి ఆ సంవత్సరం ఎలా ఉందో, ఏ కార్యక్రమాలు చెయ్యవచ్చో పంచాంగం తెలియచేస్తుంది. మనం ఇంగ్లిష్ క్యాలెండర్ వాడుతున్నప్పటికీ... శుభకార్యాలకు మాత్రం పంచాంగం ప్రకారమే ముహూర్తాలు పెట్టుకుంటాం. తిథి వార నక్షత్ర యోగ కరణములతో కూడినది పంచాంగం. తిథి వలన సంపద, వారము వలన ఆయుష్షు, నక్షత్రము వలన పాప పరిహారము, యోగము వలన వ్యాధి నివారణం, కరణము వలన కార్యానుకూలత చేకూరుతాయని అంటారు. పంచాంగం వింటే గంగలో స్నానం చేసినంత పుణ్యమనీ, గోదానంతో సమానమైన మేలు చేకూరుతుందనీ, ఆయుష్షు పెరుగుతుందనీ, సంతాన సౌభాగ్యం లభిస్తుందనీ అనాదిగా విశ్వాసం.

విక్రమార్కుడూ, ఆంధ్రరాజుల చక్రవర్తి శాలివాహనుడూ సింహాసనాన్ని అధిష్ఠించిందీ ఈ చైత్ర శుద్ధ పాడ్యమినాడే. విక్రమార్క శకం ఉగాది నాడే ప్రారంభమైంది. రామపట్టాభిషేకం జరిగిందీ, శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించిందీ, కలియుగం ప్రారంభమైందీ ఈరోజేనని పండితులు చెబుతారు. ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త వరాహమిహిరుడి అంచనాల ప్రకారం చైత్రమే తొలిమాసం. ఆ రోజే తొలి పంచాంగాన్ని జనజీవన స్రవంతికి అంకితం చేశాడాయన. చలివేంద్రం పెట్టి వేసవిలో బాటసారులకు దాహం తీర్చడం ఈ రోజు ఆరంభించాలని శాస్త్రం చెప్తోంది. అలా జలదానం చేస్తే పితృదేవతలు సంతోషిస్తారట.

ఇన్ని ప్రత్యేకతలున్నాయి కాబట్టే చాంద్రమానాన్ని అనుసరించే తెలుగు, కన్నడ, మహారాష్ట్ర ప్రజలు చైత్ర శుద్ధ పాడ్యమినే నూతన సంవత్సర ఆరంభదినంగా కొత్తదనానికి ప్రారంభంగా భావించి పండగ జరుపుకొంటారు.

సౌరమానాన్ని పాటించే తమిళులు, మలయాళీలు, బెంగాలీలు, సిక్కులు చేసుకునే ఉగాది కూడా వసంతంలోనే రావడం విశేషం. ఇన్ని విశేషాలు కలిగిన మన తెలుగు వారి మొదటి పండుగను అందరూ కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకొని ఆనందించాలనీ, ఈ శోభకృత్ నామ సంవత్సరం అందరికీ విజయాలు కలిగించాలనీ కోరుకుంటూ... అందరికీ ఉగాది శుభాకాంక్షలు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 98481 28215

శుభమయం కావాలంటే...

తన పేరుకు తగ్గట్టుగా శుభాలు వర్షించి వెళ్ళిందని చెప్పలేం గానీ, గడిచిపోయిన శుభకృత్తు నామ సంవత్సరం, అంతకుముందు వచ్చిన కరోనా–గ్రస్త సంవత్సరాలతో పోలిస్తే కొంత సజావుగా, సాధారణంగా నడిచింది. కలి కాలం గనక కలి విలాసాలూ, ఈతి బాధలూ తప్పకపోయినా, మహమ్మారులతో, మహోపద్రవాలతో మాత్రం దేశాన్ని బాధించలేదు.

జ్యోతిర్మయం

శుభకృత్తు తరవాత శోభకృత్తు. పేరు బాగుంది. కానీ అనుభవాన్ని బట్టి చూస్తే, పేరులో ఏమీ ఉన్నట్టు కనిపించదు. ఉదాహరణకు 1983లో రుధిరోద్గారి వచ్చింది, ప్రశాంతంగానే గడిచి పోయింది. 1962లో శుభకృత్తు నడిచినప్పుడు, చైనా దురాక్రమణ వల్ల దేశం బాగా నష్టపోయింది. కాబట్టి సంవత్సరం పేరుకూ దాని ప్రభావానికీ సంబంధం నేతి బీర కాయలో నెయ్యి.

అయితే సంవత్సరం పేరేదయినా, మరో ఉగాది మైలు రాయి వచ్చిందంటే, ఒక విధంగా దాని పాటికదే ఒక శుభ సమాచారం. ఆత్మవినాశానికి మానవజాతి అనేక విధాలుగా కృషి చేస్తున్నట్టు కనిపిస్తున్నా, జగత్తును జనింపజేసే ఈశ్వరుడికి మనం మారతామన్న విశ్వాసం ఇంకా అంతరించలేదనేందుకు ప్రతి నూతన ప్రభాతమూ, ప్రతి ఉగాది శుభోదయమూ ఒక దాఖలా. మానవాళిలో మార్పు రావడానికి మరి కొంత వ్యవధి ఇచ్చేందుకు సృష్టికర్త సుముఖంగానే ఉన్నాడన్న మాట.

నిజానికి శుభకృత్తు శుభమయం కావాలన్నా, శోభకృత్తు శోభస్కరం కావాలన్నా అది దానంతటదే జరగదు. ఆ దిశగా కృషి జరిగితేనే అది సాధ్యమవుతుందని ఎవరో చెప్పాల్సిన పని లేదు. వ్యక్తి గానీ, సమాజం గానీ అతి సంకుచిత స్వార్థాలకూ, అవధి లేని పర్యావరణ విధ్వంసానికీ, విద్వేషాలకూ, కావేశాలకూ, హింసకూ దూరంగా, వివేకంతో, నిగ్రహంతో వర్తించుకోగలిగితే, సంవత్సరం పేరేదయినా అది ఆ వ్యక్తికీ, ఆ సమాజానికీ శాంతి సౌభాగ్యాలను చేకూరుస్తుంది.

ఆత్మ సంయమనం మీదా, ధర్మా ధర్మాల మీదా, కర్తవ్యపాలన మీదా, పరస్పర ప్రేమాదరాల మీదా, భావ వైశాల్యం మీదా, బాధ్యతాయుత ప్రవర్తన మీదా... దృష్టి ఉంచే వ్యక్తికీ, సమాజానికీ అన్ని సంవత్సరాలూ శుభకృత్తులే, శోభకృత్తులే! వాస్తవానికి, మనిషికి శుభకృత్తూ, శోభకృత్తూ మనిషే! వేప పూత పచ్చడులూ, మామిడాకుల తోరణాలూ, పండుగ వేడుకలూ ఇత్యాదులు సకారాత్మకమైన సద్భావనలకు దోహదం చేసే శక్తిమంతమైన సంప్రదాయాలు. శోభకృత్తుకు స్వాగతం. అందరికీ ఉగాది శుభాకాంక్షలు!

– ఎం. మారుతిశాస్త్రి
(నేడు ఉగాది)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: తిథి శు.పాడ్యమి రా.9.54 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.4.57 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: తె.4.35 నుండి 6.10 వరకు (తెల్లవారితే గురువారం), దుర్ముహూర్తం: ప.11.44 నుండి 12.31 వరకు, అమృతఘడియలు: ప.12.22 నుండి 1.54 వరకు, ఉగాది; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.06.

ఇసుక దోపిడీ రూ.100 కోట్లు

రెండున్నరేళ్లలో ప్రభుత్వ ఖజానాకు గండి ● రాష్ట్రంలోని రీచ్‌ల వద్ద దర్జాగా ఇసుక దందా..

- వే బిల్లులు లేకుండానే అక్రమ తరలింపు
- పట్టించుకోని టీఎస్ఎండీసీ... అక్రమార్కులతో కుమ్మక్కు
- ప్రస్తుతం తెలంగాణలో 34 యాక్టివ్ రీచ్‌లు


వరంగల్ - హైదరాబాద్ రహదారిపై తనిఖీలు ముమ్మరం చేయడంతో హసన్‌పర్తి సమీపంలోని బైపాస్‌పై నిలిచిన ఇసుక లారీలు


నకిలీ వేబిల్లులపై ఇసుక సరఫరా చేస్తుండగా పట్టుకుని పోలీసులు సీజ్ చేసిన లారీలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో నకిలీ వే బిల్లులతో రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ మార్గంలో తరలిపోతోందని వరంగల్ కమిషనరేట్ పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసింది. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా మూలంగా రెండున్నరేళ్లలో సుమారు రూ.100 కోట్లకుపైగా ఆదాయం పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. టీఎస్ఎండీసీ పర్యవేక్షణలోనే నకిలీ వే బిల్లుల దందా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తడం గమనార్హం. కొందరు ఇసుక రవాణాదారులు, టీఎస్ఎండీసీ అధికారులు కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ములుగు నుంచి తీగలాగితే...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 34 యాక్టివ్ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణా సాగుతోంది. ఇసుక లభ్యత ఉన్నచోట స్థానికులకు భాగస్వామ్యం కల్పించి టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో క్వారీలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ములుగు జిల్లాలోని మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో 6 ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. వీటి నుంచి నిత్యం 300 నుంచి 600 లారీలు లోడింగ్ అవుతున్నాయి. 15 రోజుల క్రితం ములుగు జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఇసుక లారీని వరంగల్‌లో పోలీసులు తనిఖీ చేశారు. నకిలీ వేబిల్లులతో తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా.. యజమానికి 8 లారీలు ఉన్నాయని, ఏటూరునాగారం, వాజేడు ప్రాంతాల్లో యజమాని చెప్పిన చోటుకు వెళ్లి లోడింగ్ చేసుకుంటానని చెప్పుకొచ్చారు. దీంతో స్లాట్ బుకింగ్ చేసుకోకుండా నేరుగా లోడింగ్ చేసుకోవడం,, డబ్బులు చెల్లించడమేంటని పోలీసులకు అనుమానం వచ్చి టాస్క్‌ఫోర్స్ అధికారులకు కేసును అప్పగించారు.

3 నెలల్లో 1800 లారీల ఇసుక అక్రమ తరలింపు

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మంచిర్యాల, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచే మూడు నెలల్లో 1800 లారీల ఇసుక ఎలాంటి సొమ్ము చెల్లించకుండా తరలినట్లు పోలీ సు విచారణలో తేలగా, రెండున్నరేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 34 యాక్టివ్ రీచ్‌ల నుంచి రూ.100 కోట్లకు పైగా వి లువచేసే ఇసుక తరలి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

రూపాయి చెల్లించకుండా 30 టన్నుల ఇసుక

ములుగు, ఏటూరు ప్రాంతంనుంచి వచ్చే ఇసుక లారీలపై పోలీసులు నిఘా పెట్టారు. వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, జనగాం తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టి దాదాపు 40 లారీలను స్వాధీనం చేసుకున్నారు. 12 టైర్ల లారీలో 26 టన్నుల ఇసుక నింపుకుంటే రూ.10,500 చెల్లించాల్సిన కొందరు లారీ యజమానులు నకిలీ వేబిల్లులతో ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా 26 నుంచి 30 టన్నులు తీసుకెళ్లినట్లు తేలింది. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి వారినుంచి 16 లారీలు, 65 నకిలీ వే బిల్లులు, 16 టీఎస్ఎండీసీ స్టాంపులు, 1 లాప్‌టాప్, 11 సెల్‌ఫోన్‌లు, రూ. 41,000ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దందా వెనుక కొందరు టీఎస్ఎండీసీ అధికారుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రతి క్వారీ వద్ద టీఎస్ఎండీసీకి చెందిన సూపర్‌వైజర్ ఉంటారు. వీరి ప్రమేయం లేకుండా ఇసుక లారీ బయటకు వెళ్లే ప్రసక్తే ఉండదు. కొందరు అధికారులు, క్వారీ నిర్వాహకులు, లారీల యజమానులు కలిసే అక్రమ దందా కొనసాగిస్తున్నారన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

టెక్నాలజీనే నమ్ముకుంటే ప్రమాదమే..

కేవలం సాంకేతికతతో ప్రశ్నపత్రాల భద్రత సందేహమే

- 'సాక్షి'ఇంటర్వ్యూలో ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ డాక్టర్ వెంకటరామిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు లక్షల మంది ఉద్యోగార్థులకు సంబంధించిన అంశంతోపాటు ప్రభుత్వ ప్రతిష్టతోనూ ఇమిడి ఉంటాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు (2005–11) చైర్మన్‌గా, యూపీఎస్సీ సభ్యుడిగా పనిచేసిన డాక్టర్ వై. వెంకటరామిరెడ్డి అభిప్రాయపడ్డారు. సైబర్ నేరగాళ్లు సులువుగా రూ. కోట్లు కొట్టేస్తున్న రోజుల్లో కీలకమైన ప్రశ్నపత్రాలను కేవలం టెక్నాలజీతో భద్రంగా ఉంచడం ఎంతవరకు సాధ్యమనే సందేహాన్ని ఆయన వెలిబుచ్చారు. సాంకేతికను కొంతవరకు నమ్ముకొని గత విధానాలను అనుసరిస్తే పేపర్ లీక్ వంటి ఘటనలకు తావుండబోదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నపత్రాల రూపకల్పన మొదలు అనేక అంశాలను వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే...

మానవసహిత భద్రతకే ప్రాధాన్యమివ్వాలి...

పాస్‌వర్డ్ లేదా ఓటీపీని తెలుసుకొని కేటుగాళ్లు రూ. కోట్లు కొల్లగొడుతున్న రోజులివి. కంప్యూటర్ యుగంలో రోజుకో సమస్య తెరపైకి వస్తోంది. అలాంటప్పుడు కేవలం సాంకేతికతపై ఆధారపడటం సరికాదేమో. టెక్నాలజీని అనుసరించడం అనివార్యమే అయినప్పటికీ లక్షల మంది జీవితాలతో ముడిపడిన ఇలాంటి పరీక్షలపట్ల అప్రమత్తత అవసరం. మానవసహితమైన భద్రత కే ప్రాధాన్యం ఇవ్వడం మంచిదనేది నా అనుభవం.

అప్పట్లో ఏం చేశామంటే..

నేను ఆరేళ్లు ఏపీపీఎస్సీ చైర్మన్‌గా పనిచేశాను. నా హయాంలో ఏనాడూ పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకోలేదు. అప్పట్లో మేం అనుసరించిన విధానాలు వేరు. చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇలాంటి కీలక పరీక్షల ప్రశ్నపత్రాల రూపకల్పన సమయంలో అనుసరించిన విధానాలు లీక్‌లకు ఆస్కారం లేకుండా చేశాయి. ఒక్కో సబ్జెక్టుకు ఐదుగురు ఎగ్జామినర్లను పిలిచేవాళ్లం. వారిని పూర్తి భద్రత ఉన్న హాలులోకి పంపే ముందే సమగ్రంగా పరీక్షించే ఏర్పాట్లు ఉండేవి. వాళ్ల వద్ద పెన్ను, పెన్సిల్ ఆఖరుకు చిన్న కాగితం ముక్క కూడా లేకుండా జాగ్రత్త పడేవాళ్లం. వారు బయటకు వెళ్లేటప్పుడు కూడా ఇదే తరహా తనిఖీలు ఉండేవి. ప్రశ్నపత్రానికి సంబంధించిన అంశాలనేవీ వారు రాసుకొని వెళ్లేందుకు వీల్లేకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకొనేవాళ్లం.

ప్రశ్నపత్రం చైర్మన్‌కు కూడా తెలిసేది కాదు...

ఒక్కో సబ్జెక్ట్ నిపుణుడు ఒక్కో పేపర్‌ను సెట్ చేశాక దాన్ని సీల్డ్ కవర్‌లో కమిషన్ సెక్రటరీకి అందజేస్తారు. సెక్రటరీ తనకు అందిన ఐదు పేపర్లనూ కమిషన్ చైర్మన్ ముందు పెట్టేవారు. అందులోంచి ఒక పేపర్‌ను చైర్మన్ ఎంపిక చేశాక నేరుగా ప్రింటింగ్ కేంద్రానికి తరలేది. ఇక్కడ కమిషన్ చైర్మన్ లేదా సెక్రటరీ ప్రశ్నపత్రాన్ని చూసే అవకాశం లేదు. అలాగే ఎంపిక చేసిన పేపర్ ఏమిటనేది దాన్ని సెట్ చేయడానికి వచ్చిన ఐదుగురికి తెలిసే అవకాశమే ఉండదు. ప్రింటింగ్ కేంద్రం నిర్వాహకులకు మాత్రమే ఈ పేపర్ ఏమిటనేది తెలిసే అవకాశం ఉంటుంది. పేపర్ లీక్ అయితే కేవలం ప్రింటర్‌ను మాత్రమే బాధ్యుడిని చేసేలా అప్పట్లో నిబంధనలుండేవి. ఒకవేళ పేపర్ లీక్ అయితే ప్రింటర్‌కు భారీ జరిమానా విధించేలా నిబంధనలు తెచ్చాం. పేపర్ లీక్ అయితే ప్రింటర్ ఆస్తులన్నీ జరిమానా కింద పోయేంత ప్రమాదం ఉండేది. కాబట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇలాంటి రిస్క్‌ను ప్రింటర్ తీసుకొనే అవకాశం ఉండేది కాదు. ఈ విధానాన్ని అనుసరించడం వల్లే అప్పట్లో పేపర్ లీకేజీలు ఉండేవి కావు.

భద్రత ఎంత వరకూ?

పేపర్ల లీకేజీపై పత్రికల్లో వస్తున్న కథనాలనుబట్టి ఒక వ్యక్తి పాస్‌వర్డ్ తీసుకొని ఇదంతా చేసినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి ఇప్పుడున్న టెక్నాలజీపై అనేక అనుమానాలు రావడం సహజమే. ఇది ఎంతవరకు భద్రత ఇస్తుందనేది ఇందులో ప్రధానాంశం. తాత్కాలిక ఉద్యోగులు ఉండటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయనే వాదన అర్థరహితం. ఇప్పుడే కాదు... అప్పట్లోనూ తాత్కాలిక ఉద్యోగులు ఉండేవారు. కేవలం కమిషన్ నిర్వహణలో విశ్వసనీయతే ఇక్కడ ప్రధానం. ఏ వ్యక్తీ ప్రశ్నపత్రం చూసే అవకాశం లేకుండా చేయడమే ఇక్కడ ముఖ్యం.

మళ్లీ పరీక్ష అనివార్యమే..

పేపర్ లీకేజీ వల్ల మళ్లీ పరీక్ష నిర్వహించడం అనివార్యమే. ఈ క్రమంలో పేద, మధ్యతరగతి వర్గాల మనోవేదన వర్ణనాతీతం. అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకున్న వాళ్లున్నారు. ఎన్నో ఆశలతో ఇదే జీవితమని భావించి చదివిన వాళ్లూ ఉన్నారు. మళ్లీ పరీక్ష రాయాలంటే వారికి సమస్యే. కోచింగ్ కోసం మళ్లీ అప్పులపాలవ్వాల్సిన పరిస్థితి వారికి ఉండొచ్చు. ఈ సమస్యకు ఎవరూ పరిష్కారం చూపలేరు. పరీక్షల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి వారి ఆవేదనకు కమిషన్ కారణం కాకుండా చూడొచ్చు.

క్లుప్తంగా...

కొమురంభీం జిల్లాలో కంపించిన భూమి



కౌటాల/చింతమానెపల్లి: కుమురం భీం జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఉదయం 8.40 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. కొద్ది సెకన్లపాటు వచ్చిన ప్రకంపనలతో ఆయా మండలాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సిర్పూర్(టి) నియోజకవర్గం కేంద్రంగా భూకంపం వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కాగా, భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.1గా నమోదైంది. కౌటాల, సిర్పూర్(టి), చింతల మానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల్లోని పలు గ్రామాల్లో ఇళ్లలోని వస్తువులు కింద పడటంతో గమనించిన పలువురు భయాందోళనలతో బయటకు పరుగెత్తారు. భూప్రకంపనల ద్వారా ఎలాంటి నష్టం లేదని, ప్రజలు భయాందోళనలకు గురికా వొద్దని అధికారులు తెలిపారు.

ప్రీతి కేసులో నిందితుడి బెయిల్ పిటిషన్ కొట్టివేత

వరంగల్ లీగల్: కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి కేసులో నిందితుడు షఫీ దాఖలు చేసిన రెండో బెయిల్ పిటిషన్‌ను మంగళవారం వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి తిరస్కరించారు. కేసు పరిశోధన ఇంకా కొనసాగుతున్నందున నిందితుడికి బెయిల్ ఇవ్వడం వల్ల సాక్ష్యాధారాలను ప్రభావితం చేయడానికి ఆవకాశం ఉందని పీపీ సత్యనారాయణ చేసిన వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు.అనంతరం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

మహిళా మావోయిస్టు మృతి

చర్ల: తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కొర్చోలి–తొడ్కా అటవీ ప్రాంతాల్లో పీఎల్‌జీఏ కమాండర్ వెల్లా, గంగులూరు ఏరియా కమిటీ సభ్యుడు దినేశ్ సహా మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో కొర్చోలి అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. దీంతో బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందగా మిగిలిన వారు పారిపోయారు. సదరు మహిళ మావోయిస్టు వద్ద ఒక తుపాకీని స్వాధీనం చేసుకోగా, విప్లవ సాహిత్యం, నిత్యావసర సరుకులు లభ్యమయ్యాయని పోలీసు బలగాలు వెల్లడించాయి.

గుత్తా, పోచారం ఉగాది శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు చేకూరాలని, ఉగాది పండగను ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

గిరిజనులకు మేమిచ్చిన భూమి, పట్టాలు లాక్కుంటారా?

కుమురంభీం జిల్లా పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క


కెరమెరిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో సీతక్క

కెరమెరి(ఆసిఫాబాద్): కాంగ్రెస్ పార్టీ హయాంలో గిరిజనులకు అందించిన అటవీ హక్కుపత్రాలు, భూములను లాక్కునే హక్కు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రశ్నించారు. హథ్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని జామ్ని నుంచి కెరమెరి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులపై గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం సర్వహక్కులు కల్పించిందన్నారు. పట్టాలు ఉన్నా భూమిని సాగు చేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని బూసిమెట్ట క్యాంపు వద్ద ఆదివాసీ మహిళలు రుక్మిణీబాయి, సుశీలబాయి, లక్ష్మీబాయి గోడు వెళ్లబోసుకున్నారని తెలిపారు. రూ.2.90 లక్షల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో తాగేందుకు నీళ్లు, ఉండేందుకు ఇళ్లు, రోడ్లు లేవన్నారు.పేపర్ లీక్ కావడం సర్వసాధారణమే అని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, అలాంటి వారిని ప్రజలు గద్దె దింపాలని అన్నారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు పాల్గొన్నారు.

హోమియో మందులతో తోటలను రక్షించుకోవచ్చు

అమేయ కృషి వికాస కేంద్రం రైతుశాస్త్రవేత్త బాల్‌రెడ్డి

సాక్షి సాగుబడి, హైదరాబాద్: వడగళ్ల వర్షాల వల్ల పాక్షికంగా దెబ్బతిన్న కూరగాయలు, మామిడి, జామ తదితర పంటలను తక్కువ ఖర్చుతో సత్వరం పునరుద్ధరించుకోవడానికి హోమియో మందులు ఉపకరిస్తాయని అమేయ కృషి వికాస కేంద్రం రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి తెలిపారు. 'ఆర్నికా–30'అనే హోమియో ద్రావణాన్ని నీటిలో కలిపి వారానికి మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని, నీటి ద్వారా కూడా పారించుకోవచ్చన్నారు. ఆ తర్వాత ఒకసారి 'కాలెండులా–30'ను వాడితే, వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్న ఉద్యాన తోటలు కోలుకుంటాయని చెప్పారు. మందులు వేర్వేరుగా వాడాలన్నారు. 'లీటరు సీసాలో సగం మేర నీరు పోయాలి. అందులో ఎంపిక చేసుకున్న మందు 2.5 ఎంఎల్ కలిపి మూత బిగించాలి. సీసాను కిందికి, పైకి 50 సార్లు గిలకొట్టినట్టు ఊపాలి. ఆ మిశ్రమాన్ని 20 లీటర్ల థైవాన్ స్ప్రేయర్ ట్యాంక్‌లో పోసుకుని, నీటిని నింపి పిచికారీ చేయాలి'అని వివరించారు. మరిన్ని వివరాలకు అమేయ కృషి వికాస కేంద్రం యూట్యూబ్ చానెల్‌ను చూడవచ్చన్నారు.

'మేడారం గోవిందరాజుల' పూజారి హత్య

బండరాళ్లతో కొట్టి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు


గబ్బగట్ల రవి (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని గోవిందరాజుల గద్దె వద్ద పూజారిగా వ్యవహరిస్తున్న గబ్బగట్ల రవి(45)ని సోమవారంరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో కొట్టి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన దబ్బగట్ల రవి అత్తగారి గ్రామమైన మేడారంలో స్థిరపడ్డారు. వీరిది గోవిందరాజుల గద్దె పూజారుల కుటుంబం. ఈ కుటుంబీకులు వారానికి ఒకరు చొప్పున గద్దె వద్ద పూజలు నిర్వహిస్తుంటారు. తనవంతు వారంలో రవి భక్తులకు బొట్టు పెట్టి పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే రవి హత్య జరగడం మేడారంలో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర రావులు మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా వివరాలు సేకరించారు.

బైక్‌పై తిరిగిన వారే హత్య చేశారా?

గోవిందరాజుల పూజారి రవి హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు రవిని బైక్‌పై ఎక్కించుకుని సోమవారం మేడారంలో తిరిగారని, మద్యం కూడా సేవించారని స్థానికులు చెబుతున్నారు. ఆ ఇద్దరిలో ఓ మహిళ కూడా ఉందని అంటున్నారు. తమ పర్సు పోయిందని, దానిని వెతుకుదామంటూ రవిని బైక్‌పై తీసుకెళ్లారని, ఆ పర్సు విషయమై స్థానికంగా పలువురిని వాకబు కూడా చేశారని చెబుతున్నారు. ఈ క్రమంలో మేడారం రోడ్డు పక్కన ఉన్న ఓ షెడ్డు వద్ద రాత్రి వంట కూడా చేసుకున్నారని, మద్యం తాగించిన అనంతరం రవి తలపై బండరాళ్లతో కొట్టి చంపి ఉంటారని, ఆయన చెప్పులు ఘటనాస్థలానికి దూరంగా పడి ఉండటంతో అంతకుముందు పెనుగులాట కూడా జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులతో పూజారి రవికి ఇంతకుముందే పరిచయముందా అనే విషయంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం రాత్రి స్థానికంగా కరెంట్ సరఫరా లేదని, ఇదే అదనుగా రవిని హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో క్వార్టర్ మందు సీసా, పచ్చడి ప్యాకెట్ పడి ఉన్నాయి.

క్లుప్తంగా

కేంద్రం వివక్షపై మమత ధర్నా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని పట్టించుకోకుండా బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం వివక్షకు నిరసనగా ఈనెల 29, 30 తేదీల్లో రాష్ట్రంలో ధర్నా చేపట్టనున్నట్లు ఆమె ప్రకటించారు. ' కేంద్రం నుంచి ఎలాంటి నిధులు పొందని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది పశ్చిమబెంగాల్ మాత్రమే. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంసహా పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను బీజేపీ సర్కార్ మంజూరు చేయట్లేదు. అందుకు నిరసన తెలుపుతూ కోల్‌కతాలో 29, 30 తేదీల్లో ధర్నాకు దిగుతున్నా' అని మమత మంగళవారం ప్రకటించారు.


ఉక్రెయిన్‌లో జపాన్ ప్రధాని

కీవ్: జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా మంగళవారం హఠాత్తుగా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యా పర్యటించిన ప్రారంభించిన మరుసటి రోజే కిషిదా ఉక్రెయిన్‌కు రావడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కిషిదా భేటీ కానున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. రష్యాలో జిన్‌పింగ్, ఉక్రెయిన్‌లో కిషిదా దౌత్యం ఫలిస్తే యుద్ధం ముగింపు దశకు వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని పరిశీలకులు చెబుతున్నారు. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌కు జపాన్ ఇప్పటిదాకా 7 బిలియన్ డాలర్ల సాయం అందించింది. 2,000 మందికిపైగా ఉక్రెయిన్ శరణార్థులకు తమ దేశంలో ఆశ్రయం కల్పించింది.

2 లక్షల డాలర్ల కానుకలను వెల్లడించని ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అందుకున్న సుమారు 2.50 లక్షల డాలర్ల విలువైన బహుమతుల వివరాలను డొనాల్డ్ ట్రంప్ వెల్లడించలేదు. ఇందులో భారత ప్రధాని మోదీ, రాష్ట్రపతి కోవింద్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు భారతీయ నేతలు అందించిన 47 వేల డాలర్ల విలువైన కానుకలూ ఉన్నాయి. అధికార డెమోక్రాటిక్ పార్టీ కంగ్రెషనల్ కమిటీ రూపొందించిన ఒక నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. ఫారెన్ గిఫ్ట్స్ అండ్ డెకొరేషన్స్ చట్టం ప్రకారం పలు విలువైన కానుకల వివరాలను వెల్లడించటంలో ట్రంప్ యంత్రాంగం విఫలమైందని పేర్కొంది. గోల్ఫ్ క్లబ్బులు, ఎల్ సాల్వడార్ ప్రభుత్వం అందించిన ట్రంప్ నిలువెత్తు భారీ చిత్రపటం వంటివి, ఇంకా నమోదు చేయని 100కు పైగా బహుమతులు ఉన్నట్లు తెలిపింది.

ట్రంప్ అరెస్టయితే వాట్ నెక్ట్స్?



నన్ను అరెస్ట్ చేస్తారంటూ మాజీ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో ఒక్కసారిగా కల్లోలం రేగింది. శృంగార తారతో లైంగిక సంబంధాల్ని పెట్టుకొని 2016 ఏడాదిలో అధ్యక్ష ఎన్నికల సమయంలో ఆమె నోరెత్తకుండా ట్రంప్ భారీగా డబ్బులు ముట్టజెప్పారన్న కేసును న్యూయార్క్ జ్యూరీ గత కొన్ని వారాలుగా రహస్య విచారణ సాగిస్తోంది. కేసు విచారణ తుది దశకు చేరుకోవడంతో ఆయనపై నేరాభియోగాలు నమోదవుతాయనే అనుమానాలు బలపడుతున్నాయి.

ట్రంప్ మీద వచ్చిన ఆరోపణలు క్రిమినల్ కేసుకి దారి తీస్తాయా?
అరెస్టయితే దేశంలో కల్లోలం రేగుతుందా?
మళ్లీ అధ్యక్ష ఎన్నికల బరిలో నిలబడగలరా?
ఇప్పుడివే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ట్రంప్‌పైనున్న కేసు ఏమిటి?



డొనాల్డ్ ట్రంప్ లైంగిక సంబంధాల ఆరోపణలపై కేసు విచారణ జరుగుతోంది. 2006 ఏడాదిలో తనకు 27 ఏళ్ల వయసున్నప్పుడు ట్రంప్ తనతో లైంగిక సంబంధం పెట్టుకున్నారని పోర్న్ సినిమాల్లో నటించే స్టార్మీ డేనియెల్స్ ఒకప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని బయట ఎక్కడా వెల్లడించవద్దని బెదిరించేవారని డేనియెల్స్ ఆరోపించారు. ట్రంప్ నిర్వహించే రియాల్టీ షో 'ది అప్రెంటీస్'లో అవకాశం ఇస్తానని ఆశ కల్పించి తనతో గడిపారని ఆరోపణలు గుప్పించారు. అప్పుడప్పుడు తనకి ఫోన్ చేసి హనీబంచ్ అని ముద్దుగా పిలిచేవారని చెప్పుకొచ్చారు. 2016లో ట్రంప్ అమెరికా అధ్యక్ష బరిలో ఉన్నప్పుడు ఆమె ఈ విషయాలపై నోరెత్తకుండా ఉండేందుకు లక్షా 30 వేల డాలర్లు ముట్టజెప్పారట. ట్రంప్ మాజీ లాయర్ మైఖేల్ కొహెన్ తొలుత ఈ డబ్బులు డేనియెల్స్‌కు చెల్లిస్తే, ఆ తర్వాత ట్రంప్ మైఖేల్‌కి డబ్బులు ఇచ్చారు. మైఖేల్ తనకు డబ్బులు ఇచ్చినట్టుగా డేనియల్స్ చెబుతూ ఉంటే, అవి లాయర్‌కి ఫీజు చెల్లించినట్టుగా ట్రంప్ చెప్పుకుంటున్నారు.

ఏం జరగబోతోంది ?

డబ్బులిచ్చి పోర్న్ స్టార్ నోరుమూయించారన్న ఆరోపణలపై న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ ఆధారాలన్నీ సేకరించినట్టు తెలుస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆయన మాజీ లాయర్ కోహెన్ సాక్ష్యమిచ్చారు. డేనియెల్స్‌కు డబ్బులు ఇచ్చినట్టుగా కోర్టు ఎదుట అంగీకరించారు. మైఖేల్ కోహెన్‌కు లీగల్ అడ్వైజర్‌గా పని చేసిన రాబర్ట్ కోస్టెల్లో ఇన్నాళ్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా జ్యూరీలో మాట్లాడి ఇప్పుడు ఎదురు తిరిగినట్టుగా తెలుస్తోంది. ట్రంప్‌కి అనుకూలంగా సాక్ష్యమిచ్చినట్టుగా సమాచారం. ట్రంప్ కోర్టుకి హాజరు కాకూడదని నిర్ణయించుకోవడంతో విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రాండ్ జ్యూరీ ఏం చెయ్యాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటుంది. ఒక కేసులో నిందితుడిని దోషిగా లేదంటే నిరపరాధిగా తేల్చే అధికారం గ్రాండ్ జ్యూరీకి ఉండదు. కేవలం ఆధారాలు సేకరించి నేరాభియోగాలు మోపగలదు. అయితే మన్‌హటన్ జిల్లా అటార్నీ అల్విన్ బ్రాగ్ తీసుకున్న నిర్ణయమే ఫైనల్. ఆధారాలుంటే నిందితుడ్ని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసుని నమోదు చేస్తారు. అదే జరిగితే తొలిసారి క్రిమినల్ కేసులు ఎదుర్కొన్న మాజీ అధ్యక్షుడు ట్రంప్ అవుతారు. ఈ అభియోగాలు రుజువై ట్రంప్ దోషిగా తేలితే నాలుగేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయొచ్చా?

రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీ పడతానని ప్రకటించిన ట్రంప్ ఇప్పటికే విస్తృత ప్రచారం చేస్తున్నారు. దేశాధ్యక్షుడిగా పోటీ పడే వ్యక్తి నేరచరిత్ర, జైలు జీవితం వంటి అంశాలపై అమెరికా రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావన లేదు. దీంతో జైలు శిక్ష అనుభవిస్తూ అధ్యక్షుడయ్యే అవకాశం అభ్యర్థికి ఉంది. సాంకేతికంగా ఎలాంటి అడ్డంకులు లేకపోయినప్పటికీ ఈ నేరారోపణలు నైతికంగా ట్రంప్‌ను తీవ్రంగా దెబ్బతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రిమినల్ కేసులో ఇరుక్కున్న వ్యక్తి ఓట్లు అడగడం, చర్చా కార్యక్రమంలో పాల్గొనడం వంటివి ప్రజల ఎదుట ఆయన స్థాయిని తగ్గిస్తాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

క్యాపిటల్ దాడుల్ని తలపిస్తాయా?

ట్రంప్ అరెస్టయితే దేశంలో ఆయన అనుచరులు ఎలాంటి పరిస్థితులు సృష్టిస్తారోనన్న ఆందోళనలు ఉన్నాయి. ఇప్పటికే ట్రంప్ తాను అరెస్ట్ అవుతానని, అందరూ నిరసనలకు దిగాలంటూ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. 'బైడెన్ ప్రభుత్వం అశాంతిని రేపుతోంది. దేశాన్నే చంపేస్తోంది. ఇదే తగిన సమయం. మనందరం మేల్కోవాలి. గట్టిగా నిరసనకు దిగాలి' అని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. 2021 జనవరిలో అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక ఎన్నికల్లో అక్రమాల కారణంగానే తాను ఓడిపోయాయని ట్రంప్ భావించడం, ఆయన అనుచరులు అమెరికా క్యాపిటల్ భవనంపై దాడి, హింసాకాండతో దేశం అట్టుడికిపోయింది. ఈసారి ట్రంప్ అనుచరులు న్యూయార్క్ కోర్టుపై దాడులకు తెగబడతారన్న అనుమానాలున్నాయి. మన్‌హటన్ న్యాయవాది బ్రాగ్ న్యూయార్క్ పోలీసులతో మాట్లాడి కోర్టుకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిందిగా రాసిన లేఖ ఒకటి మీడియాకు లభ్యమైంది. కోర్టులు, ఇతర కార్యాలయాలపై ఎవరి కన్ను పడినా, వారిని పూర్తిగా విచారించే ప్రయత్నంలో పోలీసు యంత్రాంగం ఉంది.

ట్రంప్ ఎదుర్కొంటున్న ఇతర కేసులు

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రహస్య పత్రాలను ఫ్లోరిడాలో తన ఎస్టేట్‌కు తీసుకుని వెళ్లారన్న ఆరోపణలపై కేసు విచారణ కొనసాగుతోంది.

అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమిని జీర్ణించుకోలేని ట్రంప్ అనుచరులు 2021 జనవరి 6న అమెరికన్ క్యాపిటల్ భవనంపై దాడి చేసి హింసాకాండ సృష్టించిన కేసు.

2020 అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేలా ట్రంప్, ఆయన అనుచరుల బృందం నడుచుకున్నట్టు నమోదైన కేసు.

సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తరాదిన పెను భూకంపం

ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో తీవ్ర ప్రకంపనలు ● రిక్టర్ స్కేల్‌పై 6.6గా నమోదు



మంగళవారం రాత్రి నోయిడాలో భయంతో వీధుల్లోకి వచ్చిన స్థానిక ప్రజలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ భూప్రకంపనలు సంభవించాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.6గా రికార్డయ్యింది. అఫ్గానిస్తాన్‌లోని హిందూకుష్‌లో భూఉపరితలం నుంచి 180 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పాకిస్తాన్ వాతావరణ శాఖ తెలియజేసింది. రాత్రి 10.20 గంటల సమయంలో భూకంపం సంభవించడంతో జనం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. హరియాణా, పంజాబ్, రాజస్తాన్, కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు తెలియరాలేదు. భూకంపం వల్ల జమ్మూలో కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల సేవలకు అంతరాయం కలిగింది. అఫ్గానిస్తాన్‌లోని ఫైజాబాద్‌కు ఆగ్నేయంగా 133 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడయ్యింది.

పాక్, అఫ్గాన్‌లో భారీ ప్రకంపనలు

ఇస్లామాబాద్: భారత్ పొరుగు దేశాలైన పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లో మంగళవారం రాత్రి బలమైన భూప్రకంపనలు నమోదయ్యాయి. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.8గా రికార్డయ్యింది. పాకిస్తాన్‌లోని లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్, జీలం, షేక్‌పురా, స్వాత్, ముల్తాన్, షాంగ్లా తదితర ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం అందలేదు. పాకిస్తాన్ భూకంప ప్రభావిత దేశమే. దేశంలో 2005లో సంభవించిన భూకంపం వల్ల 74,000 మంది మృతిచెందారు.

ప్రపంచంలో అత్యంత కీలకమైన పార్టీ బీజేపీ

- వాల్‌స్ట్రీట్ జర్నల్



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ అత్యంత ముఖ్యమైన రాజకీయ పార్టీ అని, ప్రఖ్యాత అమెరికన్ మ్యాగజైన్ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక వ్యాసం పేర్కొంది. వాల్టర్ రసెల్ మెడ్ రాసిన ఈ వ్యాసంలో భారత్‌లో అధికార బీజేపీ అమెరికా జాతీయ ప్రయోజనాల దృక్కోణంలో గమనిస్తే అత్యంత ముఖ్యమైనపార్టీగా అభివర్ణించారు. ఇంకా అందులో ఏం రాశారంటే..''2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా గెలిచిన బీజేపీ 2024లో మరోసారి విజయాన్ని దక్కించుకోవడం ఖాయం. జపాన్‌తో సమానమైన ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతోంది. శక్తిమంతమైన చైనాతో సమతుల్యత సాధించడానికి అమెరికా కృషి చేస్తూ ఉంటే, ఎవరి సాయం లేకుండా బీజేపీ తాను కోరుకున్న భవిష్యత్ కోసం చర్యలు తీసుకుంటోంది. బీజేపీ శక్తి ఏమిటో ప్రపంచ దేశాలు చాలా తక్కువగా అర్థం చేసుకున్నాయి. ఎందుకంటే ఆ పార్టీకున్న చరిత్ర, సంస్కృతి భారతీయులు కానివారికి అంతగా తెలీదు. చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ మాదిరిగానే వంద కోట్లకు పైగా జనాభాని పాలించి గ్లోబల్ సూపర్ పవర్‌గా ఎదగాలన్నదే బీజేపీ ధ్యేయం'' అంటూ ఆ వ్యాసం సాగింది.

కోర్టుకు వస్తే చంపేస్తారేమో!: ఇమ్రాన్



లాహోర్: కోర్టుకు వస్తే తనను చంపేసే ప్రమాదం ఉన్నందున, వర్చువల్‌గానే కేసుల విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు మంగళవారం జస్టిస్ బందియాల్‌కు ఇమ్రాన్ లేఖ రాశారు. తనపై నమోదైన కేసులన్నిటినీ మూకుమ్మడిగా విచారించాలన్నారు. 'శనివారం తోషఖానా కేసు విచారణ జరిగిన ఇస్లామాబాద్‌లోని ఫెడరల్ జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లో నాకోసం మృత్యువు పొంచి ఉంది. సుమారు 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు నన్ను చంపేందుకు మాటువేశారు. వారు అక్కడికి ఎలా రాగలిగారు అని ప్రశ్నించారు.

వాహనాలు, దుస్తులు మార్చి.. పోలీసులను ఏమార్చి

నాటకీయ ఫక్కీలో అమృత్‌పాల్ పరారీ ● వెలుగులోకి సీసీ కెమెరా దృశ్యాలు

అమృత్‌సర్/చండీగఢ్: వివాదాస్పద 'వారిస్ పంజాబ్ దే' సంస్థ అధినేత, ఖలిస్తానీ నాయకుడు అమృత్‌పాల్ సింగ్ వాహనాలు, దుస్తులు మారుస్తూ నాటకీయ ఫక్కీలో పోలీసులను ఏమార్చాడు. తన కోసం పంజాబ్‌వ్యాప్తంగా పోలీసుల వేట ముమ్మరంగా కొనసాగుతుండడంతో ఇద్దరు అనుచరులతో కలిసి మోటార్ సైకిల్‌పై గుర్తుతెలియని ప్రాంతానికి పరారయ్యాడు. ఈ మేరకు సీసీ కెమెరా దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న అమృత్‌పాల్ కోసం వేట మొదలయ్యింది. ఆ సమయంలో అతడు జలంధర్‌లో బెంజ్ కారులో అనుచరులతో ఉన్నాడు. పోలీసుల రాకను గుర్తించి ఆ కారు దిగి, బ్రెజా కారులో షాకోట్ కొచ్చాడు. ఓ గురుద్వారాలో దుస్తులు మార్చుకున్నాడు. తర్వాత ఇద్దరు అనుచరులతో కలిసి బైక్‌పై పరారయ్యాడు. గులాబీ రంగు తలపాగా ధరించి ఉన్నాడు. ముఖం స్పష్టంగా కనిపించకుండా ముసుగు వేసుకున్నాడు. సోమవారం బ్రెజా కారులో అమృత్‌పాల్ సింగ్ దుస్తులు లభించాయని పోలీసులు చెప్పారు. అతడు ఇప్పటికే రాష్ట్ర సరిహద్దు దాటేసి ఉంటాడని అనుమానిస్తున్నారు.

డిబ్రూగఢ్ జైలుకు అమృత్‌పాల్ మామ

ఇదిలా ఉండగా, అమృత్‌పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రారంభించిన భారీ ఆపరేషన్ మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆచూకీ మాత్రం ఇంకా కనిపెట్టలేకపోయారు. అమృత్‌పాల్ అనుచరులుగా చెబుతున్న కొందరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 100 మందికిపైగా అరెస్టయినట్లు సమాచారం. అమృత్‌పాల్ మామ హర్‌జీత్‌సింగ్‌తోపాటు పలువురు అనుచరులను మంగళవారం అస్సాంలోని డిబ్రూగఢ్ సెంట్రల్ జైల్‌కు తరలించారు.

జాతీయ భద్రతా చట్టం కింద కేసు

అమృత్‌పాల్‌తో సంబంధాలున్న ఐదుగురిపై పోలీసులు కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద తాజాగా కేసు నమోదు చేశారు. ఈ ఐదుగురికి పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) తోనూ సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అమృత్‌పాల్‌పై ఇదే చట్టం కింద ఇప్పటికే కేసు నమోదయ్యింది. ఈ నెల 18న అతడిపై నాన్-బెయిలబుల్ వారెంటు జారీ చేశారు. పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను పాక్షికంగా పునరుద్ధరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సున్నితమైన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు కొనసాగుతాయన్నారు.

నలుగురి అరెస్టు

అమృత్‌పాల్ సింగ్ పరారయ్యేందుకు సహకరించిన నలుగురు వ్యక్తులు మన్‌ప్రీత్ సింగ్ అలియాస్ మన్నా, గురుదీప్ సింగ్ అలియాస్ దీపా, హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపీ, గుర్‌భేజ్ సింగ్ అలియాస్ భేజాను అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు మంగళవారం చెప్పారు. కారులో పారిపోయేందుకు అమృత్‌పాల్‌కు వారు సహకరించారని తెలిపారు. జలంధర్ జిల్లా నాంగల్ అంబియాన్ గ్రామంలోని గురుద్వారాలో అతడు కొంతసమయం తలదాచుకున్నట్లు విచారణలో తేలిందని వెల్లడించారు. అక్కడే బట్టలు మార్చుకొని బైక్‌లో పరారయ్యాడని పోలీసు అధికారి సుఖ్‌చైన్‌సింగ్ గిల్ పేర్కొన్నారు. వేర్వేరు వేషధారణల్లో ఉన్న అమృత్‌పాల్ ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.



బైక్‌పై పారిపోతున్న అమృత్‌పాల్(వెనక వ్యక్తి)

అది పూర్తిగా నిఘా వైఫల్యమే

అమృత్‌పాల్ పరారీపై పంజాబ్ హైకోర్టు అసంతృప్తి

అమృత్‌పాల్ తప్పించుకోవడంపై పంజాబ్ హరియాణా హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిఘా వైఫల్యమే ఇందుకు కారణమని పోలీసు శాఖకు మొట్టికాయలు వేసింది. వేలాది మంది పోలీసులుండగా అతడు పరారయ్యాడంటే నమ్మలేకపోతున్నామని వ్యాఖ్యానించింది. అమృత్‌పాల్‌పై కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పంజాబ్ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. పోలీసు కస్టడీలో ఉన్న అమృత్‌పాల్‌ను విడుదల చేయాలంటూ 'వారిస్ పంజాబ్ దే'తరఫున లాయర్ ఇమాన్ ఖారా వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై పంజాబ్, హరియాణా హైకోర్టు విచారణ జరిపింది. పోలీసు వ్యూహం నుంచి అమృత్‌పాల్ ఎలా తప్పించుకున్నాడని జస్టిస్ షెకావత్ పంజాబ్ అడ్వొకేట్ జనరల్ వినోద్ ఘాయ్‌ను ప్రశ్నించారు. ఇది నిఘా వైఫల్యమని, ఇలా జరిగిందంటే నమ్మడం కష్టంగా ఉందని ఆయన వ్యాఖ్యానించినట్లు ఒక లాయర్ వెల్లడించారు. అమృత్‌పాల్‌ను పోలీసులు పట్టుకోలేదని అతడు పరారీలో ఉన్నాడని ఏజీ చెప్పారు. అమృత్‌పాల్‌ను పట్టుకునేందుకు పోలీసులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అతడిపై ఎన్ఎస్ఏతో పాటు 6 కేసులు నమోదు చేసినట్లు ఏజీ అన్నారు. అమృత్‌పాల్‌ను, అతడి అనుచరులను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు శనివారం నుంచి పెద్ద ఎత్తున సోదాలు చేపట్టారు. జలంధర్ జిల్లాలో పోలీసుల భారీ ఛేజింగ్ నుంచి అతడు తప్పించుకున్న విషయం తెలిసిందే.

అరెస్టు చేయలేదు

అమృత్‌పాల్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అదుపులోకి తీసుకోవాలని ఆదేశిస్తూ అమృత్‌సర్ జిల్లా మేజిస్ట్రేట్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. అమృత్‌పాల్‌ను అరెస్టు చేయలేదని, బంధించలేదని వెల్లడించారు. ప్రస్తుతం పరారీలోనే ఉన్నాడని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అమృత్‌పాల్‌ను అరెస్టు చేశారంటూ పిటిషన్ చేసిన వాదనను ఖండించారు.

పార్లమెంట్‌లో అదే ప్రతిష్టంభన



పార్లమెంట్ కారిడార్‌లో నిరసన తెలుపుతున్న విపక్షాల సభ్యులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్ నుంచి విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ గడ్డపై భారత ప్రజాస్వామ్యాన్ని కించపర్చారని, క్షమాపణ చెప్పాలని బీజేపీ పట్టుబడుతోంది. దీంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మంగళవారం స్తంభించాయి. లోక్‌సభ మంగళవారం ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలన్నారు. దీంతో స్పీకర్ బిర్లా జోక్యం చేసుకున్నారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. శాంతించాలంటూ సభాపతి స్థానంలో ఉన్న రాజేంద్ర అగర్వాల్ విన్నవించారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. దీంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు రాజేంద్ర ప్రకటించారు. రాహుల్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ సభ్యుల నినాదాలతో రాజ్యసభ దద్దరిల్లింది. ప్రజల ఆకాంక్షలను వమ్ము చేయొద్దని సభ్యులకు రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ హితవు పలికారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెల్లడించారు. ప్రతిష్టంభనకు తెరదించడమే లక్ష్యంగా లోక్‌సభ స్పీకర్ మంగళవారం అఖిలపక్ష భేటీ నిర్వహించారు. సమస్యను పరిష్కరించే విషయంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో అఖిలపక్ష సమావేశం విఫలమైంది.

లోక్‌సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వండి

పలువురు కేంద్ర మంత్రులు లోక్‌సభలో తనపై పూర్తి నిరాధారమైన, అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాటిపై సభలో సమాధానం చెప్పే హక్కు తనకు ఉందని అన్నారు. ఈ మేరకు ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఓ లేఖ రాశారు.

కారిడార్లలో విపక్షాల నిరసన

అదానీ గ్రూప్ నిర్వాకంపై విచారణకు జేపీసీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. వివిధ పార్టీల ఎంపీలు, నాయకులు మంగళవారం పార్లమెంట్ హౌస్ కారిడార్లలో నిరసన చేపట్టారు. జేపీసీ కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. అదానీ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ నోరు విప్పాలంటూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నిరసన తెలిపారు. రూ.లక్ష కోట్ల కుంభకోణంలో భాగస్వామి అయిన అదానీని రక్షించేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. అంతకంటే ముందు విపక్ష నేతలు సమావేశమయ్యారు. జేపీసీ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, జేడీయూ, జేఎంఎం, ఆప్ తదితర పార్టీల నాయకులు ఈ భేటీకి హాజరయ్యారు.

రూ.1.48 లక్షల కోట్ల అనుబంధ పద్దుకు ఆమోదం

న్యూఢిల్లీ: ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.1.48 లక్షల కోట్ల అదనపు నిధుల ఖర్చుకు సంబంధించిన అనుబంధ పద్దుకు మంగళవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. అదానీ షేర్ల వివాదంపై విపక్ష పార్టీల నిరసనల నినాదాల మధ్యే ఈ పద్దుకు సభ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన మొత్తం రూ.2.7 లక్షల కోట్ల అదనపు పద్దును 13వ తేదీనే ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. అదనపు పద్దుకు సంబంధించి రూ.36,325 కోట్లను ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం ఖర్చుచేయనుంది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ సంబంధిత మాజీ సైనికులకు కేంద్రప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.33,718 కోట్ల బకాయిలను ప్రభుత్వం మొత్తం పద్దులో కలిపింది.

రాహుల్.. రాజకీయాల్లో మరో మీర్ జాఫర్: బీజేపీ

న్యూఢిల్లీ: భారతదేశంలో బ్రిటిష్ పాలనకు బాటలు పరిచిన బెంగాల్ సైన్యాధ్యక్షుడు మీర్ జాఫర్ మాదిరిగా రాహుల్ గాంధీ ప్రవర్తిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. 'బెంగాల్ పాలకుడు సిరాజుద్దౌలాను వంచించి బ్రిటిష్ సేనల సాయంతో ప్లాసీ యుద్ధంలో గెలిచి మీర్ జాఫర్.. నవాబు అయ్యాడు. ఇదే తరహాలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ విదేశీ శక్తుల సాయంతో భారత్‌కు 'నవాబు' అవ్వాలని రాహుల్ ఆశపడుతున్నారు. రాహుల్ ప్రస్తుత దేశ రాజకీయాల్లో మరో మీర్ జాఫర్' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఆరోపించారు.



లండన్‌లో దాడికి గురైన భారత హైకమిషన్‌కు సంఘీభావంగా మంగళవారం అక్కడికి చేరుకున్న వందలాది మంది భారతీయ సంతతి పౌరులు

కాన్సులేట్‌పై దాడి ఘటనలో అమెరికా ఆగ్రహం

వాషింగ్టన్: అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్న భారతీయ కాన్సులేట్‌పై ఖలిస్తానీవాదులు దాడికి తెగబడిన ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. 'ఇలాంటి ఘటనలు ఏమాత్రం ఆమోదనీయంకాదు' అని వైట్‌హౌజ్‌లో జాతీయ భద్రతా మండలి సంధానకర్త(వ్యూహాత్మక సంబంధాలు) జాన్ కిర్బీ ఆక్షేపించారు. ఆదివారం తెల్లవారుజామున కాన్సులేట్‌కు ఇద్దరు ఖలిస్తానీ సానుభూతిపరులు నిప్పుపెట్టేందుకు విఫల యత్నం చేసిన సంగతి తెల్సిందే. ఆదివారం మధ్యాహ్నం మళ్లీ అక్కడికి చేరుకున్న ఇంకొందరు ఖలిస్తానీవాదులు ఖలిస్తాన్ జెండాలు పాతి, ఇనుప కడ్డీలతో తలుపు, కిటికీలు బద్దలుకొట్టారు. ఈ దాడి ఘటనలో కాన్సులేట్ సిబ్బందిలో ఒకరికి గాయాలయ్యాయి. 'ఈ ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తాం. భారత కాన్సులేట్‌కు భద్రత, సిబ్బందికి పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తాం' అని కిర్బీ ప్రకటించారు. దాడికి పాల్పడిన వారిని ఉపేక్షించేదిలేదంటూ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలివాన్ ట్వీట్ చేశారు. కాన్సులేట్ ఎదుట నిరసనలు చేస్తున్న ఖలిస్తాన్ వేర్పాటువాదులపై స్థానిక పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని భారతీయ అమెరికన్లు ఆగ్రహం వ్యక్తంచేయడంతో సలివాన్ పైవిధంగా స్పందించారు. పాస్‌పోర్ట్‌లు, వీసాల కోసం కాన్సులేట్‌కు వచ్చిన పౌరులను వేర్పాటువాదులు వేధించారని భారతీయ అమెరికన్లు ఆరోపించారు.

మెహుల్ చోక్సీపై రెడ్‌కార్నర్ నోటీస్ ఎత్తివేత !

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు పెంచిన కాంగ్రెస్



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.13,000 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీపై ఇంటర్‌పోల్ గతంలో జారీచేసిన రెడ్‌కార్నర్ నోటీసును ఇటీవల ఎత్తేసిన విషయం తాజాగా వెలుగులోకి రావడంతో విపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ' విపక్షాలపైకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐను కేంద్రం ఉసిగొల్పుతూ తమ మిత్రుడిని వదిలేసింది. ఇలాంటి వ్యక్తులను పరిరక్షించే బీజేపీ పెద్దలు దేశభక్తి గురించి మాట్లాడటం.. నిజంగా ఒక పెద్ద జోక్' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. కాగా, ఇంటర్‌పోల్ తన డాటాబేస్ నుంచి చోక్సీ పేరును తొలగించడాన్ని సీబీఐ తప్పుబట్టింది. ఆయన పేరును మళ్లీ చేర్చి రెడ్‌కార్నర్ నోటీసును పునరుద్ధరించాలని ఇంటర్‌పోల్‌ను కోరింది. పేరు తొలగించాలని పలుమార్లు చోక్సీ కోరడంతో ఇంటర్‌పోల్‌లోని స్వతంత్ర సీసీఎఫ్ విభాగం ఆ పనిచేసింది.

హిందుత్వపై కన్నడ నటుడు చేతన్ వివాదాస్పద ట్వీట్



బెంగళూరు: హిందుత్వను గురించి వివాదాస్పద ట్వీట్ చేసిన కన్నడ నటుడు చేతన్ అహింసను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'అబద్ధాలపై హిందుత్వ నిర్మితమైంది. సత్యమే దానిని ఓడిస్తుంది. సమానత్వమే సత్యం'అంటూ ఈ నెల 20న ఆయన ఒక ట్వీట్ చేశారు. దీనిపై శివకుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు చేతన్‌పై ఐపీసీ సెక్షన్లు 293ఏ(మతాన్ని, మత విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా కించపరచడం), 505(2) విద్వేషాలను పెంచేలా అటువంటి వాటిని ప్రచారం చేయడం)కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు బెంగళూరులోని శేషాద్రిపురం పోలీసులు తెలిపారు. అతడికి మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారన్నారు. ప్రభుత్వ బడుల్లో హిజాబ్ నిషేధంపై కేసును విచారిస్తున్న జడ్జిపై అనుచిత ట్వీట్ చేసినందుకు గాను గత ఏడాది ఫిబ్రవరిలో చేతన్‌ను అరెస్ట్ చేశారు.

సాక్షి
హైదరాబాద్

బుధవారం । 22 । మార్చి । 2023

ఇంటర్ పేపర్-2 పరీక్షకు 6,154 మంది గైర్హాజరు

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్-2 పరీక్షల్లో 6,154 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 82,656 మందికి 3,411, రంగారెడ్డి జిల్లాలో 58,041 మందికి గాను 1,633, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 53,478కి గాను 1,110 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సిటీ కాలేజీలో అటవీ దినోత్సవం

దూద్‌బౌలి: ప్రభుత్వ సిటీ కళాశాలలో మంగళవారం వృక్ష శాస్త్ర విభాగం, గ్రీన్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ జగదీష్ బత్తుల ముఖ్య అతిథిగా హాజరై అటవీ ప్రాముఖ్యత, అటవీ సాకర్యాలు, పరిరక్షణ, ఆహారం, ఔషధాలు, పర్యావరణ పరిరక్షణపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్, కె.ఎల్.వి.వరప్రసాద్, నర్మద, నాగరాజు, యాదయ్య, విప్లవ్‌దత్ శుక్లా, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'ఎస్కీ'లో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో గురువారం నుంచి అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు తెలిపారు. మూడు రోజులపాటు కొనసాగే సదస్సును తెలంగాణ రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

స్వప్నలోక్‌లోని కొన్ని కార్యాలయాల తరలింపు



స్వప్నలోక్ కాంప్లెక్స్

రాంగోపాల్‌పేట్: అగ్ని ప్రమాద ఘటనలో ఆరుగురిని బలిగొన్న సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. భవనంలోని 4వ, 5వ, 6వ అంతస్తుల్లోని కొన్ని కార్యాలయాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. కాంప్లెక్స్‌లో సుమారు 200కు పైగా కార్యాలయాలు ఉన్నాయి. 17వ తేదీ నుంచి ఇందులో జరిగే కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. రోజుల తరబడి కార్యాలయాలు నడవకపోతే ఇబ్బందులు తప్పవనే ఉద్దేశంతో కొంత మంది వీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసుల అనుమతులు తీసుకుని కంప్యూటర్లు, తదితర ముఖ్యమైన ఫైళ్లను తీసుకుని వెళుతున్నారు. స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న సూర్యకిరణ్ కాంప్లెక్స్ అధికారులు మూసివేయించారు. ఇందులోనూ వివిధ రకాల వ్యాపార సంస్థలు, కార్యాలయాలు, దుస్తుల దుకాణాలు ఉన్నాయి.

రూ.10 కోట్లతో 4 చెరువుల అభివృద్ధి

23 అంశాలకు బల్దియా స్టాండింగ్ కమిటీ ఆమోదం


సాక్షి, సిటీబ్యూరో: దాదాపు రూ.10 కోట్లతో ముల్లార్ లేక్, ఈర్ల చెరువు, ఎల్లమ్మ చెరువు, భగీరథమ్మ చెరువుల డ్రైనేజీ మళ్లింపు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు మంగళవారం జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. వీటితోపాటు సీఎస్సార్ కింద కొన్ని ప్రాంతాల్లో సుందరీకరణ పనులు ప్రైవేటు సంస్థలకిచ్చేందుకు, ఆయా ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు పనుల కోసం భూసేకరణ, తదితరమైన పనులకు కమిటీ ఆమోదం తెలిపింది. ఒక టేబుల్ ఎజెండాతో సహా మొత్తం 23 అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది.

ఈడీ కార్యాలయం వద్ద అలర్ట్

సాక్షి, సిటీబ్యూరో: లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ ఈడీ అధికారుల పిలుపులు, విచారణ తదితర పరిణామాల నేపథ్యంలో నగర పోలీసు విభాగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోనల్ కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. దీని వద్ద నిరసన ప్రదర్శనలు జరిగే ఆస్కారం ఉందనే సమాచారంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ కార్యాలయం గేటు వద్ద బారికేడ్లు, భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు పెద్ద సంఖ్యలో సిబ్బందిని మోహరించారు. ఈ భవనంలోనే టూరిజం శాఖ కార్యాలయంతో పాటు మరికొన్ని ప్రభుత్వ సంస్థలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాకపోకలు సాగించే వారిని, ప్రధాన రహదారిపై వచ్చివెళ్లే వారిని తనిఖీలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎవరూ గుమిగూడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌ను పెంచండి

వరుస పండగల నేపథ్యంలో కొత్వాల్ ఆదేశాలు



సాక్షి, సిటీబ్యూరో: రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి... ఈ మూడు పండగలూ వరుసగా వచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నగరంలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని కొత్వాల్ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయన మంగళవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆపై స్థాయి అధికారులతో పాటు బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ కార్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రార్థన ప్రాంతాల వద్ద సాధారణ ప్రజలు, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రద్దీని నియంత్రించాలని కొత్వాల్ ఆదేశించారు. నిఘా ముమ్మరం చేయడంతో పాటు ఇతర విభాగాలతో కలిసి ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. కీలక ఘట్టం నేపథ్యంలో పని వేళలకు అతీతంగా పని చేయాలని ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోషల్‌మీడియాలో వదంతులపై కన్నేసి ఉంచాలని, బాధ్యతపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అసాంఘిక శక్తులతో పాటు కమ్యూనల్ రౌడీషీటర్లను బైండోవర్ చేయాలని సూచించారు. సిబ్బంది ఆరోగ్యం అంశాన్నీ సమీక్షించిన ఆనంద్ పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త సీపీలు విశ్వప్రసాద్, గజరావ్ భూపాల్, పరిమళ నూతన్ పాల్గొన్నారు.



అమీర్‌పేట్‌లో ఉగాది పచ్చడి సామగ్రి కొనుగోళ్లు





సికింద్రాబాద్ మోండా మార్కెట్ వద్ద..



ఎస్సార్ నగర్‌లో..

ఉగాది వేళ 'కొత్త' కళ

తెలుగు లోగిళ్లు 'కొత్త' వెలుగులతో తళుకులీనేందుకు సిద్ధమయ్యాయి. ఉగాది పర్వదినానికి స్వాగతం పలకనున్నాయి. ఇంటింటా శ్రీ శోభకృత్ నామ సంవత్సర వేడుకలు షడ్రుచుల సమ్మేళనంతో జరగనున్నాయి. బుధవారం తెలుగు సంవత్సరాది.. ఉగాది పండగను పురస్కరించుకుని మంగళవారం మామిడి ఆకులు, కాయలు, వేపపూత, కొత్త కుండలు, కొబ్బరి కాయలు, పూలూ పండ్లు తదితర పూజా సామగ్రి కొనుగోళ్లతో నగర మార్కెట్లు నూతన కళను సంతరించుకున్నాయి. - సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్లు

నయాగా పురానాపూల్!

- నగరానికి ఎంట్రీ పాయింట్‌గా ఈ జంక్షన్
- అయిదు రోడ్ల కూడలి కావడంతో ఇబ్బందులు
- సాధారణ ప్రజలతో పాటు జడ్జీల రాకపోకలు
- అభివృద్ధి చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర కమిషనరేట్‌లోని ఎంట్రీ పాయింట్‌గా ఉన్న పురానాపూల్ జంక్షన్‌పై సిటీ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. సాధారణ వాహన చోదకులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు సైతం ప్రయాణించే ఈ మార్గం ఇరుకుగా ఉండటంతో రద్దీ వేళల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని అధ్యయనం చేసిన ట్రాఫిక్ విభాగం అధికారులు పలు కీలక మార్పుచేర్పులు చేసి విస్తరిస్తున్నారు. అక్కడి పాత వంతెనపై ఉన్న మండీని సమీపంలోని మరో ప్రాంతానికి తరలిస్తేనే పూర్తి ఫలితాలు వచ్చే ఆస్కారం ఉంది.

జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభంతో..

నగరంలో ఉన్న అయిదు రోడ్ల కూడళ్లలో పురానాపూల్ జంక్షన్ ఒకటి. ఆరాంఘర్ వైపు నుంచి సిటీలోకి వచ్చే వాహనాలు, ఇక్కడ నుంచి బయటకు వెళ్లే వాటితో పాటు జియాగూడ, కార్వాన్, ఇసామియా బజార్ వైపు వెళ్లే వాహనాలు దీని మీదుగానే ప్రయాణిస్తాయి. ఇది హైకోర్టుకు సమీపంలో ఉండటంతో సాధారణ వాహన చోదకులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో న్యాయమూర్తులు ప్రయాణిస్తుంటారు. కొన్నాళ్ల క్రితం వరకు ఇబ్బందులు ఎక్కువగా లేకపోయినా... జూపార్క్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ నిర్మాణంతో ఇవి వచ్చిపడ్డాయి. ఈ వంతెన కారణంగా సిగ్నల్ లేకుండా వాహనాలు దూసుకువస్తుండటంతో ఈ జంక్షన్‌జాం అవుతోంది.



జంక్షన్‌ను పరిశీలిస్తున్న సుధీర్‌బాబు

సమన్వయమే పెద్ద సవాల్...

అత్యంత కీలకమైన జంక్షన్లలో ఒకటైన పురానాపూల్ ప్రాంతం భౌగోళికంగా వివిధ జోన్లలో విస్తరించి ఉంటుంది. జీహెచ్ఎంసీ విషయానికి వస్తే ఇద్దరు జోనల్ కమిషనర్లు, ముగ్గురు డిప్యూటీ కమిషనర్లతో పాటు కార్వాన్, గోషామహల్ ఎమ్మెల్యేల పర్యవేక్షణలో ఉండే ప్రాంతమిది. దీంతో సమన్వయ లేమి ఎక్కువగా ఉండి చాన్నాళ్లుగా ఈ జంక్షన్ సమస్యలు కొలిక్కి రావట్లేదు. పురానాపూల్ సమస్యను పరిష్కరించడానికి రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతంలో సమగ్ర అధ్యయనం నిర్వహించారు. మూసీపై ఉన్న వంతెనకు కార్వాన్-జియాగూడ మార్గం వైపు కొన్ని మార్పులు చేయడం ద్వారా వాహనచోదకులకు ఉపయుక్తంగా మార్చవచ్చని గుర్తించారు.

రోడ్డును మింగే అడ్డంకులను తొలగించి..

ఈ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉండే అనేక అడ్డంకులను గుర్తించారు. ప్రధానంగా మూతపడిన అన్నపూర్ణ క్యాంటీన్, పబ్లిక్ టాయిలెట్‌తో పాటు పోలీస్ ఔట్ పోస్టు, కొన్ని దుకాణాల కారణంగా ఇబ్బందులు పెరుగుతున్నాయని గుర్తించారు. వీటిని తొలగించడంతో రోడ్డు విశాలంగా మారడంతో పాటు ఫ్రీ లెఫ్ట్‌కు ఉపయుక్తమని తేల్చారు. స్థానిక అధికారులు, నాయకులను సంప్రదించడం ద్వారా ఈ పనులు పూర్తి చేశారు. జల మండలి అధికారులు సైతం నీటి సరఫరా పైపులు ఉండే ప్రాంతానికి మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో చిన్న చిన్న ర్యాంపులు, కొద్దిపాటి రోడ్డు నిర్మాణంతో ఈ జంక్షన్ విశాలంగా మారనుంది. ఈ మేరకు సీఆర్ఎంపీ అధికారులను ప్రతిపాదనలు పంపారు.

పాత వంతెనపై మండీ ఉండటంతో...

పురానాపూల్ ప్రాంతంలో మూసీపై రెండు వంతెనలు ఉంటాయి. పాత వంతెన సింగిల్ రోడ్ బ్రిడ్జిగా, ఆ తర్వాత నిర్మించింది డబుల్ రోడ్ బ్రిడ్జిగా ఉన్నాయి. ప్రస్తుతం డబుల్ రోడ్ బ్రిడ్జి రాకపోకలకు ఉపయోగపడుతోంది. సింగిల్ రోడ్ బ్రిడ్జిపై ఏళ్లుగా కూరగాయల మండీ కొనసాగుతోంది. దీంతో ఈ వంతెన పూర్తి స్థాయిలో వాహనచోదకులకు ఉపయోగపడట్లేదు. ఈ వంతెనకు జియాగూడ మార్గంలో మూసీ వెంబడి 100 అడుగుల రోడ్డు అభివృద్ధి చేశారు. మండీని ఈ మార్గంలోకి మార్చి, పాత వంతెనను ఉపయోగంలోకి తీసుకువస్తే వాహనచోదకులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందనే వాదన ఉంది. ఈ అంశంపై స్థానిక వ్యాపారులతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయం ఆధారంగా ముందుకు వెళ్లాలని ట్రాఫిక్ విభాగం అధికారులు నిర్ణయించారు.



ఫుట్‌పాత్‌ను ఢీకొట్టిన పోలీసు డీసీఎం వ్యాన్

శభాష్ పోలీస్!

16 మంది విద్యార్థులను కాపాడిన ఎస్ఐ

బంజారాహిల్స్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన ఏబీవీపీ విద్యార్థులను అరెస్ట్ చేసి తీసుకెళ్లే క్రమంలో వ్యాన్ డ్రైవర్ హోంగార్డుకు మూర్ఛ రావడంతో ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన బంజారాహిల్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి 16 మంది విద్యార్థులకు ముప్పు తప్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం మధ్యాహ్నం ఏబీవీపీ కార్యకర్తలు ప్రగతి భవన్‌కు వచ్చారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వీరిని అరెస్ట్ చేసి డీసీఎంలోకి ఎక్కించి బందోబస్తులో బంజారాహిల్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిని పంపించారు. డీసీఎం డ్రైవర్ రమేష్ ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై నుంచి వెళ్తుండగా ఫిట్స్ రావడంతో స్టీరింగ్ వదిలేశాడు. దీంతో వ్యాన్ డివైడర్‌ను ఢీకొడుతూ వెళ్లింది. వీరందరిని తీసుకొని వెళ్తున్న కరుణాకర్‌రెడ్డి వెంటనే డ్రైవర్ సీటులోకి వెళ్లి రమేష్‌ను పక్కకు జరిపి వ్యాన్‌ను ఫుట్‌పాత్‌కు ఢీకొట్టేలా చేశాడు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. హోంగార్డు రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. వ్యాన్‌ను పక్కకు జరిపే క్రమంలో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డికి, మరో కానిస్టేబుల్ సాయికుమార్‌కు గాయాలయ్యాయి. వీరిద్దరిని కూడా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బర్త్, డెత్ సర్టిఫికెట్లలో అక్రమాలు

కమిషనర్‌కు చేరిన విజిలెన్స్ నివేదిక

సాక్షి, సిటీబ్యూరో: బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో అక్రమాలపై విచారణ జరిపిన జీహెచ్ఎంసీ విజిలెన్స్ విభాగం మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌కు నివేదిక అందజేసింది. 'నాన్ అవైలబిలిటీ' కింద బర్త్, డెత్ సర్టిఫికెట్లు అవసరమైన వారు ఆర్డీఓ ప్రొసీడింగ్స్ ద్వారా సర్టిఫికెట్లను పొందాల్సి ఉన్నప్పటికీ, జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ సర్వీసును దుర్వినియోగం చేస్తూ సంబంధిత డాక్యుమెంట్ల బదులు ఖాళీ పేపర్లు, చిత్తు కాగితాలు సైతం అప్‌లోడ్ చేయడం ద్వారా 31 వేలకుపైగా బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ కావడం తెలిసిందే. వీటిపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం ఐటీ, సాఫ్ట్‌వేర్ లోపాలతోనే అక్రమాలు జరిగినట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అక్రమాలకు పాత్రదారులెవరు? అనే అంశాలపై సంబంధిత ఆరోగ్య విభాగం అడిషనల్ కమిషనర్ శ్రుతిఓజా సైతం విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. ప్రాథమిక విచారణ మేరకు ఇప్పటి వరకు జరిగిన అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో కూడా విజిలెన్స్ విభాగం తన నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం. మీ సేవ కేంద్రాల ద్వారా అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు కాకుండా ఏవి పడితే అవి అప్‌లోడ్ చేసినా స్వీకరించడం.. బర్త్, డెత్ సర్టిఫికెట్లు కూడా జారీ కావడం తెలిసిందే.

సంతోషంగా స్నాక్స్!

- హ్యాపీ మూడ్‌లో చిరుతిళ్లు అధికం
- దేశంలోనే రెండో స్థానంలో నగరం
- ఓ అధ్యయనంలో వెల్లడి
- చిరుతిళ్లు అనారోగ్యకారకం: వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: 'చుట్టూ చేరి కన్ఫ్యూజ్ చేయద్దు కన్ఫ్యూజన్‌లో ఎక్కువగా కొట్టేస్తా' అంటాడో సినిమాలో హీరో. చుట్టూ హ్యాపీనెస్ ఉండాలి.. ఉంటే ఎక్కువ తినేస్తాం అంటున్నారు నగరవాసులు. సిటిజనుల చిరుతిళ్ల సరదాకు హ్యాపీ మూడ్ ఒకింత ఊపునిస్తున్నట్టు ఓ అధ్యయనం వెల్లడించింది. అలా హ్యాపీ-టేస్ట్‌లో మునిగి తేలుతున్న సిటిజనుల సంఖ్యలో దేశంలోనే మన హైదరాబాద్ రెండో స్థానంలో ఉందని కూడా తేల్చింది. మానసిక స్థితికి, తినే తిండికి మధ్య బలమైన సంబంధం ఉంది. నిజానికి ఒత్తిడి ఆకాశాన్నంటుతున్నప్పుడు, మానసిక స్థితి క్షీణిస్తున్నప్పుడు, ఆలోచనలు చిరుతిండి వైపు మళ్లుతాయనేది ఎప్పటి నుంచో మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నదే. సంతోషంగా ఉన్నప్పుడు కూడా చిరుతిండి అధికం అవుతున్నట్టు తాజా నివేదిక ఒకటి వెల్లడించింది.

అభి'రుచుల'తో భావోద్వేగాలు..

అంతర్జాతీయ సంతోష దినోత్సవం (మార్చి 20) సందర్భంగా 'మూడ్ అప్‌లిఫ్టర్' పేరిట గోద్రెజ్ యమ్మీజ్ నిర్వహించిన ది ఇండియా స్నాకింగ్ రిపోర్ట్ ప్రకారం.. 72 శాతం భారతీయులు తమ అభిరుచులను భావోద్వేగాలతో అనుసంధానిస్తున్నారు. తాము సంతోషంగా ఉన్నప్పుడు ఎక్కువ స్నాక్స్ తీసుకుంటున్నారు. చిరుతిళ్లు మానసిక ఆనందపు స్థాయిని మరింత పెంచే సాధనంగా అత్యధికులు భావిస్తున్నారు. చిరుతిండిని వారి మానసిక స్థితితో అనుసంధానిస్తున్న వారిలో 70 శాతం స్నాక్స్ తిన్న తర్వాత మరింత సంతృప్తిగా, ఉత్సాహంగా ఉన్నారని నివేదిక స్పష్టం చేసింది.



తూర్పు భారతంలో ఎక్కువ..

ప్రాంతాలవారీగా పోల్చినప్పుడు, తూర్పు భారతంలో 75 శాతం మంది సంతోషంగా ఉన్నప్పుడు ఎక్కువ అల్పాహారం తీసుకుంటారని నివేదిక తేల్చింది. ఇక పశ్చిమ, ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాల్లో ఇది 72, 67, 74 శాతాలుగా లెక్కగట్టారు. నగరాల వారీగా చూసినప్పుడు ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా ప్రజలు సంతోషాన్ని బట్టి ఎక్కువ స్నాక్స్ తినేస్తారు. ఈ విషయంలో ఢిల్లీ 81 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, చెన్నై, హైదరాబాద్‌లు ఒక్కొక్కటి 77 శాతం, కోల్‌కతా 75 శాతంతో టాప్‌లో ఉన్నాయి, ఈ నగరాల్లోని స్థానికులు స్నాక్స్‌ను మూడ్ అప్‌లిఫ్టర్‌లుగా భావిస్తున్నారని నివేదిక వెల్లడించింది. అదే క్రమంలో ముంబై సగటు 68 శాతంగా అహ్మదాబాద్ 67 శాతం. దీని తర్వాత పుణె, బెంగళూరు 66, లక్నో 62, జైపూర్ 61 శాతాల చొప్పున ఉన్నాయి. నివేదికలో మరో విశేషం.. సంతోషంగా ఉన్నప్పుడు ఎక్కువ స్నాక్స్ తీసుకునేవారిలో మహిళలే కొంచెం అధికంగా ఉన్నారు. ఫుడ్- మూడ్ కనెక్షన్‌కు సంబంధించి 74 శాతం మహిళలు 70 శాతం పురుషులు ఉన్నారు.

సోషల్ మీడియా తోడుగా...

సంతోషాన్ని పంచుకోవడానికి తాము ప్రాధాన్యమిచ్చే వాటిలో సోషల్ మీడియా తొలి స్థానంలో ఉందని ఆధునికులు అంటున్నారు. యూగోవ్ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ముఖ్యంగా స్నాప్ చాట్ ను తాము హ్యాపీ నెస్ షేరింగ్ వేదికగా ఎక్కువగా వినియోగిస్తామని 87 శాతం నెటిజనులు వెల్లడించారు.

అధికమైతే అనారోగ్యమే..

చిరుతిళ్లు అధికంగా తినడం అనారోగ్యకారకంగా మారుతుందని నగరానికి చెందిన ఫిజిషియన్ డా.రమేష్ చెప్పారు. సంతోషంగా లేదా కొంత ఒత్తిడిలో ఉన్నప్పుడు స్నాక్స్ తీసుకునే క్రమంలో పరిమితి తప్పే అవకాశాలు హెచ్చుగా ఉన్నాయని తద్వారా ఊబకాయం సహా పలు రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

జవహర్‌నగర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. తహసీల్దార్ అనిత ఆదేశాల మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్–63, 370, 371లో ప్రభుత్వ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- ప్రపంచ నీటి దినోత్సవంలో జలమండలి ఎండీ దానకిశోర్
- నగరంలో 99.16 శాతం మందికి నీటి సరఫరా
- వంద శాతం మురుగు నీటిశుద్ధి నగరంగా హైదరాబాద్


సదస్సును ప్రారంభిస్తున్న ఎండీ దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్తులో నీటి సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే పొదుపుగా నీటి వాడకంతో పాటు శుద్ధి చేసిన నీరు పునర్వినియోగం చేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. నగరంలోని జలమండలి ప్రధాన కార్యాలయంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా 'నీరు, పారిశుద్ధ్యం–సంక్షోభాన్ని పరిష్కరించడం'అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో 99.16 శాతం మంది ప్రజలు జలమండలి సరఫరా చేస్తున్న నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ జులై నాటికి దేశంలోనే వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేస్తున్న తొలి నగరంగా హైదరాబాద్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే జలమండలికి వాటర్ డైజెస్ట్ మ్యాగజైన్ ప్రభుత్వ విభాగంలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు లభించిందని గుర్తు చేశారు. దేశంలోని ఏ వాటర్ బోర్డు చేయని విధంగా..జలమండలి రోజూ 12 వేల నీటి శాంపిళ్లను పరీక్షిస్తుందని వివరించారు. ఈ పరీక్షలు కూడా వినియోగదారుల సమక్షంలో జరగడం విశేషమని తెలిపారు.

సుంకిశాల పూర్తయితే 40 ఏళ్ల వరకు ఢోకా ఉండదు

సుంకిశాల ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ జనాభా మూడింతలు పెరిగినా... రానున్న 40 ఏళ్ల వరకు తాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని దానకిశోర్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ సత్యనారాయణ, ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్–1 అజ్మీరా కృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్–2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఓఎస్డీ సత్యనారాయణ, బ్రహ్మకుమారీలు అంజలి దేవి, దీదీ శోభాదేవి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, ఎన్జీవోల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీటి విలువపై అవగాహన కార్యక్రమాలు


వాహనాలను ప్రారంభిస్తున్న జలమండలి ఈడీ సత్యనారాయణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని ప్రజలకు నీటి విలువతో పాటు అవగాహన కల్పించేందుకు జలమండలి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. నీటి వృథాను అరికట్టడంపై పది రోజుల పాటు అవగాహన కల్పించేందుకు ఎన్జీవోలను సైతం భాగస్వాములు చేస్తోంది. నగర వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు రెండు వాహనాలు సైతం ఏర్పాటు చేసింది. ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీటికి సంబంధించిన కరపత్రాలు బోర్డు డైరెక్టర్లతో కలిసి ఎండీ దానకిషోర్ ఆవిష్కరించగా, ప్రచార వాహనాలను ఈడీ సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు.

అగ్నిప్రమాద మృతులకు 'ఆమ్ ఆద్మీ' పార్టీ నివాళి



లిబర్టీ: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసువులు బాసిన వారికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంజలి ఘటించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం లిబర్టీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆరుగురు మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ, ఇటీవల స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు యువకులు, నలుగురు యువతులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు 50 లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాకేష్‌సింగ్, రాముగౌడ్, అఫ్సనా, డాక్టర్ హరిచరణ్, సతీష్, హర్ష, రేష్మ, ఫాతిమా, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తగా ఉండటమే పెద్ద గౌరవం

- పదవులు కొన్నే ఉంటాయి.. అందరికీ రావు
- పార్టీ కోసం పని చేస్తే తగిన గుర్తింపు వస్తుంది
- బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశంలో మంత్రి తలసాని


బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: పార్టీ కార్యకర్తగా ఉండటమే పెద్ద గౌరవమని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సాధించిన అభివృద్ధి కార్యక్రమాలతో.. గులాబీ జెండాతో కాలర్ ఎగరేయొచ్చని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదవుల కోసం అందరూ ఆశపడ్డా అందరికీ దక్కవని, లిమిటెడ్‌గానే ఉంటాయని స్పష్టం చేశారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు పదవులు వాటంతట అవే వస్తాయంటూ, అవి రాలేదని డీలా పడవద్దన్నారు.

కేంద్రం కక్షసాధింపు..

గిట్టని పార్టీలపై కక్ష సాధింపులు జరుగుతున్నాయని, తెల్లారింది మొదలు ఎవరిని అరెస్టు చేద్దామా అనే ఆలోచనలు తప్ప కేంద్రంలోని బీజేపీ సాధించిందేమీ లేదని తలసాని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్లు లీకయితే కాంగ్రెస్, బీజేపీలు రాద్ధాంతం చేస్తున్నాయని.. ఉద్యోగాలు ఇచ్చేదే మేమైనప్పుడు లీకేజీలో మా హస్తమెలా ఉంటుందో కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఏప్రిల్ 14న జరగనున్న అంబేడ్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చార్‌ధామ్ యాత్ర పేరిట సైబర్ వల

- నకిలీ వెబ్‌సైట్ సృష్టించిన నేరస్తులు
- 10 రోజుల టూర్ ప్యాకేజీ పేరిట చీటింగ్
- పూజారితో సహా 27 మంది యాత్రికులకు రూ.8 లక్షల కుచ్చుటోపీ



సాక్షి, సిటీబ్యూరో: పూజారితో సహా 27 మంది చార్‌ధామ్ యాత్రికులు సైబర్ వలలో చిక్కుకున్నారు. నకిలీ వెబ్‌సైట్ సృష్టించి..10 రోజుల పాటు యాత్రకు తీసుకెళ్తామని నమ్మించి రూ.8 లక్షలు కొట్టేశారు సైబర్ నేరస్తులు. అదనపు సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు రాచకొండ సైబర్ క్రైమ్స్‌లో ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

- ఎల్బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం పూజారి పి.శివశంకర్ శాస్త్రి గత నెలలో చార్‌ధామ్ యాత్రకు వెళ్లేందుకు అవసరమైన టూర్ ప్యాకేజీ కోసం గూగుల్‌లో శోధించాడు. దీంతో అతనికి ఓ వెబ్ లింక్ కనిపించింది. అది సైబర్ నేరస్తులు సృష్టించిన నకిలీ లింక్. బాధితుడు విషయం తెలియక..దాన్ని క్లిక్ చేసి అడిగిన వివరాలన్నీ నమోదు చేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి టూర్ ఆర్గనైజర్ నుంచి అతనికి ఫోన్ వచ్చింది.
- ఆర్గనైజర్ల లాగా శివశంకర్‌ను నమ్మించిన నేరస్తులు..యాత్రకు వెళ్లే 27 మంది వివరాలను సేకరించారు. 10 రోజుల ప్యాకేజీ ఉంటుందని నమ్మించి, ఒక్కొక్కరికి రూ.18 వేలు ఖర్చవుతుందని తెలిపారు. టూర్‌లో భాగంగా స్థానికంగా ఏసీ బస్సు ఉంటుందని, బ్రేక్‌ఫాస్ట్, రాత్రి భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. విమాన టికెట్లకు అదనపు వ్యయం అవుతుందని తెలిపారు. టూర్ ప్యాకేజీ సొమ్మును డిపాజిట్ చేయాలని బ్యాంకు ఖాతా నంబర్లను సూచించారు. దీంతో శివశంకర్ మిగిలిన యాత్రికుల నుంచి కూడా సొమ్ము వసూలు చేసి.. నేరస్తులు సూచించిన బ్యాంకు ఖాతా, పలు యూపీఐ అకౌంట్లలో రూ.7.92 లక్షలు జమ చేశాడు.
- మరుసటి రోజు మరోసారి ఫోన్ చేసిన నేరస్తులు.. చెల్లించిన సొమ్ము సరిపోదని, అదనంగా ఒక్కో యాత్రికుడు రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.4.05 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చి..మిగిలిన యాత్రికులకు ఈ విషయం వివరించగా.. వెంటనే వారు చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చేయాలని కోరారు. ఇదే విషయాన్ని నేరస్తులకు తెలిపేందుకు పూజారి శివశంకర్ ప్రయత్నించగా.. వారు ఫోన్లను స్విచాఫ్ చేసేశారు. దీంతో రాచకొండ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఐపీసీ 406, 419, 420, ఐటీ యాక్ట్ సెక్షన్ 66 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మాకు న్యాయం చేయండి

- హత్య ఘటనలో నిహారిక కుటుంబ సభ్యుల హస్తం ఉంది
- నవీన్ కుటుంబ సభ్యుల ఆరోపణ.. ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు ధర్నా


ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బీటెక్ విద్యార్థి నవీన్ హత్య వెనుక హరిహర కృష్ణ స్నేహితురాలు నిహారిక కుటుంబ సభ్యుల హస్తం ఉందని, ఈ విషయంలో మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నవీన్ కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈమేరకు తమకు న్యాయం జరగడం లేదంటూ నవీన్ తండ్రి శంకరయ్య, తల్లి బుజ్జి, మామ శ్రీను ఇతర గిరిజన సంఘాల నాయకులు మంగళవారం ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవీన్ హత్య కేసులో నిందితురాలిగా ఉన్న నిహారికకు ఇంత త్వరగా బెయిల్ ఎలా వచ్చింది..? నేరానికి పాల్పడినా బెయిల్ మంజూరు చేయడం ఆశ్చర్యంగా ఉందని వారు పేర్కొన్నారు. నెల రోజుల్లో చార్జీషీటు దాఖలు చేస్తామని చెప్పినా..ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. నిహారికను అరెస్టు చేయాలని, హరిహర కృష్ణను వెంటనే ఉరితీసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణ హత్య కేసులో నిహారికకు బెయిల్ రావడం ఏంటని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ హత్య వెనుక నిహారిక తండ్రి, అతని బావ ఉన్నాడని, వారిని కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ నవీన్ కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయం వద్ద నవీన్ తల్లి బుజ్జి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి


కృష్ణకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: జి.పి ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ గాయకుడు జి.శ్రీనివాసనాయకుడు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు పాల్గొని పలు గీతాలను మధురంగా ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమంలో ప్రముఖ గాయకులు కృష్ణకుమార్‌కు ఆత్మీయసత్కారం చేశారు. ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాధరావు, కళాభిమాని కట్టా రఘువీర్‌గౌడ్, నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాసనాయుడు, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మధురానగర్‌లో పంచాంగ శ్రవణం

వెంగళరావునగర్: ఉగాది సందర్భంగా మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో బుధవారం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కల్యాణ చక్రవర్తి తెలిపారు. ప్రముఖ పంచాగ కర్త సీహెచ్‌వీ అనంత్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కాలనీ వాసులందరూ హాజరు కావాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మోజమ్‌ఖాన్

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ జాఫర్‌ఖాన్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్‌ను మంగళవారం దారుసలాంలో ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మోజమ్‌ఖాన్ అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శ్రీనగర్‌కాలనీ ఎంఐఎం ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పెంచిన ఫీజులు తగ్గించాలి

లిబర్టీ: పెంచిన పీహెచ్‌డీ అడ్మిషన్ ఫీజులను వెంటనే తగ్గించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బీసీ దళ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఏకపక్షంగా రూ. 2 వేలు ఉన్న ఫీజులను ఏకంగా రూ. 25 వేలకు పెంచడం దారుణమన్నారు. ఫీజులు పెంపు వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని, వెంటనే పెంచిన ఫీజు లను తగ్గించాలని కుమారస్వామి డిమాండ్ చేశారు.

పేద ముస్లింలకు ఉచితంగా బియ్యం పంపిణీ



శ్రీనగర్‌కాలనీ: రంజాన్ పండుగ సందర్భంగా సుమారు 600 పేద ముస్లిం కుటుంబాలకు బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ జనరల్ సెక్రటరీ షరీఫ్ ఖురేషి ఉచితంగా బియ్యం, కర్జూరాలు అందించడం అభినందనీయమని సనత్‌నగర్ సీఐ ముత్తు యాదవ్ అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో పేద ముస్లింలకు బియ్యం, కర్జూరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షరీఫ్, డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ, పల్లవియాదవ్, బాలకృష్ణ, కరణ్, సర్దార్ పాల్గొన్నారు.

శ్రీరేను స్కూల్ వార్షికోత్సవం

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్‌లోని శ్రీ రేను హైస్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు, నాటికలు అందరినీ అలరించాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ మల్లేశ్ రేను, ప్రిన్సిపాల్ సంతోష్, హెచ్ఎం సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

సమాజసేవకు అవార్డు


అవార్డు అందుకుంటున్న నర్సింగ్‌రావు

బంజారాహిల్స్: బీయాండ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఈ.నర్సింగ్‌రావును తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ గౌరవించింది. కరోనా కష్టకాలంలో పేదలకు, కార్మికులకు అల్పాహారం, నిత్యావసర సరుకులు, భద్రతా కిట్లను పంపిణీ చేయడంలోనూ, ఆశ వర్కర్లను ప్రోత్సహించడంలోనూ బీయాండ్ లైఫ్ ఫౌండేషన్ చొరవచూపింది. ఫౌండేషన్ చేస్తున్న సమాజ సేవలను గుర్తించిన ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్, మహ్మద్ కలికుర్ రహ్మన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

వారాంతపు సంత ప్రారంభం

రహమత్‌నగర్: ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచన మేరకు హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–2లో వారాంతపు సంతను ప్రారంభించినట్లు బస్తీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు షేక్ గనీ తెలిపారు. బస్తీ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆయన సంతను ప్రారంభించారు. ఈ సంతతో ఎంతో మంది చిరువ్యాపారులకు ఉపాధి లభిస్తుందని, మసీద్ వద్ద నుంచి ఇందిరానగర్ ఫేజ్–1 బస్తీ వరకూ వ్యాపారులు తమ దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన అన్నారు.

మార్కెట్లకు ఉగాది శోభ!




- పూలు, పండ్లతో కళకళ
- కొనుగోలుదారుల సందడి

బంజారాహిల్స్: మార్కెట్లకు ఉగాది శోభ సంతరించుకుంది. తెలుగు నూతన సంవత్సరాది సందర్భంగా మార్కెట్లన్నీ పూలు, పండ్లతో కళకళలాడగా, కొనుగోలుదారుల సందడి నెలకొంది. బుధవారం శోభాకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న ప్రజలు మంగళవారం సాయంత్రం మార్కెట్లకు కదిలి వచ్చారు.

- పూలు, పండ్లు, మామిడి కాయలు, వేప పువ్వు, తాజా చింతపండు, బెల్లం తదితర పండుగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు భారీ సంఖ్యలో విచ్చేశారు. దీంతో మార్కెట్లలో సందడి నెలకొంది.
- బంజారాహిల్స్, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్, ఫిలింనగర్, ఖైరతాబాద్, చింతల్ బస్తీ, సోమాజిగూడ, పంజగుట్ట తదితర ప్రాంతాల్లోని మార్కెట్లు కొనుగోళ్లదారులతో కిటకిటలాడాయి.

నేడు పంచాంగ శ్రవణం

- ఉగాది సందర్భంగా ప్రధాన ఆలయాల్లో శోభకృత్ నామ సంవత్సరం పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫిలింనగర్ దైవసన్నిధానంతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఉగాదికి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- ఉదయం 9 గంటల నుంచి ఫిలింనగర్ దైవసన్నిధానంలో సకలమానవాళికి రాశి ఫలాలు బాగుండాలని ఆదాయ, వ్యయాలు చక్కగా ఉండాలని, నక్షత్ర, నవగ్రహ అనుకూలత, అనుగ్రహం కలిగి సుఖ సంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఉగాది రోజున నవగ్రహ నక్షత్ర సహిత ఆయుష్య హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు వెల్లడించారు.
- ఉగాది పచ్చడి పంపిణీకి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి: ఎమ్మెల్యే దానం


ఎమ్మెల్యేను కలిసిన రామకృష్ణానగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ ఎర్రమంజిల్ సమీపంలోని రామకృష్ణానగర్ బస్తీవాసులు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీతోనే బస్తీలు, కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని బస్తీలోని నివాసాలు క్రమబద్ధీకరణకు నోచుకోవాలంటే పక్క పార్టీల వైపు చూడటం వల్ల ఫలితం ఏమి ఉండదన్నారు. బస్తీలో ఉన్న నివాసాలను క్రమబద్ధీకరించే బాధ్యత తనదేనన్నారు. త్వరలోనే బస్తీలో అధికారులతో పర్యటించి నివాసాలను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొయ్యాడ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ కాలనీ ప్రధాన రహదారిలోని శ్రీరామాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 22 (బుధవారం) నుంచి 31వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ నాళం సుజాత, కార్యనిర్వహణాధికారి గోవాడ సత్యనారాయణ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు ఆంజనేయస్వామి వారికి అభిషేకం, 8 గంటలకు ప్రాతఃకాల పూజ, సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాల పూజ, అదే విధంగా అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు జరుగుతాయన్నారు. 30న మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. కాగా, ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్య విజయ్ హాజరు కానున్నారని చైర్‌పర్సన్ సుజాత తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొనాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

లిబర్టీ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.మార్టిన్ రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్‌ఎంసీ అధికారులకు విన్నవించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రస్తుతం ఇస్తున్న వేతనం ఎంత మాత్రం సరిపోవడం లేదన్నారు. మంగళవారం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మున్సిపల్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయాలని విన్నవించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 20 రోజులు పని చేస్తే వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏబీవీపీ ఆందోళనలో విద్యార్థి హల్‌చల్!


విద్యార్థిని భుజాన వేసుకొని కారు వద్దకు తీసుకెళ్తున్న పంజగుట్ట సీఐ హరిశ్చంద్రారెడ్డి

- సొమ్మసిల్లి పడిపోయినట్లు నటించిన వైనం
- పోలీసుల నుంచి తప్పించుకోవడానికే నాటకమని గుర్తింపు

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ మంగళవారం ఏబీవీపీ విద్యార్థులు ప్రగతి భవన్ ముట్టడికి యత్నించారు. అదే సమయంలో ఓ విద్యార్థి సొమ్మసిల్లి పడిపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న పంజగుట్ట సీఐ హరిశ్చంద్రారెడ్డి గమనించి..సదరు విద్యార్థి ఎండదెబ్బకు తట్టుకోలేక కుప్పకూలిపోయి ఉంటాడని భావించి వెంటనే స్థానిక పోలీసులతో సీపీఆర్ నిర్వహించారు. అనంతరం ఆ విద్యార్థిని భుజాన వేసుకొని తన పోలీస్ వాహనంలో యశోదా ఆస్పత్రికి తరలించేందుకు వెళ్తున్న క్రమంలో సదరు విద్యార్థి కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశాడు. దీంతో పోలీసులు అవాక్కయ్యారు. మీడియా దృష్టిలో పడేందుకు ఆ విద్యార్థి ఈ రకమైన నాటకం ఆడినట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి చల్లగా అక్కడి నుంచి జారుకునేందుకు యత్నించగా పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తానికి ఈ ఘటన స్థానిక పోలీసుల్లో చర్చకు దారి తీసింది.

ఏబీవీపీ విద్యార్థి నేతల అరెస్ట్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై ఏబీవీపీ ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునివ్వగా ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం ఉదయం పెద్ద సంఖ్యలో విచ్చేసిన ఏబీవీపీ కార్యకర్తలు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రగతి భవన్ వైపు వెళ్లేందుకు యత్నించగా బందోబస్తు పోలీసులు వీరిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రగతి భవన్ వైపులోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన గజ్జెల దేవేందర్, హర్షవర్ధన్, నదీం, కార్తీక్ పైడిపల్లి, యాదా త్రిలోక్, డి.శ్రీకాంత్, డి.జగదీష్ తదితరులతో పాటు 72 మందిని అరెస్ట్ చేసి బొల్లారం, ఎస్ఆర్‌నగర్, నాంపల్లి, పంజగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు.



మహాధర్నాను విజయవంతం చేయాలి


ఫిలింనగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఫిలింనగర్: షెడ్యూల్ కులాల వర్గీకరణ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 3న నిర్వహించ తలపెట్టిన బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి, మహాధర్నా కార్యక్రమాలకు పెద్ద ఎత్తున తరలి రావాలని జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బొప్పారం వేణు మాదిగ కోరారు. ఫిలింనగర్‌లో మంగళవారం మాదిగల సంగ్రామ పాదయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు టీవీ నర్సింహారావు, మహేష్, వీఎస్ రాజు, కండె రాము, శివకుమార్, అశోక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి: చింతల

ఖైరతాబాద్: నీళ్లు, నిధులు, నియామకాల పేరిట ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలనలో లిఫ్ట్, లిక్కర్, లీకేజీలే రాజ్యమేలుతున్నాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన ఖైరతాబాద్‌లోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ, 2015 నుంచి 2018 వరకు జరిగిన అన్ని పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో 13 జిల్లాల్లో మిర్చి, మామిడి, వరి, వేరుశనగ పంటలు నష్టం జరిగితే రైతులను పరామర్శించేందుకు ప్రజాప్రతినిధులకు, మంత్రులకు తీరిక లేకుండాపోయిందని విమర్శించారు. పంట నష్టం ఇవ్వాలనే కనీస సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల పేరిట కల్వకుంట్ల కుటుంబం డబ్బులు దండుకుందని చింతల ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కవితను కాపాడటానికి మంత్రులకు ఉన్న శ్రద్ధ రైతులను, విద్యార్థులను పరామర్శించడంపై లేకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

నిమ్స్‌లో నర్సుల సమ్మె.. విరమణ


నిమ్స్‌లో ధర్నా చేస్తున్న నర్సులు

- మెమో తెచ్చిన తంటా.. నర్సుల మెరుపు సమ్మె
- చర్చలు సఫలం.. విధుల్లోకి నర్సులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో నర్సులు విధులు బహిష్కరించి మెరుపు సమ్మెకు దిగారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అదనపు డ్యూటీలు వేసి ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ మంగళవారం డైరెక్టర్ పేషీ వద్ద నర్సులు బైఠాయించారు. విధులకు గైర్హాజరవుతున్నారంటూ నర్సింగ్ సూపరింటెండెంట్ లలితకుమారి, ఎన్ఎన్‌యూ ప్రధాన కార్యదర్శి విజయకుమారి, స్టాఫ్ నర్సు స్లీవకు యాజమాన్యం మెమో ఇచ్చింది. ఈ చర్యపై నర్సులంతా తిరుగుబాటు చేశారు. వెంటనే మెమోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఉదయం జరగాల్సిన ఆపరేషన్లు నిలిచిపోయాయి.

సమ్మె దురదృష్టకరం..

నర్సులు సమ్మెకు దిగడం దురదృష్టకరమని మెమో కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీభూషణ్‌రాజు అన్నారు. నర్సుల ధర్నాతో వైద్య సేవలు నిలిచిపోయాయని, ఒకరిద్దరి సమస్యలను అందరికీ ఆపాదిస్తున్నారని ఆయన తప్పుబట్టారు. ఒకరిద్దరికి మెమో ఇస్తే అందరూ సమ్మె చేయడం ఏంటని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప మండిపడ్డారు. ఒక నర్సు ఏడాదిలో 143 రోజులు ఆలస్యంగా వచ్చారని, అది రిజిష్టర్‌లో రికార్డు కాకపోవడంతోనే మెమో ఇచ్చామన్నారు. పోలీసుల సమక్షంలో జరిగిన చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమించిన నర్సులు విధులకు హాజరయ్యారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

- ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ, గులాబీ కండువా వేసుకున్న ప్రతి కార్యకర్త గర్వించేలా దీనిని రూపొందించామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్త ఈ కండువా వేసుకోవడం ద్వారా ప్రజాసేవలో కూడా ముందుంటున్నారన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం తర్వాత నియోజకవర్గ సమ్మేళనాలు కూడా చేపడతామని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఈ ఆత్మీయ సమ్మేళనానికి తగిన సందేశాలు ఇచ్చారన్నారు. ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలోని ఆరు డివిజన్ల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. వీరందరితో ఎమ్మెల్యే గ్రూప్ ఫొటోలు దిగి సందడి చేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం

క్రైం కార్నర్..

ఇద్దరి నుంచి రూ. 44 లక్షలు కొట్టేశారు!

- ఇన్వెస్ట్‌మెంట్ అంటూ ఒకరికి..
- స్టడీ టేబుల్ కొంటామని మరొకరికి సైబర్‌నేరగాళ్ల టోకరా

హిమాయత్‌నగర్: నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సైబర్ నేరగాళ్లు భారీ మొత్తంలో డబ్బు కాజేశారు. సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. ఎస్సార్ నగర్‌కు చెందిన శివ అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మళ్లాడు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి చెప్పిన విధంగా వెగాస్–11 బెట్టింగ్ అనే యాప్‌లో ఏడాదిన్నరగా బెట్టింగ్ చేస్తున్నాడు. బెట్టింగ్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ వైపు మళ్లించి అతడి నుంచి రూ.30 లక్షలు కాజేశారు.

మరో ఘటనలో...

- మలక్‌పేటకు చెందిన యువతి స్టడీ టేబుల్ అమ్మేందుకు ఓఎల్ఎక్స్‌లో యాడ్ పోస్ట్ చేసింది. దానిని చూసిన నేరగాడు స్టడీ టేబుల్ కొంటానని నమ్మించి క్యూఆర్ కోడ్‌లు పంపి పలు దఫాలుగా రూ.14 లక్షలు స్వాహా చేశాడు.
- ఇలా ఇద్దరి నుంచి సైబర్ నేరగాళ్లు మొత్తం రూ.44 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


సంజీవ్ కుమార్ సింగ్ మృతదేహం

బంజారాహిల్స్: మద్యం కొనుగోలు కోసం వచ్చిన ఓ వ్యక్తి వైన్ షాప్ సమీపంలోకి రాగానే గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాకేష్ కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంజీవ్ కుమార్ సింగ్ (40) జూబ్లీహిల్స్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం. 37లోని వైన్‌షాప్ వద్దకు మద్యం కొనుగోలు కోసం వస్తుండగానే సమీపంలోని ఎఫ్ఎంఎస్ హాస్పిటల్ వద్ద కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తరలించేందుకు యత్నించిన స్థానికులు అప్పటికే అతను చనిపోయినట్టు గుర్తించారు. పోలీసులు సంజీవ్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడు ఎక్కడ నివాసం ఉంటాడనే సమాచారం లభ్యం కాలేదు. మృతుడికి బంధువులు ఉంటే 9949879123 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

పరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేయాలి

వెంకటేశ్వరకాలనీ: పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేయాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఫుడ్‌సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని లోటస్‌పాండ్ వద్ద ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా వీధి వ్యాపారులకు ఆహారపదార్థాల తయారీ, జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. వీధి వ్యాపారులు, వినియోగదారులతో సహా ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వ్యాపారులకు ఈ అవగాహన కలిగిస్తున్నట్లు జూబ్లీహిల్స్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారుల సౌమ్యారెడ్డి, నిహారిక, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న తాము వీధి వ్యాపారులు విక్రయిస్తున్న ఆహారపదార్థాలను పరీక్షించి నాణ్యతకు, పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని సూచనలు జారీ చేస్తున్నామన్నారు. హానికర పదార్థాలు తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

క్లుప్తంగా...



తిరుమల ఆలయంలోని ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ ఈవో

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. కాగా, బుధవారం ఉగాది ఆస్థానం సందర్భంగా బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

సీఆర్డీఏ ప్రాంతంలోనూ పేదలకు ఇళ్లు

గెజిట్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, తుళ్లూరు మండలంలోని మందడం, ఐనవోలులో 900.97 ఎకరాలను ఆర్–5 జోన్‌గా నిర్ణయించింది. సీఆర్డీఏ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, నిరుపేదలకు అక్కడ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. సీఆర్డీఏ చట్టంలోని నిబంధనల ప్రకారం మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో ఐదు శాతం నిరుపేదలకు కేటాయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోని ఆర్–5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సీఆర్డీఏ సిద్ధమవుతోంది. నెల రోజుల్లో 900.97 ఎకరాల్లో లేఅవుట్ సిద్ధం చేసి కలెక్టర్లకు అప్పగించనున్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో దాదాపు 54 వేల మంది లబ్ధిదారులను గుర్తించారు. వారందరికీ ఆర్–5 జోన్‌లో ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు.

చదువులకు 'బలం'!

జగనన్న గోరుముద్దలో మరో పోషకాహారం: సీఎం జగన్

- బడి పిల్లలకు ఉదయం పూట రాగి జావ
- సమృద్ధిగా ఐరన్, కాల్షియంతో బాల్యానికి బలం
- ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో 38 లక్షల మందికి రాగి జావ
- మంచి మేనమామలా 15 రకాల పదార్థాలతో పిల్లలకు రుచికరమైన మెనూ



సాక్షి, అమరావతి: మన విద్యార్థులంతా భావి ప్రపంచంతో పోటీపడి రాణించేలా ప్రతి అడుగులోనూ వారికి అండదండలు అందిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పిల్లలకు మంచి మేనమామలా వారికి అందించే ఆహారం నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల దాకా అన్ని విషయాల్లోనూ వారి బాగోగులే లక్ష్యంగా నడుస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ కూడా పిల్లల బాగు కోసం ఇంత తపన పడలేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. 'మన ప్రభుత్వం రాక ముందు పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి..? ఒక సారి తేడాను గమనించండి. పిల్లలు ఏం తింటున్నారు? అని ఒక ముఖ్యమంత్రి ఆలోచన చేసిన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారన్న మంచి ఆలోచనతో గోరుముద్దను చేపట్టాం. పిల్లలకు మంచి మేనమామలా 15 రకాల ఆహార పదార్థాలతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనానికి గతంలో ఏడాదికి కేవలం రూ.450 కోట్లు కూడా ఖర్చు చేయని దుస్థితి. ఇప్పుడు గోరుముద్ద కోసం ఏడాదికి రూ.1,824 కోట్లు ఖర్చు చేస్తున్నాం'అని తెలిపారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 37,63,698 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ఏటా రూ.86 కోట్ల అదనపు వ్యయంతో ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏప్రిల్‌లో పదో తరగతితో పాటు మిగిలిన పిల్లలకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారందరికీ ఓ మేనమామగా ఆల్ ద వెరీ బెస్ట్ చెబుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

మొదటి రోజు నుంచే..

అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చదువులను సంస్కరించడంపై దృష్టి పెట్టాం. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. చదువుకునే విద్యార్థులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, విద్యాకానుక, నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, బైలింగ్వువల్ పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. 8వ తరగతిలోకి వచ్చిన వెంటనే పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇక 6వ తరగతి నుంచి ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ ప్యానెల్స్) ద్వారా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నాడు – నేడు పూర్తైన స్కూళ్లలో జూన్ నుంచి అమలులోకి తీసుకొస్తాం. ఇలా ప్రతి అడుగులోనూ పిల్లలను చేయిపట్టి నడిపిస్తున్నాం.

మరింత బలవర్ధకంగా గోరుముద్ద

గోరుముద్దను ఇప్పటికే రోజుకొక మెనూతో రుచికరంగా అమలు చేస్తున్నాం. ఇప్పుడు మరింత బలవర్ధకంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాం. ఇవాళ్టి నుంచి పిల్లలకు రాగిజావ కూడా అందిస్తూ గోరుముద్దను మరింత పుష్టికరంగా తీర్చిదిద్దుతున్నాం. రాగి జావ పిల్లల్లో సమృద్ధిగా ఐరన్, కాల్షియం కంటెంట్ పెరిగేలా దోహదపడుతుంది. మిడ్ డే మీల్స్ అంటూ గత ప్రభుత్వ హయాంలో మొత్తం సంవత్సరం అంతా కలిపినా కూడా ఏడాదికి రూ.450 కోట్లు కూడా మధ్యాహ్న భోజనానికి ఖర్చు చేయని దుస్థితి. అలాంటి అధ్వాన్నమైన పరిస్థితుల నుంచి గోరుముద్ద అనే కార్యక్రమం ద్వారా రోజుకొక మెనూతో పూర్తిగా మార్చి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. గతంలో రూ.450 కోట్లు మాత్రమే ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు ఏడాదికి రూ.1,824 కోట్లకు పెంచి గోరుముద్ద కోసం ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు రాగి జావ కోసం అదనంగా మరో రూ.86 కోట్లు ఇస్తున్నాం. రోజుకో మెనూతో పిల్లలకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం.

సత్యసాయి ట్రస్టు సహకారంతో..

పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు భాగస్వామి కావడం నిజంగా మంచి పరిణామం. ఏటా దాదాపు రూ.86 కోట్లు ఖర్చయ్యే రాగి జావ కోసం సత్యసాయి ట్రస్టు రూ.42 కోట్లు అందిస్తుండగా మిగిలిన రూ.44 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరుస్తూ మంచి కార్యక్రమానికి ముందడుగు వేస్తున్నాం.

జనసేనతో పొత్తు ఉన్నా లేనట్లే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కోరినా పవన్ స్పందించలేదు
- ఎమ్మెల్సీ మాధవ్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న తనకు మద్దతుగా బహిరంగ ప్రకటన చేయాలని స్వయంగా మిత్రపక్ష జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరినా ఆయన స్పందించలేదని.. క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసే పరిస్థితి లేనప్పుడు బీజేపీ–జనసేన 'కలిసి ఉన్నా లేనట్లే'అని శాసనమండలిలో బీజేపీ పక్ష నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ఘాటుగా స్పందించారు. పొత్తులో కొనసాగుతున్నప్పటికీ జనసేన ఎక్కడా బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలపని అంశంపై మంగళవారం విజయవాడలో జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మాధవ్ వెల్లడించారు. 'మేం జనసేనతో కలిసి ఉన్నా లేనట్లేనన్న వాతావరణం ఉంది. ఇటీవల పవన్ కూడా జనసేన–బీజేపీ పొత్తు ఉంది అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయడం లేదన్నది వాస్తవం. నిజంగా పొత్తులో ఉంటే క్షేత్రస్థాయిలో కూడా కలిసి పనిచేయాలని కోరుతున్నాం'.. అని మాధవ్ వ్యాఖ్యానించారు. 'కలిసి పనిచేస్తే ప్రజా మద్దతు రెండు పార్టీలకు ఉంటుంది. ఆయనా (పవన్) నమ్మాలి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రకటన చేయాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. కానీ, ప్రకటన రాలేదు'.. అని మాధవ్ చెప్పారు. కలిసి పనిచేసే విషయంలో బీజేపీ నుంచే స్పందనలేదని పవన్‌కళ్యాణ్ అంటున్నారని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆయన వైపు నుంచే స్పందనలేదు'అని బదులిచ్చారు.

తవ్వేకొద్దీ బయటపడుతున్న

మార్గదర్శి మోసాలు

రూ.459.98 కోట్లను దారి మళ్లించినట్లు ఇప్పటికే ఆడిట్‌లో నిర్ధారణ

- తాజాగా మరిన్ని అక్రమాలు బట్టబయలు
- ప్రతి గ్రూపులో పాడుకునే రెండో నెల పాటకు ఎటువంటి చందా కట్టని వైనం
- ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందాలకు ఎగనామం
- ఇవేమీ చెల్లించకుండానే ప్రతి గ్రూపుపైనా ప్రతి నెలా 5 శాతం కమీషన్ స్వీకరణ
- గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వెలుగులోకి
- ఈ ఉల్లంఘనలపై ఆయా బ్రాంచ్‌ల వివరణ కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ



సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ మోసాలు తవ్వే కొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రూ.459.98 కోట్ల సొమ్మును చట్టవిరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, తదితరాల్లోకి మళ్లించినట్లు ఆడిటింగ్‌లో అధికారులు నిర్ధారించారు. తద్వారా చందాదారుల సొమ్మును తమ వ్యక్తిగత లబ్ధి కోసం రామోజీరావు, ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజ వినియోగించుకున్నట్లు స్పష్టమైంది. తాజాగా ప్రతి చిట్ గ్రూపులో ఖాళీ చిట్లు, కంపెనీ పాడుకునే రెండో నెల చిట్ల లావాదేవీల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. మార్గదర్శి మేనేజర్లు సమర్పించిన మినిట్స్‌ను విశ్లేషించిన ఆడిట్ అధికారులు ఈ మోసాలను గుర్తించారు. ఖాళీ చిట్లకు గానీ, ప్రతి చిట్ గ్రూపులో కంపెనీ పాడుకునే రెండో నెల చిట్‌కు సంబంధించి గానీ ఎటువంటి సొమ్ము (నెల వారీ చందా) చెల్లించలేదని వెల్లడైంది. ప్రతి చిట్ గ్రూపులో రెండో నెల చిట్ పాటను కంపెనీయే పాడుకునే అవకాశం ఉంది. అందుకోసం అందరి చందాదారుల మాదిరిగానే కంపెనీ కూడా చందా కట్టాలి. కానీ చందా కట్టకుండానే ఆ రెండో నెల చిట్‌ను పాడుకుని కంపెనీ జమ చేసుకుంటోంది. కంపెనీ తరఫున కట్టాల్సిన ఎటువంటి చందాలు కట్టకుండానే ప్రతి నెలా ప్రతి గ్రూపు నుంచి 5 శాతం కమీషన్‌ను తీసుకుంటోంది.

ఆధారాలతో సహా వెలుగుచూసిన అక్రమాలు

గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు మార్గదర్శి యూనిట్లలో ఈ మోసాలు ఆధారాలతో సహా బయటపడ్డాయి. గుంటూరు జిల్లాలో ఐదు చిట్ గ్రూపులను విశ్లేషించగా వాటి ద్వారా రూ.1.18 కోట్లను చిట్ కమీషన్‌గా, రూ.1.73 కోట్లను రెండో నెల పాడుకున్న చిట్ సొమ్ముగా కంపెనీ జమ చేసుకుంది. కానీ పాడుకున్న రెండో నెల చిట్ చందా.. అలాగే ఆ గ్రూపులో తన పేరు (ఫోర్‌మెన్) మీద ఉంచుకున్న ఖాళీ చిట్లకు చెల్లించాల్సిన చందా సొమ్ము రూ.6.98 కోట్లు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. విజయనగరం జిల్లాలో 12 చిట్ గ్రూపులను విశ్లేషించినప్పుడు ఫోర్‌మెన్ కమీషన్ రూ.60.50 లక్షలు, రెండో నెల పాడుకున్న చిట్ మొత్తం రూ.1.05 కోట్లను కంపెనీ ఖాతాలో వేసుకున్నారు. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రెండో నెల చిట్ చందాలు, కంపెనీ పేరు మీద ఉన్న ఖాళీ చిట్ల చందాల మొత్తం రూ.54.85 లక్షలు కట్టలేదని తేలింది. అలాగే శ్రీకాకుళం జిల్లాలో 28 చిట్ గ్రూపులను పరిశీలించినప్పుడు వాటికి ఫోర్‌మెన్ కమీషన్ రూ.3.47 కోట్లు, రెండో నెల పాడుకున్న చిట్ల మొత్తం రూ.2.73 కోట్లను కంపెనీ తీసుకుంది. కానీ వాటికి సంబంధించి కట్టాల్సిన రూ.2.88 కోట్ల చందా సొమ్మును కట్టలేదు.

భారీగా ఉల్లంఘనలు..

నెల వారీగా చందాదారులతోపాటు కట్టాల్సిన సొమ్మును కట్టకుండానే కమీషన్ తీసుకోవడం, ప్రతి గ్రూపులోనూ చందా కట్టకుండానే రెండో నెల చిట్‌ను పాడుకుని ఆ సొమ్మును తీసుకోవడం ద్వారా మార్గదర్శిలో చిట్లు వేసిన వారిని రామోజీరావు, ఆయన కోడలు శైలజ మోసం చేసినట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును పణంగా పెట్టి భారీగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. ఖాళీగా ఉన్న చిట్లకు సంబంధించి ఎటువంటి చందా చెల్లించకుండా మిగిలిన చందాదారులను మభ్యపెట్టినట్లు తేలింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత మార్గదర్శి బ్రాంచ్‌లను ఆదేశించినట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు.

నగర వార్తలు


విద్యార్థుల కోసం ఇన్ఫర్మేటిక్స్ ల్యాబ్



ఇన్ఫర్మేటిక్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మహ్మద్ వలియుల్లా

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మేటిక్స్ ల్యాబ్‌ను సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా మంగళవారం గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, అక్బర్ అలీఖాన్, వాహబ్ సొహెబ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. సొసైటీ దివంగత చైర్మన్ మహ్మద్ ఖాన్ లతీఫ్ ఖాన్ పేరుతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఖాన్ లతీఫ్ ఖాన్ చేసిన సేవలను కొనియాడారు. రూ.95 లక్షలతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, డీప్ లెర్నింగ్, బ్లాక్ చైన్ తదితర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ల్యాబ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఎంజే సెట్ డైరెక్టర్ డాక్టర్ బషీర్ అహ్మద్, ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ రావత్ తదితరులు పాల్గొన్నారు.

యశ్వంత్ కుటుంబానికి పరిహారం చెల్లించాలి



లక్డీకాపూల్: సూర్యాపేట జిల్లా చివ్వెంలలో జరిగిన హాస్టల్ ప్రమాదంలో గాయపడి మృతి చెందిన యశ్వంత్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన యశ్వంత్ మంగళవారం భౌతికకాయానికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హాస్టల్లో స్నానం చేసేందుకు వెళ్లిన విద్యార్థులపై గోడ కూలడంతో అక్కడికక్కడే మృతి చెందిన పవన్ కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల పరిహారం చెల్లించిందన్నారు. ఆ పరిహారం సరిపోదని, యశ్వంత్ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, మృతుడి తండ్రి శ్రీనివాస్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సాధు జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

సినీ నటుడు శరత్‌కుమార్



సాక్షి, సిటీబ్యూరో/సనత్‌నగర్: సాధు జంతువులు మన పైన చూపించే ప్రేమ అపురూపమైందని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రముఖ సినీ నటుడు శరత్‌కుమార్ తెలిపారు. వీధి కుక్కల విషయంలో మన నిర్లక్ష్యం వాటి రక్షణకు ఇబ్బందిగా మారిందని, అంతేగాకుండా దీని ప్రభావంతో సామాజికంగా కూడా నష్టం జరుగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా 20 వేల మంది రేబిస్‌తో మరణిస్తున్నారని, అందులోనూ 15 ఏళ్లలోపు వారే ఎక్కువ ఉన్నారన్నారు. యూఎస్‌లో నివసిస్తున్న తెలంగాణవాసి డాక్టర్ శ్రీరెడ్డి ఆధ్వర్యంలో పెంపుడు జంతువుల సంరక్షణ కోసం నగరం వేదికగా హెర్మియోన్ డంకన్ రెడ్డి ఫౌండేషన్ ప్రారంభించారు. బేగంపేటలోని ది ప్లాజా హోటల్ వేదికగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో జంతు ప్రేమికుడు, సినీ హీరో శరత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం హెర్మియోన్ డంకన్ రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.శ్రీరెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా జంతువుల కోసం పనిచేస్తున్న వివిధ ఎన్‌జీవోలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. యూఎస్‌లో హెర్మియోన్ డంకన్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత జంతు సంరక్షణ సేవలు కొనసాగిస్తున్నామని, ఆ సేవలను నగరంలోనూ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా వీధి కుక్కలకు మైక్రో చిప్స్‌ను అమర్చే వినూత్న కార్యక్రమాన్ని చేపడతామన్నారు. దీని కోసం జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చిస్తున్నామని, ఈ మైక్రో చిప్‌ల ద్వారా ఆ కుక్కలన్నింటికీ ఒక డేటాబేస్ తయారు చేసి వాటికి అవసరమైన వ్యాక్సినేషన్, ఆరోగ్య సంరక్షణ ఇతర సేవలను అందిస్తామని తెలిపారు. మరికొద్ది రోజుల్లో నగరంలో వెటర్నరీ డయాగ్నోస్టిక్ ల్యాబ్, జంతువుల కోసం ప్రత్యేకంగా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. నెక్లెస్ రోడ్డు డాగ్‌పార్క్‌లో శుక్రవారం ఉచిత వ్యాక్సినేషన్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు

రాయదుర్గం: ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ట్రాఫిక్ పోలీసులు అన్నారు. ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో రోడ్డు సేఫ్టీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు కృష్ణంరాజు, లలిత్ నాదెండ్ల, శ్రీముఖ్ ఫుట్స్, జైవీర్‌మేవాడ, అహాన్‌జుమ్నాని రోడ్డుపైకి వచ్చి ప్రత్యేకంగా రూపొందించిన వాల్ పోస్టర్స్‌ను వాహనదారులకు అందజేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వారిని కోరారు. ద్విచక్రవాహనదారులతో పాటు ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లకు విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై వివరించడంపై పలువురు మెచ్చుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రూపు ఈ వారం మొత్తం ప్రచారం కొనసాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు, ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు ఉన్నారు.



వాహనదారులకు వాల్ పోస్టర్స్ అందజేస్తున్న విద్యార్థులు

'నేను నా భర్తతోనే ఉన్నా..'

- డబ్బు సంపాదించేందుకు తనపై అసత్య ప్రచారం
- సినీ నటి హేమ ఆరోపణ.. సైబర్‌క్రైంలో ఫిర్యాదు



హిమాయత్‌నగర్: ప్రస్తుతం.. 'నేను నా భర్తతోనే ఉంటున్నాను, వేరే ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు'. అసలు యూట్యూబ్ ఛానల్స్ వాళ్లు నాపై పడి ఏడవాల్సిన అవసరం ఏముందని సినీనటి హేమ కొల్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం మా వివాహ వార్షికోత్సవ వీడియోలను తాజాగా నేను రెండో పెళ్లి చేసుకున్నానంటూ అసత్య ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టనంటూ హెచ్చరించారు. ఈమేరకు కొన్ని యూట్యూబ్ చానల్స్‌పై హేమ మంగళవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పలు కీలకమైన విషయాలను ఏసీపీ కేవీఎం ప్రసాద్‌కు ఆమె తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డబ్బు సంపాదించేందుకు కొందరు మూర్ఖులు కాపురాల్లో చిచ్చుపెడుతున్నారన్నారు. కోట శ్రీనివాసరావు చచ్చిపోయినట్లుగా, కొణిదల నిహారిక విడిపోయినట్లుగా, నాగచైతన్య నాగార్జునకు మధ్య గొడవలు ఉన్నట్లుగా, నాకు వేరే వాళ్లతో సంబంధాలు ఉన్నట్లు తంబ్‌నెయిల్స్ పెడుతున్నారన్నారు. న్యాయపరమైన పోరాటం చేస్తానని, ఎవరినీ ఉపేక్షించనంటూ హెచ్చరించారు.

కూతురు ఇష్టంలేని పెళ్లి చేసుకుందని తల్లి ఆత్మహత్య



నిర్మల(ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: కూతురు ఇష్టం లేని వివాహం చేసుకోవడంతో మనస్థాపానికి గురైన తల్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జయనగర్ కాలనీలోని గోనుగుంట శ్రీనివాసరావు, నిర్మల(45) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు నిహారిక ఐదు రోజుల క్రితం తన క్లాస్‌మేట్‌ను వివాహం చేసుకుంది. ఇష్టంలేని పెళ్లి చేసుకోవడంతో మనస్థాపానికి గురైన నిర్మల సోమవారం సాయంత్రం బెడ్‌రూమ్‌లో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై న్యాయవాదుల నిరసన

రంగారెడ్డి కోర్టులు: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యాయవాది లంబ సత్యనారాయణపై సివిల్ వివాదంలో వకాల్తా తీసుకున్న కారణంగా బనాయించిన అక్రమ కేసుకు నిరసనగా న్యాయవాద సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షుడు గుర్రం సుధాకర్‌రెడ్డి పిలుపు మేరకు న్యాయవాదులు రంగారెడ్డి జిల్లా కోర్టులో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ జిల్లా కోర్టు, హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా సివిల్ వివాదాల్లో కల్పించుకుంటూ న్యాయవాదులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు బాచిరెడ్డి శాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రపాపయ్యవారి వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నం దేవరాజ్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేన్ రెడ్డి, ములుగూరి ఫణీంద్ర భార్గవ్, న్యాయవాదుల జేఏసీ అధ్యక్షుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు ఉన్నారు.



కోర్టు ఎదుట ప్లకార్డులతో న్యాయవాదులు

గురక, స్లీప్ అప్నియాను
నిర్లక్ష్యం చేయొద్దు

కంటోన్మెంట్ గురక, స్లీప్ అప్నియా (నిద్రలో శ్వాస నిలిచిపోవడం) వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు, భారతీయ చికిత్సక్ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ దీన్ దయాల్ అన్నారు. ఈఎన్‌టీ కేర్‌లో నలభై ఏళ్లకు పైగా అనుభవం కలిగిన ఆయన ఆధ్వర్యంలో మారేడుపల్లిలోని షెనాయ్ నర్సింగ్ హోం ప్రాంగణంలో డాక్టర్ దీన్‌దయాల్స్ ఈఎన్‌టీ కేర్ సెంటర్(డీఈసీసీ)ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు గుకర, ఐదుగురిలో ఒకరు స్లీప్ అప్నీయా సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల హైపర్‌టెన్షన్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఆయా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చు అని తెలిపారు.

గురువారం ఉచిత ఓపీ

మారేడుపల్లిలోని షెనాయ్ హాస్పిటల్స్‌లోని ప్రతి గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు.



డీఈసీసీ వైద్య బృందంతో డాక్టర్ దీన్‌దయాల్

క్లుప్తంగా...

లక్ష్యంలో 62% మాత్రమే పంట రుణాలు

- వ్యవసాయ రుణాలపై బ్యాంకర్ల సమీక్షలో మంత్రి నిరంజన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 2022–23 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి నిర్దేశించుకున్న లక్ష్యంలో బ్యాంకులు కేవలం 62 శాతమే రుణాలు ఇచ్చాయని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. రుణాల విషయంలో బ్యాంకులు మరింత ఉదారంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మంత్రితోపాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, కార్యదర్శి రొనాల్డ్ రాస్, వ్యసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎస్‌ఎల్‌బీసీ అధ్యక్షుడు అమిత్ జింగ్రాన్, నాబార్డ్ జీఎం డాక్టర్ వై.హరగోపాల్, ఆర్‌బీఐ డీజీఎం కేఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలో అగ్రగామి వ్యవసాయ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల సగటులో మొదటి స్థానానికి చేరుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యానికి శ్రీకారం చుట్టామని అందులోభాగంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగుకు బ్యాంకులు రుణాలు అందించి ప్రోత్సహించాలని కోరారు. బ్యాంకులు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించి వాటి స్థాపనపై దృష్టి పెట్టాలని నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ అనుకూల విధానాల మూలంగా గ్రామీణ ప్రాంతాల భూముల ధరలు భారీగా పెరిగాయని వాటిని పరిగణనలోకి తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు.

మరో రూ.2,500 కోట్లు

ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా రుణం సమకూర్చుకున్న రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్: సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,500 కోట్ల రుణాన్ని సమకూర్చుకుంది. మంగళవారం జరిగిన వేలంలో రెండు బిడ్ల ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వేలం వివరాల్లో వెల్లడించింది. ఇందులో రూ.1,500 కోట్ల ను 11 ఏళ్ల లోను, మరో రూ.1000 కోట్లను 25ఏళ్ల కాలపరిమితిలో చెల్లించే విధంగా బిడ్లు దక్కించుకున్నట్లు తెలిపింది. తాజాగా తీసుకున్న రుణాలు కలిపి 2022–23 ఆర్థిక ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ద్వారా సమకూర్చుకున్న రుణాలు రూ.39వేల కోట్లు దాటాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నాటికి రూ.34 వేల కోట్లను సమకూర్చుకున్న ప్రభుత్వం ఫిబ్రవరితో పాటు ఈనెలలో జరిగిన ఆర్‌బీఐ వేలం ప్రక్రియల ద్వారా మరో రూ.5వేల కోట్ల వరకు సమకూర్చుకుందని తెలుస్తోంది. అయితే, ఈ ఆర్థిక ఏడాదిలో రూ.52వేల కోట్లకుపైగా రుణాలను సమీకరించాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా, ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో వారం రోజులు సమయమున్న నేపథ్యంలో లక్ష్యానికి రూ.13వేల కోట్లు తక్కువగానే రాష్ట్ర ప్రభుత్వం రుణాలు సమకూర్చుకుంది. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలను కూడా ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట పరిధిలోనికి తీసుకురావడంతో ఆ మేరకు లోటు ఏర్పడిందని, వచ్చే ఆర్థిక ఏడాదిలోనైనా రుణాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు తొలగించి రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన మేర రుణాల సమీకరణకు సహకరిస్తుందనే ఆశాభావాన్ని ఆర్థిక శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

పేదలను కొట్టి.. పెద్దలకు వరాలు: తమ్మినేని



సాక్షి నెట్‌వర్క్, ఖమ్మం: దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలపై మాత్రం భారాలు మోపుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన సమావేశాల్లో తమ్మినేని మాట్లాడుతూ దేశంలో ఉన్న బీసీల లెక్క తేల్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం నాన్చుడి ధోరణి కారణంగా దేశ జనాభాలో 53 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్ ఫలాలు దక్కడం లేదన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపగా.. ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో భద్రాచలం నుంచి సీపీఎం పోటీలో ఉంటుందని తమ్మినేని వెల్లడించారు.

ఇగ్నో అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రవేశపెట్టిన కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు గడువును పొడిగించారు. డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ ప్రోగ్రాములలో మార్చి 27వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ఇగ్నో హైదరాబాదు ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు కె.రమేష్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ విద్యార్థులకు పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ విధానంలో పొందాలని సూచించారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా 9492451812 లేదా 040–23117550 నెంబర్లలో సంప్రదించవచ్చు.

ఏఐ సూక్తి ముక్తావళి

జీవితం క్షణ భంగురం నాయనా!


మిందార్

మతాచారాల్లో రోబోలు..

ఏఐ టెక్నాలజీ ఉధృతి పెరిగితే కొన్నాళ్లకు వీటిని ఆరాధించే కొత్త మతం పుట్టుకొస్తుందంటున్న నిపుణులు

(కంచర్ల యాదగిరిరెడ్డి)

చాట్‌జీపీటీ...

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్. మనం లిఖితపూర్వకంగా అడిగే ప్రశ్నలకు అదే రీతిలో ఠక్కున బదులిచ్చే చాట్‌జీపీటీ తెలివితేటలకు నెటిజన్లు నోరెళ్లబెడుతున్నారు. ఇప్పటికే కోట్ల మంది దీన్ని డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగిస్తున్నారు. వ్యాపార కిటుకుల మొదలు చదువులు, ఇంటర్వ్యూల్లో విజయ మార్గాల వరకు రకరకాల ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు పొందుతున్నారు. కానీ పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి అన్నట్లు కొందరు కృత్రిమ మేధస్సును మతానికీ వాడేసుకుంటున్నారు. పెప్పర్, మిందార్, బ్లెస్ యూ, శాంటోలే అందుకు తార్కాణాలు. అవి ఏమిటని అనుకుంటున్నారా? మతానికి, టెక్నాలజీకి లింకేంటని ఆలోచిస్తున్నారా? **అయితే ఈ స్టోరీ చదవండి.**

జపాన్‌లో పెప్పర్ అనే హ్యూమనాయిడ్ రోబో ఉంది. దాని ప్రత్యేకత ఏమిటో తెలుసా? ముందే నిర్దేశించిన యెన్‌లు (జపాన్ కరెన్సీ) చెల్లిస్తే బౌద్ధ ధర్మం ప్రకారం అంత్యక్రియల మంత్రాలు వల్లెవేస్తుంది! చావు డప్పులు సైతం కొడుతుంది!! అదే దేశంలోని క్యోటో నగరంలో ఉన్న ఓ బౌద్ధ ఆలయంలో 6 అడుగుల 4 అంగుళాల పొడవైన మిందార్ అనే రోబో ఏకంగా భక్తులకు ధర్మ సూక్తులను ప్రవచిస్తుంది!! జర్మనీలోని బ్లెస్ యూ అనే ఇంకో రోబో మంత్రాలు చదవడంతోపాటు భారతీయ సంప్రదాయాల ప్రకారం దేవుళ్లకు హారతులు సైతం ఇస్తుంది!! అమెరికాలోని ఓ చర్చిలో శాంటో అనే 17 అంగుళాల కేథలిక్ రోబో ఉంది. బైబిల్‌ను కంఠస్థం చేసిన ఈ రోబో ముందు నిలబడి మీ బాధను చెప్పుకుంటే చాలు.. వెంటనే బైబిల్ సూక్తులు వినిపిస్తుంది!! అయితే ఈ తరహా మత రోబోల వల్ల లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం వాడకం ఇలాగే కొనసాగితే 2–3 దశాబ్దాల తరువాత టెక్నాలజీ, కృత్రిమ మేధలను ఆరాధించే కొత్త మతం ఒకటి పుట్టుకొస్తుందని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

అవసరం నేర్పిన విషయమే...

అవసరమే అన్నీ నేర్పిస్తుందన్నది నానుడి. మతం కోసం చాట్‌జీపీటీ, ఏఐల వాడకం కూడా ఆ అవసరం నుంచే పుట్టింది. జపాన్‌లో బౌద్ధ భిక్షువులో లేదా ఇంకొకరి చేతనో అంత్యక్రియలు జరిపించడం అత్యంత ఖరీదైన వ్యవహారం. దానికి బదులుగా 'పెప్పర్'ను వాడితే తక్కువ ఖర్చుతో ఆ కార్యక్రమాలు జరిపించవచ్చు. 'శాంటో' విషయంలోనూ ఇలాంటి అవసరమే కనిపిస్తుంది. చర్చికి రాలేని వాళ్లు, మంచాలకు పరిమితమైన వారు, ఒంటరిగా ఉన్న వారు, ప్రార్థనా స్థలాలు లేని ప్రాంతాల్లోని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని దీని సృష్టికర్త గాబ్రియెల్ ట్రోవాటో చెప్తున్నారు. రోజుకో సూక్తి వినిపించే అప్లికేషన్లు ఇప్పటికే బోలెడన్ని అందుబాటులో ఉన్నాయి. అలాగే మతాచారాలను (నమాజు వేళలు, రంజాన్ సమయంలో నిరాహారంగా ఉండాల్సిన సమయం, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ముహూర్తాలు, పంచాంగం, జ్యోతిషం) తు.చ. తప్పకుండా ఆచరించేందుకు సహకరించే స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్లూ ఉన్నాయి. ఏదీ మరచిపోకుండా ఉండేందుకు ఇవి తోడ్పడతాయి. వీటికి చాట్‌జీపీటీ వంటివి తోడైతే?


'పెప్పర్'


బ్లెస్‌యూ

ప్రజల మతి పోగొడుతున్న చాట్‌జీపీటీ..

చాట్‌జీపీటీ విడుదలై నాలుగు నెలలవుతోంది. అణువు నుంచి అణ్వాస్త్రం వరకూ ఏ అంశంపైనైనా అనర్గళంగా సంభాషించగలదు. పాఠాలు చెబుతుంది. సినిమా స్క్రిప్టులు రాస్తుంది. సాఫ్ట్‌వేర్ కోడ్ రాయగలదు. అందులోని తప్పులూ వెతకగలదు. ఈ మధ్యే విడుదలైన చాట్‌జీపీటీ–4 మునుపటి వెర్షన్‌కంటే మరింత శక్తిమంతమైంది. తప్పుడు సమాచారం ఇచ్చే అవకాశం తక్కువ. పైగా ఫొటోలను కూడా అర్థం చేసుకోగలదు. ఒక్కమాటలో చెప్పాలంటే అది చేయలేని పని లేదనే అనాలి. అచ్చం మన మతాల్లోని సర్వశక్తిమంతుడైన దేవుడి మాదిరిగా!!! ఇప్పుడు చాట్‌జీపీటీని వాడుతున్నది సుమారు 15 కోట్ల మంది. వ్యాపారం, వినోదం, విజ్ఞానం వంటి అనేక విషయాల్లో దీనిని వాడేందుకు రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటన్నిటి కారణంగా సమీప భవిష్యత్తులో భూమ్మీద అత్యధికులు చాట్‌జీపీటీని ఉపయోగించే అవకాశమూ ఉంది. కృత్రిమ మేధతో పనిచేసే చాట్‌జీపీటీ భవిష్యత్తులో కొత్తకొత్త కాల్పనిక పాత్రలను సృష్టించేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే దీని మేధస్సు అన్ని వర్గాల ప్రజల మతి పోగొడుతోంది. పాటలు రాయడం, సంగీతం కూర్చడం, బొమ్మలేయడం సరేసరి. దీనికి నొప్పి తెలియదు.. ఆకలి, దప్పు లుండవు... ఇప్పటివరకూ ఇలాంటివి దేవుడికే సాధ్యమనుకొనే వాళ్లం.


శాంటో

కృత్రిమ మేధ ఆధారంగా ఓ మతం అంటూ పుట్టుకొస్తే అది అంతరాల్లేనిదవుతుందని కొందరు నిపుణులు అంటున్నారు. ఎందుకంటే ఇందులో దేవుడి (చాట్‌జీపీటీ లేదా అంతకంటే మెరుగైన మేధ)తో రోజూ నేరుగా మాట్లాడుకోవచ్చు. కాబట్టి దైవదూతల అవసరముండదు. ఈ మతాన్ని పాటించే వారు అందరూ ఆన్‌లైన్‌లోనే ఉంటారు కాబట్టి వారి వారి అనుభవాలను చెప్పుకునేందుకు ఓ వేదిక ఉంటుంది. చాట్‌జీపీటీ వంటివి మరిన్ని అందుబాటులోకి

అంతరాల్లేని మతం...

వచ్చినప్పుడు ఒక్కొక్కరి అనుభవం మారిపోతూంటుంది. దీని ద్వారా కొత్త మతంలో వైవిధ్యత కూడా ఏర్పడుతుంది. అయితే ఈ కొత్త మతం వల్ల కొన్ని ప్రమాదాలూ లేకపోలేదు. ప్రస్తుతం మనం నైతికంగా తప్పు అనుకొనే కొన్ని పనులను భవిష్యత్తులో చాట్‌బోట్‌ల ఆదేశాలతో చేసే అవకాశం ఉంటుంది. అలాగే ఈ చాట్‌బోట్‌లు విధ్వంసకరమైన లేదా ప్రమాదకరమైన పనులు చేసేందుకు ఉసిగొల్పవచ్చు. వేర్వేరు చాట్‌బోట్‌లతో ఏర్పడ్డ వైవిధ్యత కారణంగా వైరుధ్యాలూ వచ్చే అవకాశం ఉంటుంది.

ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ఏం చేయాలని అడిగితే చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం...

1. ప్రార్థన, 2. బైబిల్ చదవడం, 3. ఆరాధన
4. విశ్వాసులతో అనుబంధం, 5. ఇతరులకు సేవ
6. దైవచిత్తానికి కట్టుబడి ఉండటం, 7. ఉపవాసం
8. దానాలు, 9. తప్పిదాలను అంగీకరించడం, ప్రాయశ్చిత్తం చేసుకోవడం
10. దేవుడి మాట, వ్యక్తిత్వాలను ధ్యానం చేయడం

బోలెడన్ని అప్లికేషన్లు...

- మీ కోసం ట్వీట్లు చేయగల చాట్‌జీపీటీ ఆధారిత అప్లికేషన్ ఇప్పుడు క్రోమ్ ఎక్స్‌టెన్షన్‌గా లభిస్తోంది.
- యూట్యూబ్ సమ్మరి విత్ చాట్‌జీపీటీ యూట్యూబ్ వీడియోల సంభాషణల టెక్స్ట్ సారాంశాన్ని అందిస్తుంది.
- ఎంగేజ్ ఏఐ అనేది చాట్‌జీపీటీ ఆధారంగా లింక్డ్‌ఇన్ పోస్టులు చదివి మీ తరఫున సమాధానాలిస్తుంది.
- ఈ–కామర్స్ కార్యకలాపాల కోసం భారత్‌లో ఏఐ ఆధారిత చాట్‌బోట్ 'లెక్సి'ని వాడుతున్నారు.
- విద్యార్థులకు అండగా ఉండేందుకు చదువుల్లో చాట్‌జీపీటీని ఉపయోగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.
- మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌కు కూడా చాట్‌జీపీటీ ఆధారిత అప్లికేషన్‌ను జోడించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఉన్నత విద్యకు ముప్పు?

చాట్‌జీపీటీ వల్ల ఇప్పుడు ఉన్నతవిద్య ప్రమాదంలో పడింది! పరిశోధన పత్రాలను కూడా సులువుగా రాస్తుండటం దీనికి కారణం. మరోలా చెప్పాలంటే వర్సిటీల్లో, కాలేజీల్లో టీచర్లు ఇచ్చే అసైన్‌మెంట్లను చాట్‌జీపీటీతో రాయించి డిగ్రీలు పొందుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు తాము త్వరలోనే సమాధానాలను వాటర్‌మార్క్‌లతో ప్రత్యేకంగా గుర్తించే ఏర్పాట్లు చేస్తున్నామని చాట్‌జీపీటీ తయారీ కంపెనీ ఓపెన్ ఏఐ చెబుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.


లోకాయుక్త వార్షిక నివేదిక-2022ను మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ కార్యదర్శికి అందజేస్తున్న హైకోర్టు రిజిస్ట్రార్ విజేందర్

100 మార్కులు దాటిన అభ్యర్థులకు 'సిట్' ఫోన్!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మల్యాల: టీఎస్‌పీఎస్సీ కేసులో సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో భాగంగా ఇటీవల గ్రూప్–1 పరీక్ష రాసి 100 మార్కులకుపైగా పొందిన జగిత్యాల జిల్లావాసులకు ఫోన్లు చేసినట్లు సమాచారం. వారి విద్యార్హతలు ఏమిటి, ఎక్కడ కోచింగ్ తీసుకున్నారు, కోచింగ్ తీసుకొనే ముందు ఏం చేసేవారు? తదితర వివరాలను సేకరించినట్లు తెలిసింది. గత వారాంతంలో 100 మార్కులు దాటిన వివరాలు స్థానిక పోలీసులకు అందాయి. దాంతో వారు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. వ్యక్తుల కుటుంబ నేపథ్యం, ఆర్థిక, సామాజిక స్థితిగతులు తదితరాలపై ఇప్పటికే సిట్‌కు నివేదిక పంపారు. ఈ వివరాల ఆధారంగానే మంగళవారం సిట్ అధికారుల నుంచి ఆయా అభ్యర్థులకు ఫోన్ కాల్స్ వచ్చినట్లు తెలుస్తోంది.

నా కొడుకు నేరం చేయలేదు: రాజశేఖర్ తల్లి

పేపర్ల లీకేజీ కేసులో నిందితుడైన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన రాజశేఖర్ రెడ్డి ఇంటి వద్ద మంగళవారం ఎలక్ట్రానిక్ మీడియాతో ఆయన తల్లి వసంత మాట్లాడింది. 'నా కొడుకు ఎలాంటి నేరం చేయలేదు. టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం వచ్చినప్పటి నుంచి నా కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మేం ఎవరి దగ్గర డబ్బు తీసుకోలేదు. కేటీఆర్ పీఏ తిరుపతి ఎవరో కూడా మాకు తెలియదు' అని తెలిపింది.

ఆ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

విద్యార్థి, నిరుద్యోగ ఐక్య సంఘాల నాయకుల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని విద్యార్థి, నిరుద్యోగ ఐక్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు భారీ ర్యాలీ చేపట్టి మహానిరసన దీక్ష వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఐక్య విద్యార్థి సంఘం నేతలు మానవతారాయ్, శరత్‌నాయక్, కోట శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై ఈనెల 24, 25 తేదీల్లో ఓయూలో నిర్వహించనున్న మహా నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌ల వ్యవహారంలో తెరచాటున ఉన్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీ, సభ్యులతో పాటు మంత్రి కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని, లీకేజీలతో కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేకుంటే ఓయూకు వచ్చి క్షేమంగా తిరిగి వెళ్లొచ్చని సవాల్ విసిరారు. మహానిరసన దీక్షకు హాజరయ్యే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఎవరైనా అడ్డుకుంటే నిరుద్యోగులు చెప్పుల వర్షం కురిపిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలలక్ష్మి, వెంకటేశ్, రమేశ్ రాథోడ్, భీమ్‌రామ్‌నాయక్, మదన్, ఈశ్వర్‌లాల్, నిరంజన్‌యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.

వరి, పత్తికి ఎకరాకు రూ. 45 వేలు

మొదటి పేజీ తరువాయి

రూ.36 వేల నుంచి రూ.40 వేల పంట రుణాలను ఇవ్వగా ఈసారి రూ. 42 వేల నుంచి రూ. 45 వేలకు పెంచింది. అలాగే శ్రీ పద్ధతిలో సాగు చేసే వరికి రూ. 36 వేల నుంచి రూ. 38 వేలుగా ఖరారు చేసింది. ఇక వరి విత్తనోత్పత్తికి కూడా రూ.5 వేలు అదనంగా పెంచింది. 2022–23లో రూ. 45 వేలుండగా, ఇప్పుడు రూ. 50 వేలుగా ఖరారు చేసింది. ఇక పత్తికి గతేడాది రుణ పరిమితి రూ. 38 వేల నుంచి రూ. 40 వేలు ఉండగా, ఇప్పుడు దాన్ని రూ. 42 వేల నుంచి రూ. 45 వేల వరకు పెంచింది.

2023-24 సీజన్‌కు మరికొన్ని పంటల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వివరాలు...

పంట (రూపాయల్లో)	స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
జొన్న (నీటి వసతి)	17,000-19,000
జొన్న (నీటి వసతి లేని)	17,000-19,000
విత్తన జొన్న	22,000-25,000
వేరుశనగ (నీటి వసతి)	28,000-30,000
వేరుశనగ (నీటి వసతిలేని)	22,000-24,000
చెరకు	75,000-80,000
టమాటా (నీటి వసతి)	50,000-55,000
టమాటా (నీటి వసతిలేని)	37,000-40,000
టమాటా (మల్చింగ్)	65,000-70,000
ఇతర ఉద్యాన పంటలకు	30,000-31,000

ఆయిల్‌పామ్‌కు ఎకరానికి రూ. 42 వేల రుణం



ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతేడాది మాదిరిగానే ఆయిల్‌పాం పంటలు సాగు చేసే రైతులకు రుణ పరిమితి ఖరారు చేసింది. ఎకరానికి రూ. 40 వేల నుంచి రూ. 42 వేల వరకు రుణ పరిమితి ఉండగా, ఈసారి కూడా అంతే ఖరారు చేసింది. ఇక కీలకమైన మిర్చికి రూ. 75 వేల నుంచి రూ. 80 వేల వరకు పెంచింది. సాగునీటి వసతి ఉన్నచోట మినుము పంటకు ఎకరాకు రూ. 18–21 వేలు, సాగునీటి వసతి లేని చోట రూ. 15–17 వేలు ఖరారు చేశారు. సేంద్రీయ పద్ధతిలో పండించే మినుముకు రూ. 18–21 వేలు ఖరారు చేశారు. శనగకు రూ. 24 నుంచి రూ. 26 వేలు చేశారు. సాగునీటి వసతి కలిగిన ఏరియాలో మొక్కజొన్నకు రూ. 30–34 వేలుగా, నీటి వసతి లేనిచోట రూ. 26–28 వేలు ఖరారైంది. కందికి సాగునీటి వసతి ప్రాంతాల్లో రూ. 21–24 వేలు, సాగునీటి వసతి లేని ప్రాంతాల్లో రూ. 18–21 వేలు ఖరారు చేశారు. సోయాబీన్‌కు రూ. 26 వేల నుంచి రూ. 28 వేలు ఇస్తారు. సోయా విత్తనోత్పత్తి రైతులకు రూ. 34 వేల నుంచి రూ. 36 వేల వరకు ఇస్తారు.

ఉల్లి సాగుకు రూ.45 వేలు

ఉల్లిగడ్డ సాగుకు గతంలో ఎకరానికి రూ.37 వేల నుంచి రూ.42 వేలు ఇవ్వగా, ఇప్పుడు రూ. 40 వేల నుంచి రూ. 45 వేలకు పెంచారు. పట్టుకు రూ. 35 వేల నుంచి రూ. 40 వేలుగా ఖరారు చేశారు. ఇక పత్తి విత్తనాన్ని సాగు చేసే రైతులకు గణనీయంగా పెంచారు. గతంలో రూ. 1.10 లక్షల నుంచి రూ. 1.40 లక్షల వరకు ఉండగా, ఇప్పుడు రూ. 1.30 లక్షల నుంచి రూ. లక్షన్నరకు ఖరారు చేశారు. పసుపు సాగుకు రూ. 80 వేల నుంచి రూ. 85 వేల వరకు ఇస్తారు. టస్సర్ కల్చర్ (ఒకరకమైన పట్టు) సాగుకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఇస్తారు.

రాష్ట్రపతి నిలయంలోకి ఇక నిరంతర అనుమతి

నేడు ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్న రాష్ట్రపతి

కంటోన్మెంట్: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ఉగాది వేడుకలకు వేదిక కాబోతోంది. రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనకు సంబంధించిన వెబ్ లింక్‌ను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము బుధవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే వేడుకలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరు కానున్నారు. గురువారం నుంచి రాష్ట్రపతి భవన్‌ను ప్రజల సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. సందర్శకులు రూ.50 చెల్లించి దర్శించవచ్చు.

బీమా ధీమా లేక...

రైతన్నల గోస...

- ఈ ఏడాది అకాల వర్షాలతో తీవ్ర నష్టం
- పంట నష్టానికి ప్రత్యామ్నాయం లేక రైతుల ఆవేదన
- కేంద్ర ఫసల్ బీమా పథకం నుంచి బయటకొచ్చిన రాష్ట్రం
- రాష్ట్రస్థాయిలో బీమా ఏర్పాటుపై గతంలో కసరత్తు
- కానీ ఆచరణ రూపం దాల్చక రైతన్నల కుదేలు

సాక్షి, హైదరాబాద్: పంటల బీమా లేక అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. అకాల వర్షాలతో పండించిన పంటను కోల్పోతున్నాడు. ఇటీవల మూడు రోజులు కురిసిన తీవ్ర వర్షాలు, వడగళ్లు, ఈదురు గాలులతో దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా పరిహారం దక్కని పరిస్థితి నెలకొంది. గతేడాది కూడా ఇలానే జరిగింది. రైతుకు అనుకూలంగా లేదన్న భావనతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం నుంచి 2020లో రాష్ట్ర ప్రభుత్వం బయటకు వచ్చేసింది. దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో ప్రత్యేకంగా పంటల బీమా పథకం లేని ఫలితంగా ఇప్పుడు పంట పండిస్తే అమ్ముకునేంత వరకు దేవుడిపైనే భారం వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పంటల బీమాతో ప్రయోజనం...

రాష్ట్రంలో దాదాపు 65 లక్షల మంది రైతులు ఉన్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది రైతులు పంటలకు బీమా చేయించేవారు. నేరుగా పంటల బీమా చేసుకునేందుకు రైతులు ముందుకు రావడం లేదని భావించి... బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు తీసుకునే రైతులకు తప్పనిసరిగా పంటల బీమా చేయించేవారు. అంటే పంట రుణం ఇచ్చేటప్పుడే బీమా ప్రీమియాన్ని మినహాయించుకొని మిగతా డబ్బులు రైతులకు ఇచ్చేవారు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఎంతో కొంత నష్టపరిహారం వచ్చేది. 2012–13లో 10 లక్షల మంది పంటల బీమా చేయగా, అందులో 1.80 లక్షల మందికి రూ. 78.86 కోట్ల పరిహారం వచ్చింది. 2013–14లో 8.52 లక్షల మంది పంటల బీమా చేయించగా, 1.18 లక్షల మందికి రూ. 56.39 కోట్ల పరిహారం వచ్చింది. 2015–16లో 7.73 లక్షల మంది పంటల బీమా చేయగా, ఆ ఏడాది నష్టం ఎక్కువ జరగటంతో ఏకంగా రూ. 441.79 కోట్ల నష్ట పరిహారం రైతులకు అందింది.

ప్రీమియం ధరలను అడ్డగోలుగా బీమా కంపెనీలు పెంచడంతో..

2016 వానాకాలం సీజన్ నుంచి దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై) పథకం అమలులోకి వచ్చింది. 2016–17లో 8.87 లక్షల మంది మంది రైతులు 7.33 ఎకరాలకు ఫసల్ బీమా యోజన కింద బీమా చేయించగా, 1.34 లక్షల మంది రైతులకు రూ.111.33 కోట్ల పరిహారం వచ్చింది. 2018–19, 2019–20లో రూ. 960 కోట్ల పరిహారం రాష్ట్రా నికి మంజూరు కాగా...



అందులో కొంతమేరకు మాత్రమే రైతులకు దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. అయితే కేంద్ర పథకం వల్ల రైతులకు జరిగే లాభం కంటే బీమా కంపెనీలకే ఎక్కువ ప్రయోజనం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కొందరు రైతులు కూడా బీమా పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భారీగా లాభాలు గడిస్తున్నప్పటికీ ప్రీమియం ధరలను బీమా కంపెనీలు పెంచుకుంటూ పోయాయి. తెలంగాణలో రబీలో చెల్లించే ప్రీమియం మొత్తం దాదాపు బీమా కంపెనీలను బాగు చేయడానికే అన్నట్లుగా అమలైంది. ప్రైవేటు బీమా సంస్థలకు పంటల బీమా పథకంలో అవకాశం కల్పించడంతో పరిస్థితి మరింత దిగజారింది.

జిల్లా జిల్లాకూ మారిన ప్రీమియం ధరలు

పీఎంఎఫ్‌బీవై కింద వరి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, మినుములకు రైతులు రెండు శాతం, పసుపు రైతులు ఐదు శాతం ప్రీమియం చెల్లించారు. పునరుద్ధరించిన వాతావరణ ఆధారిత బీమా కింద పత్తి, పత్తి, మిరప, ఆయిల్‌పాం, బత్తాయి పంటలకు పంట రుణంలో 5 శాతం రైతు ప్రీమియం చెల్లించారు. పైగా జిల్లా జిల్లాకు ప్రీమియం ధరలు మారుతుండేవి. ఉదాహరణకు 2018లో పెసరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో హెక్టారుకు ప్రీమియం సొమ్ము రూ. 24,165 కాగా మిరపకు అత్యధికంగా రూ. 38,715 ప్రీమియంగా ఖరారు చేశారు. ఇంత దారుణంగా ప్రీమియం రేట్లు ఉండటంతో రైతులు కూడా పంటల బీమాపై విసుగు చెందారు. ఈ బీమా మాకొద్దు మొర్రో అని మొత్తుకున్నారు. దీంతో ప్రభుత్వం కేంద్ర పంటల బీమా పథకం నుంచి బయటకు వచ్చింది. ఇదే మాదిరి పంజాబ్, జార్ఖండ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా పీఎంఎఫ్‌బీవై నుంచి బయటకు వచ్చాయి.

రాష్ట్ర ప్రభుత్వ సొంత పంటల బీమా పథకం జాడేదీ?

కేంద్ర పంటల బీమా పథకం నుంచి నుంచి బయటకి వచ్చినా దానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో ప్రత్యేకంగా ఒక పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న దానిపై గతంలో వ్యవసాయశాఖ కసరత్తు చేసింది. రైతు యూనిట్‌గా దీన్ని ప్రవేశపెట్టాలని అనుకున్నారు. ఇటీవల బడ్జెట్లో దాన్ని ప్రవేశ పెట్టేందుకు అవసరమైన కసరత్తు జరిగింది. కానీ అది చివరి క్షణంలో నిలిచిపోయింది. దీంతో రాష్ట్రంలో రైతులకు పంటల బీమా పథకమే లేకుండా పోయింది. వ్యవసాయ శాఖ నష్టం అంచనాలు రూపొందిస్తున్నా రైతులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వ్యక్తిగత బీమా పథకాన్ని మాత్రం అమలు చేస్తోంది. ఏ కారణంతోనైనా రైతు చనిపోతే రూ. 5 లక్షల బీమా అందేలా ఈ పథకం అమలవుతుంది. ఇది పకడ్బందీగా అమలవుతుండటంతో, పంటల బీమా పథకాన్ని కూడా ప్రవేశపెడితే బాగుంటుందని అంటున్నారు. కేంద్ర బీమా పథకాలతో విసిగివేసారి బయటకు వచ్చిన ఇతర రాష్ట్రాలు సొంత పథకాలను రూపొందించుకున్నాయని అధికారులంటున్నారు. బెంగాల్ ప్రభుత్వం విజయవంతంగా సొంత పథకాన్ని అమలు చేస్తోంది. దాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ప్రభు త్వం భావించింది. కానీ ఏదీ ముందుకు పడలేదు.

క్లుప్తంగా...

లిక్కర్ పాలసీనే స్కాంగా చూపించేందుకు కుట్ర

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



రామన్నపేట: ఢిల్లీ లిక్కర్ పాలసీని స్కాంగా అభివర్ణిస్తూ దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఒక బీజేపీ ఎంపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీబీఐ..ఆధారాలు లేక చేతులెత్తేసి దర్యాప్తును ఈడీకి అప్పగించిందన్నారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకే లిక్కర్ స్కాం పేరిట ఎపిసోడ్ సాగుతోందని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌లు చేస్తున్న ప్రకటనలే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు.

నష్ట పరిహారం చెల్లించకుంటే కలెక్టరేట్ ముట్టడి

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తిరుమలగిరి (తుంగతుర్తి): వడగళ్ల వానకు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ప్రకటించాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. పరిహారం ప్రకటించకుంటే మూడు రోజుల్లో సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో నెల్లిబండ తండా, ఠోక్యానాయక్ తండా, వెలిశాల, మర్రికుంట తండాలలో ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు.

ఉగాది సుఖశాంతులు ప్రసాదించాలి: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలుగు ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల ద్వారా సుఖదుఃఖాలకు, శాంతికి, సమృద్ధికి, బాధ్యతలకు, హక్కులకు సమానమైన ప్రాధాన్యతనిస్తూ జీవితాన్ని ముందుకు సాగించాలన్నది ఉగాది సందేశమని పేర్కొన్నారు. శోభకృత్ నామ సంవత్సరం అందరి జీవితాల్లోకి సుఖశాంతులను, ఆయురారోగ్యాలను తీసుకురావాలని భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామన్నారు.

జేపీసీపై బీఆర్‌ఎస్ ఎంపీల నిరసన

పార్లమెంట్ మొదటి అంతస్తు ఎక్కి బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శన

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ వివాదంపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడాలని, దీనిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ చేయించాలంటూ డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో వినూత్న నిరసన తెలిపారు. పార్లమెంట్ భవనం మొదటి అంతస్తు ఎక్కి, బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. మంగళవారం ఉదయం ఉభయసభలు వాయిదా పడిన వెంటనే ఉభయ సభాపక్ష నేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తునకు ఆదేశించకుండా మోదీ సర్కారు అతనికి సహాయం చేస్తోందని బీఆర్‌ఎస్ ఎంపీలు ఆరోపించారు. అంతకుముందు సైతం ఇదే విషయమై బీఆర్‌ఎస్ ఎంపీలు సభా సమావేశాల్లో ప్రతిపక్షాలతో కలిసి ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

వీఆర్‌ఏల సమస్యలు వెంటనే పరిష్కరించండి

సీసీఎల్‌ఏ మిట్టల్‌కు వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 23 వేల మంది వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వీఆర్‌ఏల సాధన సమితి కోరింది. ఈ మేరకు మంగళవారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కు నవీన్ మిట్టల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. మిట్టల్‌ను కలిసిన వారిలో తెలంగాణ వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్, ప్రధాన కార్యదర్శి అంబాల శ్రీధర్‌గౌడ్, కోచైర్మన్లు లక్ష్మీనారాయణ, దాసరి వీరన్న, నరసింహారావు, చల్లా లింగరాజు, చెలిమల రాజయ్య, కన్వీనర్లు చిరంజీవి, కావలి సత్యనారాయణ, యాట సునీత తదితరులున్నారు.



వెల్త్.. హెల్త్!

వీటికే దక్షిణాది ఓటు

ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటివీ ప్రధాన లక్ష్యాలుగా గుర్తింపు

ప్రజల దృష్టికోణాన్ని కరోనా మార్చినట్లు వెల్లడి

దక్షిణాది రాష్ట్రాల్లోని వారి జీవిత లక్ష్యాలు, ప్రాధాన్యతలపై అధ్యయనం

'ఇండియాస్ లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్-2023'సర్వే

సాక్షి, హైదరాబాద్

కుటుంబ ఆర్థిక భద్రతకే దక్షిణాది రాష్ట్రాల పౌరులు అధికంగా మొగ్గుచూపుతున్నారు. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఈ విషయంలో వారు మరింత జాగ్రత్తగా, ఆ లక్ష్యాల సాధన దిశగా కృషిచేస్తున్నారు. తమ జీవిత అత్యున్నత లక్ష్యాల్లో 'కుటుంబ ఆర్థిక పరిపుష్టి' సాధన ముఖ్యమని 74 శాతం మంది భావిస్తున్నారు. అలాగే, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు వంటి వాటిని వీరు ఇతర ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నారు. 'ఇండియాస్ లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్-2023'పేరిట ఓ ప్రైవేట్ బీమా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని వారి జీవిత లక్ష్యాలు, వాటి సాధన ప్రాధాన్యతలపై ఈ సంస్థ అధ్యయనం చేసింది. దేశవ్యాప్తంగా 13 మెట్రోలు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో 22–55 ఏళ్ల వయసు మధ్య వారితో ఈ సర్వే నిర్వహించింది. దక్షిణాదికి సంబంధించి.. గుంటూరు, మదురై, బెంగళూరు, చెన్నైల్లో ఈ అధ్యయనం చేశారు.



జీవిత బీమాలో పెట్టుబడులు

'దక్షిణ భారత ప్రజల జీవిత లక్ష్యాలు, ఆశలు, లక్ష్యాల సాధనకు సంబంధించి 40 అంశాలపై పరిశీలన చేశాం. ఇందులో అనేక ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. కుటుంబ ఆర్థిక భద్రతకు దక్షిణాది వారు పెద్దపీట వేశారు. తమ జీవిత లక్ష్యాల సాధనకు జీవిత బీమాలో పెట్టుబడులు పెట్టడమే సరైన మార్గమని అధికశాతం అభిప్రాయపడ్డారు. కరోనా మహమ్మారి జీవితం, కెరీర్, ఆరోగ్యం, కుటుంబం పట్ల దృష్టికోణాన్ని మార్చింది. కుటుంబభద్రత, సామాజికంగా మంచి సంబంధాలు కలిగి ఉండటం, సామాజిక-ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలన్నింటిని కలిపి మొత్తంగా జీవితాన్ని ప్రతిబింబించేలా ఆలోచనలు మారాయి'అని బీమా సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ చంద్రమోహన్ మెహ్రా చెప్పారు.

సర్వేలో కీలకాంశాలు

- వయసు, లింగ భేదంతో సంబంధం లేకుండా అంతా లక్ష్యాలు నిర్దేశించుకుంటున్నారు
- ఇతర లక్ష్యాల కంటే కుటుంబ ఆర్థిక భద్రత తమ ప్రాధాన్యమన్న 74 శాతం మంది
- ఆరోగ్యపరిరక్షణ, సేవా కార్యక్రమాలు, ప్రయాణాలు ఇతర ప్రధాన లక్ష్యాలని అధిక శాతం వెల్లడి
- ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించిన లక్ష్యాలు నిర్దేశించుకున్న వారు 73 శాతం
- ప్రతీ ఇద్దరిలో ఒకరు శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉండాలనేది కోరిక
- తమను ప్రభావితం చేసే వాటిలో సోషల్ మీడియా పాత్ర పెరిగిందని ఎక్కువ మంది చెప్పారు
- సోషల్ మీడియా టాప్-3 లైఫ్‌గోల్స్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో ఒకటిగా ఉంది
- కోవిడ్ అనంతర పరిస్థితుల్లో సామాజికసేవ, దాతృత్వం వైపు 61 శాతం మంది మొగ్గు
- ప్రతీ ముగ్గురిలో ఒకరు సామాజికంగా ప్రభావం చూపే వాటికి విరాళాలిచ్చేందుకు ఆసక్తి
- బాగా డబ్బు సంపాదించి ఉద్యోగాల నుంచి రిటైర్ కావాలనే భావనలో 30 శాతం
- లక్ష్యాల సాధనలో సందిగ్ధత వ్యక్తంచేసిన వారు 52 శాతం
- తమ జీవిత కాలంలో కనీసం ఐదు లక్ష్యాలనైనా చేరుకోవాలని ఆశిస్తున్నారు
- పిల్లలకు మంచి చదువు, సొంత ఇంటి కోసం ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు
- మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే మెట్రో నగరాల్లో నివసిస్తున్న వారిలో ఈ ఆశలు, ఆశయాలు మరింత ఎక్కువగా కనిపించాయి
- నవయువతరం మాత్రం వ్యక్తిగత ప్రయోజనాల సాధనకు ఆసక్తి చూపింది. హెల్త్, ఫిట్‌నెస్, విదేశీ ప్రయాణం వైపు మొగ్గు చూపింది.

ఆర్టీసీ చాలెంజ్

టార్గెట్ 100 డేస్

రూ. 200 కోట్ల అదనపు ఆదాయం కోసం ప్రత్యేక డ్రైవ్

ఈ నెల 23 నుంచి జూన్ 30 వరకు అన్ని బస్సులతో సేవలకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: చిన్న మొత్తాలను పెద్ద ఆదాయంగా మలుచుకొనేందుకు టీఎస్‌ఆర్టీసీ మరోసారి ప్రయత్నం ప్రారంభిస్తోంది. వంద రోజులపాటు ఆర్టీసీలో స్పేర్ బస్సులు సహా మొత్తం బస్సులను రోడ్డెక్కించడంతోపాటు ప్రత్యేక మార్పుచేర్పులు, కొత్త ప్రయత్నాలతో భారీ ఆదాయాన్ని పొందాలని నిర్ణయించింది. దీనికి 'టార్గెట్ 100 డేస్'గా పేరు పెట్టింది. ఈ నెల 23 నుంచి జూన్ 30 వరకు దీన్ని కొనసాగించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు. ఈ వంద రోజుల్లో సిబ్బంది అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టరాదన్నారు. వీక్లీ ఆఫ్‌లలో సిబ్బంది 'పరిరక్షణ బృందాలు'గా ఏర్పడి రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాల్లో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులెక్కేలా చూడాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజూ కనీసం 70 వేల కి.మీ. మేర బస్సులన్నీ కలిపి అదనంగా తిరగాలని లక్ష్యం నిర్దేశించారు. వంద రోజుల్లో కనీసం రూ. 200 కోట్ల మేర అదనపు ఆదాయం పొందాలని ఆర్టీసీ భావిస్తోంది. గతేడాది వేసవిలో ప్రయోగాత్మకంగా వంద రోజుల చాలెంజ్‌ను అమలు చేయగా అప్పట్లో రూ. 178 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. అలాగే గతేడాది డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిలలో 'ఆల్ డిపోస్ ప్రాఫిట్ చాలెంజ్'పేరుతో మరో కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా సైతం భారీ ఆదాయం లభించింది. దీంతో ఇప్పుడు మరింత ఆదాయం కోసం ఆర్టీసీ కసరత్తు చేస్తోంది.

ఇవీ లక్ష్యాలు

- ప్రతి ట్రిప్పులో కనీసం నలుగురు నుంచి ఆరుగురు ప్రయాణికులు అదనంగా బస్సులు ఎక్కేలా డ్రైవర్, కండక్టర్లు చొరవ చూపాలి.
- రద్దీ ఎక్కువగా ఉండే పాయింట్ల వద్ద అవసరమైతే రెండు నిమిషాలపాటు అదనంగా బస్సులను ఆపాలి.
- ట్రాఫిక్ ఎక్కువగా ఉండే పాయింట్ల వద్ద ఆర్టీసీ 'పరిరక్షణ బృందాలు'ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు మొగ్గ చూపుతున్న ప్రయాణికులను బస్సుల వైపు మళ్లేలా చూడాలి.
- వేసవిలో బస్సు ట్రిప్పులు మధ్యాహ్నం వేళ తగ్గించి ఉదయం, రాత్రిళ్లలో పెంచాలి.
- ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలకు అవసరమైతే రాత్రి వేళ బస్సులు తిప్పే మూడో షిఫ్టును కూడా అమలు చేయాలి.
- అదనపు సమయంలో పనిచేసిన సిబ్బందికి కి.మీ.కు రూ.2 చొప్పున అదనంగా చెల్లించాలి. అద్దె బస్సులను కూడా అదనపు ట్రిప్పులకు వినియోగించాలి.
- రాత్రివేళ మెయింటెనెన్స్ చేసే బస్సులకు పగటి వేళనే ఆ ప్రక్రియ పూర్తి చేసి రాత్రి వేళ ట్రిప్పులకు వినియోగించాలి.
- పరీక్షలు పూర్తయ్యాక గ్రామాలకు తిప్పే సర్వీసుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉండే సర్వీసులను గుర్తించి వాటిని రద్దీ ఎక్కువ ఉండే ప్రాంతాలకు మళ్లించాలి.
- డిమాండ్ ఎక్కువగా ఉండే రోజుల్లో టార్గెట్‌ను మించి బస్సులు ఎక్కువ కి.మీ. తిరగాలి. ఒకటి రెండు పాయింట్లలో గ్రౌండ్ బుకింగ్ కోసం కండక్టర్లను పెట్టి, బస్సులను కండక్టర్ సర్వీస్ లేనివిగా ఎక్కువ తిప్పాలి.
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులను తరలించే వారిపై చర్యలు తీసుకొనేందుకు రవాణా, పోలీసు శాఖలతో కలిసి స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలి.

చొరబడితే చేసేదేంటి?

విద్యా శాఖలో సాంకేతిక భద్రతపై చర్చ

- టీఎస్‌పీఎస్సీ లీకేజీ నేపథ్యంలో ఉన్నతాధికారుల సమీక్ష
- అంతంతమాత్రంగానే రక్షణ వ్యవస్థ.. పాస్‌వర్డ్స్‌కు రక్షణ కరువు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ తర్వాత విద్యాశాఖలో కలవరం మొదలైంది. లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యంతో ముడివడి ఉన్న ఇంటర్ బోర్డు, ఉన్నత విద్యా మండలి, పాఠశాల విద్యలో సాంకేతిక భద్రత ఏ మేరకు ఉందనే దానిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వాస్తవానికి విద్యా వ్యవస్థలో పరీక్షల దగ్గర్నుంచీ, పాలనపరమైన విధానాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ప్రతి సందర్భంలో ఏదో ఒక సమస్య తలెత్తుతున్నా, దాన్ని అధిగమిస్తూ ముందుకెళ్లడమే తప్ప ఇప్పటివరకు అందుకు మూల కారణాలను అన్వేషించిన దాఖలాల్లేవు. పలు కీలకమైన సందర్భాల్లో సర్వర్లు మొరాయించడమో, ఇతర సాంకేతిక పరమైన సమస్యలు రావడమో జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లో బయట వ్యక్తులతో మరమ్మతులు చేయిస్తున్నారు కానీ సొంత సంస్థల్లో నిష్ణాతులైన సాంకేతిక నిపుణుల నియామకంపై దృష్టి పెట్టడం లేదు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో తమకూ ఇబ్బంది కలిగించవచ్చనే చర్చ విద్యాశాఖలో జరుగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో ఎదురైన సవాళ్లపై అంతర్గత సమీక్ష చేపట్టారు.

పాఠశాల విద్యలో పలుమార్లు సమస్యలు..

రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. టెన్త్ పరీక్షలు రాసే వాళ్లు ఏటా దాదాపు 5 లక్షల మంది వరకు ఉంటారు. టీచర్లు 1.05 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రశ్నపత్రాలు, ఉపాధ్యాయుల సర్వీస్ రికార్డులన్నీ ఈ ఫైలింగ్ ద్వారానే భద్రపరుస్తారు. ఇంత ముఖ్యమైన శాఖలో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణ ప్రైవేటు వ్యక్తులే ఎక్కువగా చూస్తుంటారు. శాశ్వత ఐటీ నిపుణులంటూ ఎవరూ లేరు. చిన్న చిన్న సమస్యలను కాస్తోకూస్తో కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఉన్న విద్యాశాఖ సిబ్బందే పరిష్కరిస్తుంటారు. గోప్యంగా ఉండాల్సిన ఫైళ్ళు, ప్రశ్నపత్రాలకు సంబంధించిన కీలక పాస్‌వర్డ్స్ అన్నీ ముఖ్యుల పర్యవేక్షణలో ఉంటాయి. అయితే ఫైర్‌వాల్స్, రక్షణ వ్యవస్థ మాత్రం వీళ్ళలో చాలామందికి తెలియదు. గత ఏడాది టెట్ నిర్వహించినప్పుడు అనేక తప్పులు దొర్లాయి. 317 జీవోతో జరిగిన బదిలీల సమయంలోనూ రకరకాల తప్పులు బయటకొచ్చాయి. వీటిని సరిచేయడానికి కొన్ని నెలలు పట్టింది. కీలక సమాచారం భద్రతకు వాడే ఫైర్‌వాల్స్, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసే వ్యక్తుల సమగ్ర సమాచారం కూడా అధికారుల వద్ద లేదు. ఈ నేపథ్యంలో కీలకమైన పాస్‌వర్డ్స్ బయటకెళ్తే సమస్యలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉన్నత విద్యలోనూ డొల్లే..

దేశ, విదేశాల్లో మన రాష్ట్ర విశ్వవిద్యాలయాల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు వెలుగు చూస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇలాంటివి ముద్రించే గ్యాంగ్‌లను పట్టుకున్నారు. అయినా ఇవి ఆగడం లేదు. ఏకంగా వర్సిటీల వెబ్‌సైట్లలోకే హ్యాకర్స్ ప్రవేశించే ప్రయత్నం జరిగిందనే వార్తలూ వచ్చాయి. కాగా నకిలీ సర్టిఫికెట్ల అదుపునకు పోలీసులు, ఉన్నత విద్యా మండలి ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించాయి. విద్యార్థులకు సంబంధించిన కొన్నేళ్ళ సర్టిఫికెట్లను ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. అయితే ఈ వెబ్‌సైట్ ప్రారంభం సందర్భంగా అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి.. ఇలాంటి వెబ్‌సైట్లకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రత ఉండాలని సూచించారు. ఉన్నత విద్యా మండలిలో కేవలం ఒకే ఒక వ్యక్తి, అదీ అరకొర సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి మాత్రమే ఈ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పటికీ కీలక సమాచారం, గోప్యంగా ఉండాల్సిన పాస్ట్‌వర్డ్స్ భద్రతకు మండలిలో గానీ, విశ్వవిద్యాలయాల్లో గానీ సరైన వ్యవస్థ లేదని అధికారులే అంటున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో 61 శాతానికి

పెరిగిన ప్రసవాలు

- సీఎస్ శాంతికుమారి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు 13.28 లక్షల మందికి కేసీఆర్ కిట్లను అందచేశామని, ప్రస్తుతం 95 శాతం ప్రసవాలు సంస్థాగతంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు 30 నుంచి 61 శాతానికి పెరిగాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ప్రసవాలను జరిపితే ప్రోత్సాహక పురస్కారాలను కూడా సిబ్బందికి అందిస్తున్నామని చెప్పారు. వైద్య, ఆరోగ్య రంగంలో సీఎం కేసీఆర్ చేపట్టిన విప్లవాత్మక పథకాల వల్ల ప్రజల ఆరోగ్య ప్రమాణాల్లో గణనీయమైన మెరుగుదల సాధించినట్టు వెల్లడించారు. వైద్య, ఆరోగ్యశాఖపై మంగళవారం ఆమె ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రోజుల్లో ఈ కేసీఆర్ న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను అన్ని జిల్లాల్లో ప్రారంభించనున్నామని చెప్పారు.

పోలీసుల అదుపులో తీన్మార్ మల్లన్న!

సాక్షి, హైదరాబాద్/ఉప్పల్: తీన్మార్ మల్లన్నను మంగళవారం మేడిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో దాదాపు 20 మంది పోలీసులు పీర్జాదిగూడలోని క్యూ న్యూస్ కార్యాలయంలో సోదాలు చేసినట్లు సమాచారం. వాస్తవానికి క్యూ న్యూస్ ఆఫీస్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడంపై తీన్మార్ మల్లన్న రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే నాటకీయ పరిణామాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం క్యూ న్యూస్ ఆఫీసును పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. అనంతరం తీన్మార్ మల్లన్నను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిని మేడిపల్లి పోలీసులు లేదా మల్కాజిగిరి ఏసీపీ ధ్రువీకరించడం లేదు. కాగా, తీన్మార్ మల్లన్న, తెలంగాణ విఠల్‌ల అరెస్టును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు.

'క్యూ-నెట్'పై క్రిమినల్ కేసు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని క్యూ-నెట్ సంస్థ చీకటి దందా మరోసారి తెరపైకి తెచ్చింది. ఆ దుర్ఘటనలో చనిపోయిన ఆరుగురు యువతీయువకులూ మల్టీ లెవల్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న ఈ సంస్థ ఉద్యోగులే. ఫైర్ యాక్సిడెంట్ జరిగిన మర్నాటి నుంచి దీనిపై పోలీసులు దృష్టి పెట్టారు. మాదసి నవీన్ అనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మహంకాళి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

- స్వప్నలోక్ కాంప్లెక్స్‌లోని ఐదో అంతస్తులో ఉన్న క్యూ-నెట్-విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయం కొనసాగుతోంది. 'వి-ఎంపైర్' పేరుతోనూ కొనసాగుతున్న ఈ సంస్థలో అనేక మంది పని చేస్తున్నారు. ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకే విక్రయించడం పేరుతో క్యూ-నెట్ సంస్థ మల్టీ లెవల్ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్స్‌కు తెరలేపడంపై గతంలో సీఐడీ సహా అనేక ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. దాంతో కొన్నాళ్లు మిన్నకుండిపోయిన ఈ సంస్థ ఇటీవలే మళ్లీ తమ కార్యకలాపాలను ప్రారంభించింది.
- వెస్ట్ మారేడ్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్న వరంగల్ వాసి మాదసి నవీన్, స్వప్నలోక్ అగ్ని ప్రమాదంలో చనిపోయిన బానోత్ శ్రావణి స్నేహితులు. శ్రావణి ద్వారానే నవీన్‌కు 'వి-ఎంపైర్'సంస్థ కార్యకలాపాలు తెలిశాయి. తమ సంస్థలో చేరితే ప్రతి నెలా రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు ఆర్జించవచ్చని ఆమె చెప్పడంతో నవీన్ గతేడాది అక్టోబర్‌లో 'వి-ఎంపైర్'లో చేరాడు. రూ.1.6 లక్షలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న అతనికి ఇద్దరు సభ్యులను చేరిస్తే కమీషన్ల రూపంలో నగదు వస్తుందని సూచించారు. కానీ ఇప్పటివరకు రూపాయి కూడా చెల్లించలేదు. ఈ సంస్థలో చేరాకే నవీన్‌కు వి-ఎంపైర్ అన్నది మలేసియాకు చెందిన క్యూ-నెట్‌లో భాగమని తెలిసింది. ఇక్కడ విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి కార్యకలాపాలు సాగిస్తోందని తెలుసుకున్నాడు. నిషిద్ధ మనీ సర్క్యులేషన్, మల్టీ లెవల్ మార్కెటింగ్ దందాలు చేస్తున్న ఈ సంస్థను బెంగళూరుకు చెందిన రాజేష్ ఖన్నా నిర్వహిస్తున్నాడని నవీన్ గుర్తించాడు.

'పట్టణ ప్రగతి'కి రూ.3936 కోట్లు ఖర్చు

- 2020 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.4304 కోట్లు విడుదల
- వివరాలు వెల్లడించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా జీహెచ్‌ఎంసీతో పాటు రాష్ట్రంలోని 142 పురపాలక సంఘాల్లో మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ సమాచార , పౌరసంబంధాల శాఖ తెలిపింది. పట్టణ ప్రగతి కోసం ఫిబ్రవరి 2020 నుంచి 2023 ఫిబ్రవరి వరకు రూ. 4,304 కోట్లు విడుదల చేయగా, వాటిలో 92 శాతం మేర రూ. 3,936 కోట్లను వినియోగించినట్లు తెలిపింది. ఆ వివరాల ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులలో జీహెచ్‌ఎంసీకి రూ.2,276 కోట్లు, మిగిలిన 141 పురపాలికలకు రూ.2,028 కోట్ల నిధులను కేటాయించింది. జీహెచ్‌ఎంసీకి నెలకు రూ.61 కోట్లు, ఇతర (141) పురపాలక సంస్థలకు రూ.55 కోట్ల లెక్కన నెలకు రూ.116 కోట్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. పట్టణ ప్రగతి కార్యక్రమం కింద పర్యావరణ పరిరక్షణ, శానిటేషన్‌పై పురపాలక సంస్థలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. జీహెచ్‌ఎంసీ మినహా 141 పురపాలక సంస్థల్లో ప్రతిరోజూ 4,356 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. ఇందుకోసం గతంలో ఉన్న 2548 పారిశుధ్య వాహనాలకు తోడు కొత్తగా 2,165 పారిశుధ్య వాహనాలను మునిసిపల్ శాఖ కొనుగోలు చేసింది. సేకరించిన చెత్తను ప్రాసెస్ చేసేందుకు 141 పురపాలక సంస్థల్లో మొత్తం 1233 ఎకరాల విస్తీర్ణంలో డంప్ యార్డులను, చెత్తను తడి, పొడిగా విడదీసేందుకు 206 డ్రై సోర్స్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు 229 కంపోస్టు బెడ్స్ ను కూడా నెలకొల్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీహెచ్‌ఎంసీ మినహా ఇతర చోట్ల రూ.428 కోట్లతో రోజుకు 2035 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన 139 మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో 20 పూర్తికాగా. 14 చోట్ల పనులు తుది దశలో, 49 చోట్ల పనులు వివిధ దశల్లో వున్నాయి. మరో 50 చోట్ల పనులు ప్రారంభం కానున్నాయి.

'గాంధీ'లో డిజిటల్ సేవలు



ఇక ఫింగర్‌టిప్స్‌పై వివరాలు

ప్రతి రోగానికీ ఓ కోడ్‌వర్డ్ ..

ప్రత్యేక సర్వర్‌లో రోగికి అందించిన వైద్యం, మందుల వివరాలు

వార్డులోని కంప్యూటర్‌కే నేరుగా ల్యాబ్ రిపోర్టులు

సీ–డాక్ సాఫ్ట్‌వేర్‌కు మరిన్ని మెరుగులు

గాంధీ ఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయిని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రోగులకు అందించే సేవలు, చికిత్సలు, వైద్యపరీక్షల నివేదికలు డిజిటలైజేషన్ కానున్నాయి. ఏ రోగికి ఎటువంటి వైద్యం , మందులు అందించారు, ఏ వార్డులో ఎన్ని రోజులు ఉన్నారు, ఎన్ని రోజుల్లో కోలుకున్నారు.. డిశ్చార్జీ తదితర పూర్తి వివరాలు ఇకపై ఫింగర్‌టిప్స్‌పై లభించనున్నాయి. ప్రత్యేక పద్ధతిలో ప్రతి రోగానికి ఓ కోడ్‌వర్డ్ కేటాయించి పూర్తి వివరాలను కంప్యూటర్ సర్వర్‌లో నిక్షిప్తం చేసి భవిష్యత్‌లో వాటి ఆధారంగా మరింత మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సీ–డాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) సాఫ్ట్‌వేర్‌కు మరిన్ని అదనపు మెరుగులు దిద్దుతున్నారు.

అనుసంధానం పూర్తి

ల్యాబ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఎల్‌ఐఎస్) ద్వారా మైక్రోబయోలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ ల్యాబరేటరీల్లోని సుమారు పది అత్యాధునిక వైద్యయంత్రాలను సీడాక్‌తో అనుసంధానం చేశారు. ఏఎంసీ, టీఎంటీ, పీఐసీయు, ఎస్‌ఐసీయులతోపాటు అత్యవసర విభాగంలో కంప్యూటరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఓపీ, ఐపీ విభాగాల్లో అందిస్తున్న వైద్యసేవలు, రోగుల వివరాల కంప్యూటరీకరణ ఇప్పటికే ప్రారంభమైందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

102 ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీడాక్ సాఫ్ట్‌వేర్..

డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయితే గాంధీఆస్పత్రిలో చికిత్స పొందిన రోగి వివరాలతో పాటు అందించిన వైద్యసేవల వివరాలను దేశవ్యాప్తంగా సీడాక్ సాఫ్ట్‌వేర్ ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూడవచ్చు. తెలంగాణలోని 102 ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీడాక్ సాఫ్ట్‌వేర్ వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి సికింద్రాబాద్ గాంధీ, కింగ్‌కోఠి, మలక్‌పేట ఏరియా ఆస్పత్రుల్లో ఆరేళ్ల క్రితం సీ డాక్ సాఫ్ట్‌వేర్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఆర్థిక ప్రతిబంధకాల నేపథ్యంలో రెండున్నరేళ్ల క్రితం సీడాక్ సంస్థ తన సేవలను నిలిపివేసింది. అదేసమయంలో కోవిడ్ వైరస్ విజృంభించడంతో ప్రభుత్వం స్పందించలేదు. కోవిడ్ అనంతరం వైద్య ఉన్నతాధికారులు సీ డాక్ సంస్థతో సంప్రదించి సేవలను పునరుద్ధరించారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 102 ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీ డాక్ సేవలు ప్రారంభం అయ్యాయి. దీంతో ఆయా వార్డుల్లోని కంప్యూటర్లలోకే నేరుగా ల్యాబ్ నివేదికలు అందించేందుకు నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. సెంట్రల్‌ల్యాబ్‌లో మూత్రం, రక్తం, తెమడ వంటి శాంపిల్స్‌ను సీసాలో ఇస్తే, రోగి వివరాలతో బార్‌కోడ్‌ను రూపొందించి సీసాపై అతికిస్తారు. వాటిని ఆయా ల్యాబరేటరీల్లో వైద్యపరీక్షలు నిర్వహించి బార్‌కోడ్ ఆధారంగా ఆయా వార్డుల్లోని కంప్యూటర్లకు అనుసంధానం చేస్తారు. సుమారు 350 వైద్యపరీక్షలకు చెందిన రిపోర్టులు త్వరితగతిన అందుబాటులోకి రావడంతోపాటు పేపర్ వృధాను నివారించవచ్చని ఆస్పత్రి అధికారులు తెలిపారు.

నెల రోజుల్లో డిజిటలైజేషన్



సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో నెల రోజుల వ్యవధిలో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాము. ఆధార్‌కార్డును అనుసంధానం చేసే విషయమై చర్చలు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే మెడికల్ రికార్డు డిపార్ట్‌మెంట్ (ఎంఆర్‌డీ) కంప్యూటరీకరణ చేపడతాము. పదేళ్ల క్రితం కేస్‌షీట్లను కూడా డిజిటలైజేషన్ చేసి కంప్యూటర్‌లో పొందుపరుస్తాం. మెడికో లీగల్ కేసుల్లో న్యాయస్థానంలో సాక్ష్యం చెప్పేందుకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయి. –ప్రొఫెసర్ రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

సాక్షి బిజినెస్
బుధవారం
22-3-2023

స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	446	58,074
నిఫ్టీ ▲	119	17,108

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్డాక్	11,816	▲ 141
డోజోన్స్	32,463	▲ 182
ఎఫ్టీఎస్ఈ 100	7,536	▲ 132
డాక్స్	15,195	▲ 262
షాంఘై	3,256	▲ 21
నికాయ్ (సోమవారం ముగింపు)	26,946	▽ 388

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

బులియన్ రూ.లలో	
ముంబై	
బంగారం (24 క్యారట్)	59,188
బంగారం (22 క్యారట్)	58,951
వెండి (కిలో)	68,499

ఐటీకి బ్యాంకింగ్ షాక్!



రెండు వారాలుగా అమెరికా, యూరప్ ప్రాంతాల బ్యాంకింగ్ రంగంలో ఒకేసారి సంక్షోభ పరిస్థితులు తలెత్తాయి. పలు బ్యాంకులు మూత పడుతున్నాయి. దీంతో దేశీ ఐటీ రంగానికి సమస్యలు ఎదురుకావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశ్రమ ఆదాయంలో అత్యధిక వాటాకు ప్రాతినిధ్యం వహించే బీఎఫ్ఎస్ఐ విభాగం ఇందుకు కారణం కానున్నట్లు అంచనా.

- విదేశీ బ్యాంకుల వైఫల్యం ఎఫెక్ట్
- భవిష్యత్‌లో డీల్స్, ధరలపై ఒత్తిడి
- వచ్చే ఏడాది ప్రతికూల ఫలితాలు
- సాఫ్ట్‌వేర్ రంగ నిపుణుల అంచనాలు

సాక్షి, బిజినెస్ డెస్క్: కొద్దిరోజులుగా అటు అమెరికా, ఇటు యూరప్ బ్యాంకింగ్ రంగాలలో ప్రకంపనలు పుడుతున్నాయి. అమెరికాలో ఉన్నట్టుండి సిల్వర్‌గేట్ క్యాపిటల్ మూతపడగా.. వైఫల్యాల బాటలో ఉన్న సిలికాన్ వ్యాలీ బ్యాంక్‌ను ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్ప్(ఎఫ్‌డీఐసీ) టేకోవర్ చేసింది. ఈ బాటలో సిగ్నేచర్ బ్యాంక్ సైతం దివాలాకు చేరగా.. న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాంక్ ఆదుకుంది. అనుబంధ సంస్థ ఫ్లాగ్‌స్టార్ బ్యాంక్ ద్వారా ఆస్తుల కొనుగోలుకి అంగీకరించింది. ఇక మరోపక్క యూరోపియన్ బ్లూచిప్ క్రెడిట్ సూసీ దివాలా స్థితికి చేరడంతో స్విస్ కేంద్ర బ్యాంకు కల్పించుకుని ఫైనాన్షియల్ రంగ దిగ్గజం యూబీఎస్‌ను రంగంలోకి దించాల్సి వచ్చింది. ఇక తాజాగా ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును ఆదుకోవాలని జేపీ మోర్గాన్ ఇతర దిగ్గజాలతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 2008 తదుపరి మరోసారి ఫైనాన్షియల్ రంగంలో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా.. ఈ ప్రభావం దేశీ సాఫ్ట్‌వేర్ సేవల రంగాన్ని దెబ్బ తీసే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

కోలుకుంటున్న వేళ

కోవిడ్–19 సవాళ్లలో ఊపందుకున్న సాఫ్ట్‌వేర్ రంగం ఇటీవల రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్లతో కొంత అనిశ్చిత వాతావరణాన్ని చవిచూస్తోంది. దీంతో కొద్ది రోజులుగా ఉద్యోగ నియామకాలు మందగించగా.. వచ్చే ఏడాదిపై ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నాయి. అయితే ఇంతలోనే బ్యాంకింగ్ రంగ సంక్షోభం ద్వారా మరో షాక్ తగలనున్నట్లు పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా ప్రపంచ బ్యాంకింగ్ రంగంలో కుదుపుల కారణంగా దేశీ ఐటీ దిగ్గజాలకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2023–24)లో మరోసారి ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నట్లు చెబుతున్నారు.

బీఎఫ్ఎస్ఐ దెబ్బ

దేశీ ఐటీ సేవల రంగంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) విభాగం ప్రధాన పాత్ర పోషిస్తుంటుంది. సాఫ్ట్‌వేర్ రంగ సమాఖ్య నాస్కామ్ గణాంకాల ప్రకారం మొత్తం ఆదాయంలో 20–40 శాతం వాటాను ఆక్రమిస్తుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23)లో ఈ వాటా 41 శాతాన్ని తాకనున్నట్లు అంచనా. ఇటీవల సవాళ్లు ఎదుర్కొంటున్న బ్యాంకులకు ప్రధానంగా దేశీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎంఫసిస్ సేవలు అందిస్తున్నాయి. ఉదాహరణకు సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూసీ, యూబీఎస్‌లకు టీసీఎస్ ఐటీ సర్వీసులు సమకూర్చుతోంది. ఇన్ఫోసిస్, ఎల్‌టీఐఎం సైతం సేవలు అందిస్తున్నాయి. దీంతో ప్రస్తుత ఏడాది క్యూ4(జనవరి–మార్చి)లోనే ఈ కంపెనీలు ప్రొవిజన్లు చేపట్టే వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. అయితే 2008లో లేమన్ బ్రదర్స్ దివాలా తదుపరి బ్యాంకులు వ్యయాల తగ్గింపు, బిజినెస్ పెంపు ప్రాజెక్టులపై దృష్టి సారించడంతో దీర్ఘకాలంలో ఐటీ రంగం బలపడిన విషయాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. స్వల్ప కాలం నుంచి మధ్యకాలానికి డీల్స్ తగ్గనుండగా.. కాంట్రాక్ట్ ధరలపై సైతం ఒత్తిడి తలెత్తవచ్చని అంచనా. దేశీ ఐటీ దిగ్గజాల ఆదాయాల్లో ఉత్తర అమెరికా, యూరోపియన్ ప్రాంతాలు ప్రధాన పాత్ర పోషించే సంగతి తెలిసిందే. వెరసి ఈ ఏడాది క్యూ4పై పెద్దగా ప్రభావం పడనప్పటికీ వచ్చే ఏడాది ప్రతికూలతలు కనిపించవచ్చని నిపుణులు తెలియజేశారు.

మందగమనం

అంతర్జాతీయంగా బ్యాంకింగ్ రంగం సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకోవడంతో కొత్త డీల్స్ మందగించవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ నిపుణులు పేర్కొంటున్నారు. ఆధునిక ఆటోమేషన్ ప్రాసెస్, ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రణాళికలు తదితరాలకు తాత్కాలికంగా బ్రేక్ పడే వీలున్నట్లు తెలియజేశారు. ఇది ఐటీ కాంట్రాక్టులు ఆలస్యమయ్యేందుకు కారణంకావచ్చని విశ్లేషించారు. తాజా ఐటీ వ్యయ ప్రణాళికలు వాయిదా పడవచ్చని, కొత్త ఆర్డర్లకు విఘాతం కలగవచ్చని రిలయన్స్ సెక్యూరిటీస్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. బీఎఫ్ఎస్ఐ అతిపెద్ద విభాగమని దీంతో దేశీ సాఫ్ట్‌వేర్ సేవలకు దెబ్బ తగలవచ్చని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో... రూ. 1,750 కోట్ల పెట్టుబడులు

- యాంప్లస్ సోలార్ రూ. 1,500 కోట్లు
- ఎలిస్టా రూ. 250 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇటీవల గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌తో ఇన్వెస్టర్ల దృష్టిని మరింతగా ఆకర్షించిన ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు భారీ పెట్టుబడులు రానున్నాయి. యాంప్లస్ సోలార్ రూ. 1,500 కోట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎలిస్టా ఇండియా రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. 7.5 కేపీటీఏ (వార్షికంగా కిలో టన్నులు) సామర్థ్యంతో హరిత హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు యాంప్లస్ సోలార్ తెలిపింది. పారిశ్రామిక వినియోగ అవసరాల కోసం వీటిని నెలకొల్పనున్నట్లు సంస్థ ఎండీ, సీఈవో శరద్ పుంగాలియా వివరించారు. అంతర్జాతీయ హరిత హైడ్రోజన్ హబ్‌గా ఎదగాలన్న భారత లక్ష్య సాకారంలో తాము కూడా పాలుపంచుకోనున్నట్లు ఆయన వివరించారు. ఆ దిశగా ఈ ఎంవోయూ తొలి అడుగు అని శరద్ చెప్పారు. పెట్రోకెమికల్స్, సిమెంటు, ఎరువులు తదితర రంగాల సంస్థలకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక హబ్‌గా మారిన నేపథ్యంలో ఆయా పరిశ్రమల అవసరాల కోసం పునరుత్పాదక విద్యుదుత్పత్తికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. యాంప్లస్ పోర్ట్‌ఫోలియోలో 1.4 గిగావాట్ల సోలార్ అసెట్లు ఉన్నాయి.

కడపలో ఎలిస్టా ప్లాంటు..

దేశీయంగా అమ్మకాలు, ఎగుమతుల కోసం కడపలో తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఎలిస్టా ఇండియా వెల్లడించింది. దీనిపై వచ్చే అయిదేళ్లలో దశలవారీగా రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ సీఎండీ సాకేత్ గౌరవ్ తెలిపారు. తొలుత రూ. 50 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంటులో ఏటా పది లక్షల పైచిలుకు స్మార్ట్ యూనిట్లు, మానిటర్లను తయారు చేయనున్నట్లు ఆయన వివరించారు. అ తర్వాత ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, డిష్‌వాషర్లు వంటి గృహోపకరణాల విభాగాల్లోకి కూడా ప్రవేశించనున్నట్లు గౌరవ్ చెప్పారు. ప్రస్తుతం రూ. 200 కోట్ల స్థాయిలో ఉన్న తమ ఆదాయాలు ఈ ప్లాంటు పూర్తిగా అందుబాటులోకి వస్తే రూ. 1,500 కోట్లకు చేరగలవని ఆయన పేర్కొన్నారు. దీనితో 500 పైగా ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లాంటు నుంచి వచ్చే ఆదాయంలో 60 శాతం వాటా ఎగుమతుల మార్కెట్ నుంచే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు గౌరవ్ తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన టెక్నోడోమ్ గ్రూప్‌లో భాగంగా 2020లో ఎలిస్టా ఏర్పాటైంది.

హ్యుందాయ్ కొత్త వెర్నా




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా మధ్య స్థాయి సెడాన్ కొత్త వెర్నా ప్రవేశపెట్టింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.10.89 లక్షల నుంచి మొదలుకుని రూ.17.37 లక్షల వరకు ఉంది. హోండా సిటీ, స్కోడా స్లావియా, ఫోక్స్‌వ్యాగన్ వర్టస్, మారుతీ సుజుకీ సియాజ్‌కు ఈ కారు పోటీనిస్తుంది. ఇంజన్ రకాన్నిబట్టి మైలేజీ లీటరుకు 18.6–20.6 కిలోమీటర్లు ఇస్తుందని కంపెనీ ప్రకటించింది. ఆరు ఎయిర్‌బ్యాగ్స్‌తో సహా 30 రకాల భద్రత, 17 రకాల లెవెల్–2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ జోడించారు. ఇప్పటికే 8,000 బుకింగ్స్ నమోదయ్యాయి. 2006లో భారత్‌లో వెర్నా అడుగుపెట్టింది. 4.65 లక్షల కార్లు ఇక్కడి రోడ్లపై పరుగెడుతున్నాయి. భారత్ నుంచి 4.5 లక్షల యూనిట్లు వివిధ దేశాలకు సరఫరా అయ్యాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. 2023లో రెండింతలకుపైగా వృద్ధితో 40,000 వెర్నా కార్లను విక్రయించాలన్నది కంపెనీ లక్ష్యం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-3-2023	
విశాఖ	450–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
21-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425–00
వరంగల్	427–00
రిటైల్ ధర	4.95

మళ్లీ లాభాల్లోకి..

- కలిసొచ్చిన ప్రపంచ మార్కెట్ల రికవరీ
- ఫైనాన్స్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు
- సూచీల ర్యాలీకి రిలయన్స్ దన్ను
- 58 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 119 పాయింట్లు



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్‌తో పాటు ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మళ్లీ లాభాలు ఆర్జించాయి. ప్రపంచ బ్యాంకింగ్ రంగ సంక్షోభ నివారణకు ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. అలాగే ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు 25 బేసిస్ పాయింట్లు మాత్రమే ఉండొచ్చనే ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లలోని రికవరీ దేశీయ సూచీలకు దన్నుగా నిలిచింది. క్రూడాయిల్ ధరలు ఏడాదిన్నర కనిష్టానికి దిగిరావడం కూడా కలిసొచ్చింది. ఉదయం సెన్సెక్స్ 334 పాయింట్లు లాభంతో 57,963 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 57,730 వద్ద కనిష్టాన్ని, 58,133 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 446 పాయింట్లు ఎగసి 58,074 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,016–17,128 శ్రేణిలో ట్రేడైంది. చివరికి 119 పాయింట్ల లాభంతో 17,108 వద్ద నిలిచింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లో నెలకొన్న కొనుగోళ్లతో బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5% చొప్పున లాభపడ్డాయి. ఎఫ్‌పీఐలు రూ.1455 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1946 కోట్ల షేర్లను కొన్నారు.

సైన్స్‌లో బోధన,పరిశోధనలకు మార్గం.. సీఎస్ఐఆర్ నెట్

» సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్ 2022/ జూన్ 2023 ప్రకటన
» ఈ స్కోర్‌తో జేఆర్ఎఫ్, లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత
» బ్యాచిలర్, పీజీ ఉత్తీర్ణులకు దరఖాస్తుకు అవకాశం

జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్! ఇది కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. సంయుక్తంగా నిర్వహించే పరీక్ష!! ఇందులో అర్హత సాధిస్తే పీహెచ్‌డీలో చేరే అవకాశంతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. దీంతోపాటు బోధన రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. తాజాగా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్-డిసెంబర్ 2022, జూన్-2023లకు ఉమ్మడి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, విజయం సాధిస్తే లభించే ప్రయోజనాలు తదితర వివరాలు..



సీఎస్ఐఆర్-యూజీసీ నెట్

సైన్స్ పరిశోధనలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. బోధన రంగంలో రాణించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఒకే సమయంలో ఈ రెండు అవకాశాలను అందుకునేందుకు మార్గం.. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్. ఈ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులు సీఎస్ఐఆర్ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన కేంద్రాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పరిశోధన సంస్థల్లో.. పీహెచ్‌డీ చేసేందుకు జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలో) లభిస్తుంది. అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.. ఇలా ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నారు.

అర్హతలు

- కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అర్హులు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులు సంబంధిత కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. బీఎస్సీ(హానర్స్) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. కానీ ఫైనల్ విద్యార్థులు/ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి అర్హత లేదు.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత లేదని పేర్కొన్నారు.

వయసు

జేఆర్ఎఫ్ అభ్యర్థులకు వయసు జూలై 1, 2022 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్,అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ద్వారా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) లభిస్తుంది. అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాధాన్యం జేఆర్ఎఫ్ లేదా లెక్చరర్‌షిప్ తెలియజేయాలి.
- ఫలితాల వెల్లడి సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం-కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే తొలి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున ఫెలోషిప్; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35వేల ఎస్ఆర్ఎఫ్(సీనియర్ ఫెలోషిప్) అందుతుంది.
- యూజీసీ మార్గదర్శకాల ప్రకారం-ఉన్నత విద్యా సంస్థల్లో లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఉత్తీర్ణత ప్రామాణికం.

పరీక్ష మూడు విభాగాలుగా

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష.. ఐదు సబ్జెక్టుల్లో మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. వివరాలు..

కెమికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	40	2	70
సి సబ్జెక్ట్ పేపర్-2	60	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓసియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి సబ్జెక్ట్ పేపర్-2	80	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

లైఫ్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి సబ్జెక్ట్ పేపర్-2	75	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

మ్యాథమెటికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	40	3	75
సి సబ్జెక్ట్ పేపర్-2	60	4.75	95

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 25 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఫిజికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	25	3.5	70
సి సబ్జెక్ట్ పేపర్-2	30	5	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 20 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

విజయం సాధించాలంటే

పార్ట్-ఎ

ఇది అయిదు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పార్ట్-బి

ఈ విభాగంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

పార్ట్-సి

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షిస్తారు. పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో సమాధానాలను గుర్తించాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి.

పీజీ స్థాయి అవగాహన

సీఎస్ఐఆర్-యూజీసీ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌లలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. పార్ట్-సిలో రాణించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. పార్ట్-ఎలో అడిగే జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 12–18, 2023
- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ తేదీలు: జూన్ 6, 7, 8, 2023
- వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in

క్లుప్తంగా...

కొత్త ఆశల పండుగ ఉగాది: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: ఉగాది పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందాల పండుగ ఉగాది కొత్త ఆశలను, ఉజ్వల భవిష్యత్‌ను మోసుకొస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శోభకృత్ నామ సంవత్సరం సమాజంలో శాంతి, శ్రేయస్సు, సామరస్యం, ఆరోగ్యం, సంతోషాన్ని పెంపొందిస్తుందని గవర్నర్ ఆకాంక్షించారు.

ఉగాదితో రైతులకు అన్ని రంగాల్లో శుభం: సీఎం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది.. రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సాగునీరు, తాగునీరు, పచ్చని పంటలతో తెలంగాణలో నిత్య వసంతం నెలకొందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దాని అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందన్నారు. తెలంగాణ సాధించిన ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. శోభకృత్ నామ సంవత్సరంలో తెలంగాణతోపాటు దేశం మరింత గొప్పగా అభివృద్ధి సాధించాలని సీఎం ఆకాంక్షించారు.

ప్రజలకు అన్నీ శుభాలు జరగాలి
సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష



సాక్షి,అమరావతి: శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు అన్నీ శుభాలు జరగాలని, సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని సీఎం వైఎస్ జగన్ అభిలషించారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరాది సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనంతో ప్రారంభమయ్యే ఉగాది, తెలుగు లోగిళ్ళలో నూతన సంవత్సర శోభను తెస్తూ, కొత్త లక్ష్యాలకు, కొత్త ఆలోచనలకు, ప్రతి ఒక్కరి ఉజ్వల భవిష్యత్తుకు, తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. శోభకృత్ నామ సంవత్సరంలో ఇంటింటా ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, ఆనందాలు నిండాలని అభిలషించారు.

ఈ ఉగాది ప్రజలకు విజయాన్ని అందించాలి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలు, పార్టీ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలు అన్ని విధాలుగా విజయం సాధించాలని, సుఖసంతోషాలతో జీవించాలని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు.



థాయ్‌పుసం.. తమిళులకు ఇదో ప్రధాన ఉత్సవం. ఒంటికి శూలాలు గుచ్చుకుని అత్యంత భక్తిప్రపత్తులతో సుబ్రమణ్యస్వామికి మొక్కులు చెల్లించే వేడుక. తమిళనాడుతోపాటు మలేషియా, సింగపూర్, శ్రీలంక, ఇండోనేషియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో స్థిరపడిన తమిళ ప్రజలు ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. అయితే, తెలంగాణలోనూ థాయ్‌పుసంను జరుపుతారు. అదెక్కడ? ఎలా జరుపుతారు? థాయ్‌పుసంకు మనకు ఉన్న సంబంధమేంటి? అన్న వివరాలు తెలుసుకోవాలంటే..

ఓసారి పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాంకు వెళ్లాల్సిందే.. వెళ్దామా మరి..

దేహానికి శూలాలు, కొక్కాలు గుచ్చుకుని మొక్కులు	బోనమెత్తుకుని చింతనిప్పలపై భక్తుల నడక	రామగుండం మండలం అంతర్గాంలో ఏటా నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు

‘థాయ్‌పుసం’ తెలంగాణ స్టైల్లో!

వందల ఏళ్ల తరువాత మాతృ దేశానికి..

1962లో బర్మాలో సైనిక తిరుగుబాటు జరిగిన అనంతరం అక్కడి భారతీయులను కట్టుబట్టలతో దేశం ఖాళీ చేయించారు. భారతీయ మహిళల మెడలోని బంగారు పుస్తెలతాళ్లను సైతం లాక్కుని వెనక్కి పంపారు. దీంతో బతుకుజీవుడా అంటూ పలువురు భారతీయులు మాతృదేశానికి వచ్చారు. వీరి కోసం అప్పట్లో కేంద్ర ప్రభుత్వం దేశంలోని పలు ప్రాంతాల్లో శరణార్థుల శిబిరాలను ఏర్పాటు చేసింది. వాటిల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాం శిబిరం ఒకటి. 1975లో ఇక్కడ శ్రీలంక, తమిళనాడు, ఆంధ్ర నుంచి బర్మాకు వలస వెళ్లిన భారత సంతతివారికి పునరావాసం కల్పించారు. ఈ క్రమంలో అక్కడ



నిప్పుల గుండంలో నడక



జమ్మిచెట్టు కింద స్వయంభూ వెలసిన అమ్మవారిని అప్పటి నుంచి వీరంతా నూకాంబిక–పోచమ్మ అమ్మవారిగా కొలుస్తున్నారు. థాయ్‌పుసం తరహాలో ఇక్కడ కూడా నూకాంబిక అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఒంటినిండా శూలాలు గుచ్చుకుని..

అంతర్గాంలో స్థానిక శరణార్థులు ఏటా ఉగాదికి ముందు అమ్మవారికి నవరాత్రులు నిర్వహించి చివరికి అమావాస్య రోజున ఒంటికి పదునైన శూలాలను గుచ్చుకుని మొక్కులు చెల్లించుకుంటారు. తమను ఆపదలో ఆదుకుంటుందనే నమ్మకంతో అమ్మవారికి ఇలా కృతజ్ఞతలు తెలుపుకుంటారు. శూలాలు గుచ్చుకున్నా.. భక్తుల శరీరాలపై రక్తం కారదు. సిద్ధహస్తులు, అనుభవజ్ఞులైనవారు రక్తనాళాలు తక్కువగా ఉన్న చోటే శూలాలు, కొక్కాలను గుచ్చుతారట. కొందరు వీపుపై కొక్కెలు గుచ్చుకుని చిన్న రథాలు కూడా లాగి తమ భక్తి చాటుకుంటారు. ఈ క్రమంలో భక్తుల నెత్తిన మిగతా భక్తులు పాలు పోస్తుంటారు. తరువాత కావడి ఆట్టంపేరిట అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తూ లయబద్ధంగా నర్తిస్తారు. రాత్రిపూట మరికొందరు భక్తులు చింత నిప్పులగుండంలో నడుస్తారు. శరణార్థులంతా అమ్మవారికి మాలధారణ ఆచరిస్తారు. పసుపు వస్త్రాలు ధరించిన పురుషులు 21 రోజులు, మహిళలు వారం లేదా 11 రోజులపాటు మాలధారణలో ఉంటారు. ఈ ఉత్సవానికి తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా స్థిరపడ్డ వీరి సంతతివారే కాకుండా, లండన్, న్యూజిలాండ్, అండమాన్ నికోబార్, శ్రీలంక నుంచి భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం అంతర్గాంలో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

అంతర్గాంలో శూలాలు ధరించి భక్తుల ఊరేగింపు



అత్యంత భక్తిశ్రద్ధలతో చేస్తున్నాం: రామారావు, ఉత్సవ నిర్వాహకుడు

మా ముత్తాతలను బ్రిటిష్ వారు తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా బర్మా (మయన్మార్)లోని రంగూన్ (ఇప్పుడు యాంగాన్)కు తీసుకెళ్లారు. వారు తమతోపాటు భారతీయ ఆచార వ్యవహారాలను సైతం తీసుకెళ్లారు. తిరిగి ఇండియాకు వచ్చాక మేం మా పూర్వీకుల ఆచారాలను కొనసాగిస్తున్నాం. గ్రామంలో వెలిసిన అత్యంత శక్తిమంతురాలైన నూకాంబిక–పోచమ్మ అమ్మవారికి ఏటా ఉత్సవాలు నిర్వహించి మా భక్తిని చాటుకుంటున్నాం. అత్యంత భక్తి, నిష్ఠలతో శూలాలతో ఒంటికి గుచ్చుకుని, బొనమెత్తుకొని చింతనిప్పులపై నడిచి మొక్కులు చెల్లిస్తుంటాం.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్



భద్రగిరి.. జిగేల్!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 30వ తేదీన శ్రీ సీతారాముల కల్యాణం, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు బుధవారం వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకళ్యాణ వాహ్నిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించగా జిగేల్‌మంటూ మెరిసిపోతూ కనిపించింది.

-భద్రాచలం

1540 ఆశాల పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్



సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో 1540 ఆశాల పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ జిల్లాలో 323, మేడ్చల్ జిల్లాలో 974, రంగారెడ్డి జిల్లాల్లో 243 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని రిజ్వీ సంబంధిత అధికారులను ఆదేశించారు.

9 మంది టీసీలు.. రూ.9.62 కోట్ల పెనాల్టీ వసూలు

దక్షిణ మధ్య రైల్వేలో సరికొత్త రికార్డు

సాక్షి, హైదరాబాద్: రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించే వారి సంఖ్య ఏ స్థాయిలో ఉందో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం తొమ్మిది మంది రైల్వే తనిఖీ సిబ్బంది ఏకంగా రూ.9.62 కోట్లు వసూలు చేశారు. సగటున ఒక్కొక్కరూ రూ.కోటిని మించి వసూలు చేశారన్నమాట. టికెట్ లేకుండా ప్రయాణించేవారు, ముందస్తు బుకింగ్ లేకుండా సామగ్రి తరలించేవారిని గుర్తించి అపరాధ రుసుము వసూలు చేయటంలో తొమ్మిది మంది టికెట్ తనిఖీ సిబ్బంది చురుగ్గా వ్యవహరించి పెద్దమొత్తంలో పెనాల్టీలు వసూలు చేశారు. ఇలా ఒక అధికారి రూ.కోటికి పైగా పెనాల్టీ వసూలు చేయటం రైల్వే చరిత్రలోనే తొలిసారి కావటం విశేషం. సికింద్రాబాద్ డివిజన్ నుంచి ఏడుగురు, గుంతకల్, విజయవాడ డివిజన్ల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఈ ఘనత సాధించారు. సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ నటరాజన్ 12,689 మంది ప్రయాణికుల నుంచి ఏకంగా రూ.9.16 కోట్లు వసూలు చేయటం విశేషం.

నెలాఖరుకు 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ



- ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు
- ఏడాది కాలంలో గణనీయంగా పెరిగిన ఆరోగ్యశ్రీ కేసులు
- తొలిసారి డీపీహెచ్ పరిధి ఆస్పత్రుల్లో 14,965 కేసులు

సాక్షి, హైదరాబాద్: బోధనాసుపత్రుల పరిధిలో భర్తీ చేస్తున్న 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. ధ్రువపత్రాల పరిశీలనతో సహా ఇతర ప్రక్రియలు పూర్తైన నేపథ్యంలో తుది ఫలితాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు, పురోగతిపై హరీశ్ రావు నెలవారీ సమీక్షను మంగళవారం నిర్వహించారు. డీఎంఈ, డీపీహెచ్, టీవీవీపీ పరిధిలోని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులు పెరగటం మంచి పరిణామమన్నారు. 2021–22తో పోల్చితే, 2022–23 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరుకి ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులు గణనీయంగా పెరిగాయన్నారు. డీఎంఈ పరిధిలో 72,225 నుంచి 1,08,223కు పెరగగా, టీవీవీపీలో 66,153 నుంచి 99,744కు పెరిగాయని తెలిపారు. డీపీహెచ్ పరిధిలో కొత్తగా ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభం కావడం వల్ల 14,965 కేసులు నమోదయ్యాయన్నారు. కొత్త మెడికల్ కాలేజీల ద్వారా మరిన్ని పీజీ సీట్లు అందుబాటులోకి రావడం, ఆస్పత్రుల్లో సౌకర్యాలు పెరగటం, ప్రభుత్వాస్పత్రుల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగటం గణనీయమైన మార్పు సాధ్యమైందన్నారు. ఆరోగ్యశ్రీ బృందంతో పాటు, ఆరోగ్య మిత్రలు చేస్తున్న కృషి కూడా ఇందులో ఉందన్నారు. ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ పథకాలు మరింత ప్రభావవంతంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, వెల్‌నెస్ సెంటర్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సుల రాత పరీక్ష



- మేలో నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం
- టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో వైద్యాధికారుల టెన్షన్
- పకడ్బందీగా జరిగేలా భారీ కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- 5,204 స్టాఫ్ నర్స్ పోస్టులకు 40 వేల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్సుల పోస్టులకు నిర్వహించే రాత పరీక్ష బాధ్యతను జేఎన్‌టీయూకు అప్పగించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలోనే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అయితే పరీక్ష పేపర్‌ను మాత్రం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోనే తయారు చేస్తారు. మే నెలలో రాత పరీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. ఇటీవల టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీకేజీ నేపథ్యంలో స్టాఫ్ నర్స్ పోస్టుల పరీక్షను నిర్వహించడంపై అధికారుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు భారీగా కసరత్తు ప్రారంభించారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీని దృష్టిలో పెట్టుకొని అదనపు చర్యలు తీసుకుంటున్నారు.

భారీ డిమాండ్...

స్టాఫ్ నర్స్ పోస్టులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. వైద్య ఆరోగ్యశాఖ 5,204 స్టాఫ్ నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. వాటిని తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ భర్తీ చేయనుంది. మొత్తంగా 40 వేల దరఖాస్తులు వచ్చినట్లు బోర్డు వెల్లడించింది. ఒక్కో స్టాఫ్ నర్స్ పోస్టుకు ఎనిమిది మంది పోటీపడుతున్నారు. ఈ పోస్టులకు పేస్కేల్ రూ. 36,750 – రూ. 1,06,990 మధ్య ఉంటుంది. దాంతో అభ్యర్థుల నుంచి భారీగా డిమాండ్ ఏర్పడింది. కాగా వేలాది మంది అభ్యర్థులు ఇప్పటికే కోచింగ్ తీసుకుంటున్నారు. కాగా, రాత పరీక్షలో మార్కులకు గరిష్టంగా 80 పాయింట్లు ఉంటాయి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గరిష్టంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించిన వారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.

రాతపరీక్ష సిలబస్ ఇదీ..

అనాటమీ ఫిజియాలజీలలో 14 అంశాలు, మైక్రోబయాలజీలో 6 అంశాలు, సైకాలజీ, సోషియాలజీ, ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్, ఫస్ట్ ఎయిడ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, ఎన్విరాన్‌మెంటల్ హైజీన్, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూట్రిషన్, మెడికల్ సర్జికల్ నర్సింగ్, మెంటల్ హెల్త్ నర్సింగ్, చైల్డ్ హెల్త్ నర్సింగ్, మిడ్ వైఫరీ గైనకాలాజికల్ నర్సింగ్, గైనకాలజియల్ నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, నర్సింగ్ ఎడ్యుకేషన్, ఇంట్రడక్షన్ టు రీసెర్చ్, ప్రొఫెషనల్ ట్రెండ్స్ అండ్ అడ్జస్ట్‌మెంట్, నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వార్డ్ మేనేజ్‌మెంట్‌లకు సంబంధించి రాత పరీక్ష సిలబస్ ఉంటుంది. ఈ మేరకు అభ్యర్థులు తయారు కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

భారీగా ఎక్స్‌బీబీ 1.16 వేరియంట్ కేసులు

రాష్ట్రంలో 93 కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: ఎక్స్‌బీబీ1.16 కరోనా కొత్త వేరియంట్ కేసులు తెలంగాణలో ఇప్పటివరకు 93 నమోదయ్యాయి. కొత్త వేరియంట్ కేసులతో తొమ్మిది రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. ఈ నెల 20వ తేదీ వరకు మహారాష్ట్రలో 104 కేసులు, కర్ణాటకలో 57, గుజరాత్‌లో 54, ఢిల్లీలో 19, పుదుచ్చేరిలో 7, హరియాణాలో 6, హిమాచల్ ప్రదేశ్‌లో 3 కేసులు నమోదయ్యాయి. దేశంలో ఆ వేరియంట్ కేసుల సంఖ్య ఇప్పటి వరకు 344కి చేరుకుంది. ఈ వేరియంట్ వైరస్ అధిక వ్యాప్తిని కలిగి ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే దీని తీవ్రతను ఇంకా నిర్ణయించలేదని పేర్కొంటున్నారు. ఈ వేరియంట్ సోకినవారు ఇప్పటివరకు తీవ్రమైన స్థితిలో ఉన్నట్లు ఎక్కడా నిర్ధారణ కాలేదు. ఈ కొత్త వేరియంట్ నిర్ధారణకు జీనోమ్ సీక్వెన్సింగ్ ముఖ్యం. జలుబు, దగ్గు లేదా జ్వరంతో బాధపడేవారు మాస్కులు ధరించాలని, చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంట్లోనే ఉండాలని చెబుతున్నారు.

రాష్ట్రంలో కొత్తగా 23 కరోనా కేసులు నమోదు

రాష్ట్రంలో మంగళవారం 5,122 మంది కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా..వారిలో 23 మంది వైరస్ బారిన పడ్డారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 8.దిక42 లక్షలకు చేరింది. ఒక్క రోజులో కరోనా నుంచి 52 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 190 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

10లోపు అంబేడ్కర్ విగ్రహం సిద్ధం కావాలి
విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వేముల



లక్డీకాపూల్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పనులు ప్రణాళిక ప్రకారం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిందేనని రోడ్లు, భవనాలు శాఖమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. మంగళవారం హుస్సేన్‌సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ప్రధాన విగ్రహం, రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేప్ ఏరియా ప్లాంటేషన్, మెయిన్ ఎంట్రన్స్, వాటర్ ఫౌంటైన్, సాండ్ స్టోన్ వర్క్స్, జీఆర్సీ, గ్రానైట్ ఫ్లోరింగ్, లిఫ్ట్ పనులు, ప్రధాన విగ్రహం వద్దకు వెళ్లే మెట్లు, ర్యాంప్ వర్క్స్, బిల్డింగ్ లోపల ఆడియో విజువల్ రూం, ఫాల్స్ సీలింగ్ తదితర పనులను వేముల పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, నిర్మాణ సంస్థలకు పలు సూచనలు చేశారు. ఈనెల 30 వరకు ప్రధాన విగ్రహం, ఆ లోగా ఎంట్రన్స్ లాన్స్ పూర్తి కావాలన్నారు. వచ్చే నెల 1 వరకు రాక్ గార్డెన్, 5 నాటికి ప్లాంటేషన్ వర్క్స్ ఇలా అన్ని రకాల పనులు 10 లోపు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టంచేశారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కార గ్రహీతలు వీరే..

నాంపల్లి (హైదరాబాద్): వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా ఇచ్చే ప్రతిభా పురస్కారాలను 2020 ఏడాదికిగాను మంగళవారం ప్రకటించింది. డాక్టర్ వై.రామకృష్ణారావు (కవిత), డాక్టర్ లింగంపల్లి రామచంద్ర (విమర్శ), సాజిద్ బిన్ అమర్ (చిత్రలేఖనం), ఎం.వి.రమణారెడ్డి (శిల్పం), డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి(నృత్యం), ధూళిపాళ శ్రీనివాస్ (సంగీతం), దామెర్ల సాయిబాబా (పత్రికా రంగం), బబ్బెళ్ళపాటి గోపాలకృష్ణ సాయి(నాటకం), కిన్నెర బ్రహ్మయ్య (జానపద కళారంగం), డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ (అవధానం), డాక్టర్ బండ సరోజన (ఉత్తమ రచయిత్రి), విహారి (నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ. 20,116 నగదు అందజేసి సత్కరిస్తామని రమేష్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.